

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

14-2-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 14 పేజీలు: 16 వెల: 6.50


## అమలులోకి పిఎం- రాహత్

బంగ్లా ప్రధానిగా రహ్మాన్ ఎంపిక లాంఛనమే 5లో

# సంపద సృష్టికి బాటలు


## విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రం

విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో డేటా సెంటర్

ఐదేళ్లలో 20లక్షల మందికి ఉద్యోగాలు

పిపిపిలో నిర్మించినా హక్కులు ప్రభుత్వానివే

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన సిఎం చంద్రబాబు



**విజయవాడ,ఫిబ్రవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమం, అభివృద్ధి జరిగినప్పుడే సంపద సృష్టి జరిగి రాష్ట్ర బాగుపడుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.ఏపీని ఆర్థికంగా పరిపుష్టం చేసే దిశలో రాష్ట్ర ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందన్నారు.వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మామూలు విధ్వంసం జరగలేదని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్య వాదాలు తెలిపే తీర్మానంపై ధన్యవాదాలు తెలిపే సందర్భంలో సీఎం మాట్లాడుతూ పీపీపీలో ఏదైనా నిర్మిస్తే నిర్ధిష్టకాలం ప్రైవేటు వ్యక్తులు నిర్వహించి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారన్నారు. సంపద రావాలి అభివృద్ధి జరగాలి. సంపద కొంతమంది దగ్గరే పరిమితమవ్వడం సరికాదు. అందరూ శ్రద్ధగా పనిచేస్తే పీ4 దేశం లోనే ఆదర్శంగా మారుతుంది. ప్రతి ఇల్లు సోలార్ విద్యుత్ తయారు చేసేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలి. త్వరలోనే ప్రతి ఒక్కరికీ ఏఐ డాక్టర్‌ను కేటాయిస్తాం. ఏం తినాలి ఏం చేయాలో ఏఐ డాక్టర్ చెబుతుంది. విశాఖలో 15 బిలియన్ల పెట్టుబడితో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. ఐదేళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం. అసెంబ్లీలో నాకు జరిగిన అవమానానికి కన్నీళ్లు పెట్టుకున్నానని, నా మాదిరిగానే ఎంతో మంది కన్నీళ్లు పెటుకున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా అసెంబ్లీలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనపై విమర్శలు చేశారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి ఏర్పాటు చేశామని వ్యాఖ్యానించారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా తనను అరెస్టు చేశారని, పవన్ కల్యాణ్ విశాఖ పర్యటనకు వెళ్తే అడ్డుకున్నారని సీఎం అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కలిశాయని, దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 94 శాతం స్ట్రైక్ రేట్ తో ఓటర్ల గెలిపించారని చంద్రబాబు గుర్తు చేశారు. నాడు మమ్మల్ని అడ్డుకున్నవాళ్లు ఈ రోజు నీతులు చెబుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఈ అసెంబ్లీ బూతులకు నమూనాగా ఉండేదని అన్నారు. అభివృద్ధికి ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చిన జనసేన, బీజేపీకి సీఎం ధన్యవాదాలు తెలిపారు. రాజధాని కోసం 29 వేల మంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని కానీ వారికి ఒక్క పైసా ఇవ్వలేదని అభివృద్ధి చేసి ప్లాట్లు ఇస్తామని చెప్పామని వివరించారు. అలానే రాష్ట్రంలో రౌడీయిజం, నక్సలిజాన్ని నిర్మూలించగలిగాం కానీ రాజకీయ నేతల ముసుగులో నేతలే నేరాలు చేస్తే ఎలా అని సీఎం ప్రశ్నించారు. ఎక్కడికి పోయినా దౌర్జన్యం చేయడం, రోడ్డంతా బ్లాక్ చేస్తున్నారని అన్నారు. గుంటూరు నుంచి విజయవాడ పోవాలంటే ఆరుగంటలా అయితే ఈ ఆరు గంటలూ ప్రజలు నరకం అనుభవించాలా అని ప్రశ్నించారు. జాతీయ రహదారులపై సమావేశాలు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలున్నా >>2



## బడ్జెట్ నేడే

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

దాదాపు రూ.3.50 లక్షల కోట్ల కేటాయింపులు!

మరో ప్రధాన హామీ అమలుకు అవకాశం

**విజయవాడ.జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం 202627 వార్షిక బడ్జెట్ కసరత్తు తుది దశకు చేరుకుంది. అసెంబ్లీలో శనివారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. కాగా, ఈ సారి బడ్జెట్ అభివృద్ధి.. సంక్షేమానికి పెద్ద పీట వేయనున్నారు. దాదాపు రూ 3.45 నుంచి 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలు ఉండే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో ప్రధాన హామీ అమలు దిశగా ఈ బడ్జెట్ లో ప్రకటన ఉండనున్నట్లు సమాచారం. అసెంబ్లీలో 14వ తేదీ ఉదయం 11.15కి శాసనసభలో ఏపీ బడ్జెట్ 2026 27 ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఆ తరువాత వ్యవసాయ శాఖ బడ్జెట్ ను మంత్రి అచ్చెన్నాయుడు సభ ముందు ఉంచనున్నారు. ఈ సారి ప్రత్యేకంగా ఇరిగేషన్ బడ్జెట్ ను సభలో ప్రవేశ పెట్టే అవకాశం ఉంది. దాదాపు రూ 3.50 లక్షల కోట్ల వరకు అంచనాలుగా ఉండే అవకాశం కనిపిస్తోంది. అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే నాలుగు అమలు చేస్తున్నారు. పెండింగ్ లో ఉన్న ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు దాటిన మహిళలకు నెలకు రూ 1500 పథకం పైన బడ్జెట్ లో ప్రకటన చేస్తారని అంచనా వేస్తున్నారు. అదే విధంగా ప్రాధాన్యత రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించే అవకాశం ఉంది. కేంద్ర బడ్జెట్ తరువాత రాష్ట్రానికి కేంద్రం నుంచి పన్నుల వాటా, వివిధ రంగాల్లో వచ్చే నిధుల పైన స్పష్టత రావటంతో.. ఏపీ ప్రభుత్వం ఈ లెక్కల ఆధారంగా బడ్జెట్‌కు తుది రూపు ఇస్తోంది. సంక్షేమం, అభివృద్ధికి సమపాళ్లలో నిధులు కేటాయించేలా ఆర్థిక >>2

## నంబూరు- మంగళగిరి రైల్వే పై ఓవర్‌కు ఆమోదం

అమరావతికి మరింత దగ్గరి మార్గం

టెండర్లు పిలిచిన రైల్వేశాఖ

**రాజంపేట, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** గుంటూరు విజయవాడ రైల్వే సెక్షన్లో అతి ముఖ్యమైన నంబూరు మంగళగిరి రైల్వే స్టేషన్ మధ్య రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి మంజూరు చేస్తూ కేంద్ర రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా శుక్రవారం గుంటూరు డివిజన్ రైల్వే అధికారులు 90.57 కోట్లతో ఈ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు టెండర్లు కూడా పిలిచారు. నాలుగు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి సోమన్న లకు వివరించారు. అంతకుముందు ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కేంద్రమంత్రికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కోరారు. ఈ మేరకు కేంద్రమంత్రి రైల్వే అధికారులతోనూ చర్చించారు.

దీంతో రైల్వే అధికారులు త్వరితగతిన టెండర్లు పిలిచారు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ఈ మార్గము గుండా నేరుగా అమరావతికి చేరుకునేందుకు ఎంతో అవకాశం ఉంటుంది.ముఖ్యంగా విఐటి, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు వెళ్లేందుకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుంది. నంబూరు మంగళగిరి రైల్వేమార్గం లో 14 రైల్వే క్రాసింగ్ గేటు వద్ద నిర్మిస్తారు 18 నెలల్లోగా రైల్వే బ్రిడ్జిని పూర్తి చేయాలని టెండర్ నిబంధనలో పేర్కొన్నారు. నిర్మాణం పూర్తయిన తర్వాత 48 నెలలు డిఫెక్ట్ లైబిలిటీ షరతును రైల్వే అధికారులు విధించారు.






## పార్లమెంటు మార్చి 9కి వాయిదా

లోక్‌సభ స్పీకర్‌పై విపక్షాల అవిశ్వాస తీర్మానం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు శుక్రవారం ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగం నుంచి రోజు మినహా మిగిలిన అన్ని రోజులూ ఉభయ సభల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం, వాగ్వాదం, వాయిదాలతో నడిచింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రిటైర్డ్ ఆర్మీ చీఫ్ నరవణె రాసిన పుస్తకం చేతబట్టి అందులోని అంశాలను సభలో ప్రస్తావనతో మొదలైన రభస కొనసాగింది. చివరకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ లోక్‌సభలో రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై ప్రసంగించకుండానే ఆమోదించేశారు. ఇదిలా ఉండగా, రాహుల్‌గాంధీకి మాట్లాడే అవకాశం కల్పించాలంటూ కాంగ్రెస్ సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు నినాదాలతో చేస్తూ స్పీకర్ పోడియంను చుట్టుముట్ట >>2



## 'తపోవనం' స్వామీజీ సచ్చిదానంద సరస్వతి శివైక్యం

పార్థివ దేహాన్ని దర్శించిన మాజీ మంత్రి యనమల, పలువురు ప్రముఖులు

**తుని, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** దక్షి ణ కాశీగా ప్రసిద్ధిగాంచిన తుని మండలం కుమ్మరి లోవ తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సర స్వతి స్వామీజీ శుక్రవారం గుండెపోటుతో శివైక్యం అయ్యారు. ఆధ్యాత్మిక లోకానికి పున్నమి వెలుగులు నింపిన సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శివైక్యం చెందడంతో ఆయన భక్తులు,శిష్యులు శోక సంద్రంలో తల్లడిల్లిపోయారు. శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ శిష్యుడైన శ్రీసచ్చిదానంద సర స్వతి స్వామీజీ బ్రహ్మచర్య దీక్ష >>2

## 'పోలవరం' వచ్చేయేడు పూర్తి

క్వాంటం నైపుణ్యాల కోర్సుకు 60వేలమందిపైగా రిజిస్ట్రేషన్

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి రాష్ట్రం రోల్‌మోడల్

కానిస్టేబుల్ స్టైపెండ్ రూ.12,500కు పెంపు

అసెంబ్లీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి:** క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు అసెంబ్లీలో వెల్లడించారు. ప్రస్తుతం ఇందన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హారిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్ గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్‌కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్‌ను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాదిలోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్‌ను రూ.4500 నుంచి రూ.12500 కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి? ప్రముఖ పరిశ్రమలకు భూములిస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమితో అందరూ అర్థం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ >>2



బెంగళూరు సమీపంలో బోల్తా పడిన లారీ

## ప్రాణాలు తీసిన జాలీ రైడ్

కారు ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం

మృతుల్లో ఆరుగురు మైనర్ విద్యార్థులే

బెంగళూరు సమీపంలో దుర్ఘటన

150కి.మీ అతివేగంతో నడిపిన కారు

**హిందూపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** జాలీ రైడింగ్ కు వెళ్లి న మైనర్ విద్యార్థులు భీకరమైన రోడ్డు ప్రమాదానికి గురై దుర్మరణం చెందిన పెను విషాదం శుక్రవారం తెల్లవారుజామున బెంగళూరు రూరల్ జిల్లా పరిధిలో జాతీయ రహదారి పై చోటుచేసుకుంది. హృదయ విదారకరమైన ఈ దుర్ఘటనకు సంబంధించి వివరాలు ఇలాఉన్నాయి. బెంగళూరు నగరం కొత్తూరు చెందిన >>2

## కంటైనరే కాలయముడు!

బైక్‌ను తప్పించబోయి, కారుపై బోల్తా పడిన కంటైనర్

కారు నడుపుతున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి

**చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి ఇరువారం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తెల్లవారుజాము ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బెంగళూరు నుండి తన స్వగ్రామం గుడిపాల మండలం 189 రామాపురం గ్రామంకు కారులో వెళ్తున్న అనుదీపక్(18)ను కంటైనర్ రూపంలో కాలయముడు పరలోకానికి తీసుకెళ్ళిపోయాడు. ఉదయం నిర్మానుష్యంగా వున్న ప్రదేశంలో ఒక్కసారిగా వెళ్తున్న కారుపై కంటైనర్ బోల్తా పడటంతో కారు నుజ్జు నుజ్జు అయ్యింది. భారీ బరువు వున్న కంటైనర్ మొత్తం కారుపై పడటంతో కారును డ్రైవ్ చేస్తున్న అనుదీపక్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. వివరాలిలా వున్నాయి. గుడిపాల మండలం 189 రామాపురం గ్రామంకు చెందిన అనుదీపక్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ >>2

## నీట్ ద్వారా నర్సింగ్ ప్రవేశాలు

ప్రభుత్వం కీలక నిర్ణయం

**విజయవాడ.జనవరి 13,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యా రంగానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలను నీట్‌యూజీ పరీక్ష ఆధారంగా నిర్వహించాని నిర్ణయించింది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదముద్ర వేశారు.20266 27 విద్యా సంవత్సరానికి గాను నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నీట్ పరీక్షను విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారులతో ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సింగ్ ప్రవేశాలకు ఉత్తమ విధానంపై చర్చించారు. అనంతరం నీట్ పై కీలక నిర్ణయం తీసుకున్నారు.

# అంబటిపై రగడ



మంత్రి లోకేష్, బొత్స మధ్య తీవ్ర వాగ్వాదం

ముఖ్యమంత్రి తల్లిని అవమానిస్తే సహించం: లోకేష్ ఆగ్రహం

**సచివాలయం,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సం దర్భంగా అధికార,ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థా యిలో వాగ్వివాదం చోటుచేసుకుంది.మాజీమంత్రి అంబటి రాంబాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సభలో దుమారం రేపాయి.మంత్రి నారా లోకేష్ ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ,హోంమంత్రి అనిత మధ్య జరిగిన మాటల యుద్ధంతో సభ వేడెక్కింది.శాసనమండలిలో అంబటి రాంబాబు వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ముఖ్యమంత్రి తల్లిని అంబటి రాంబాబు బహిరంగంగా అవమానించారు.ఇది చిన్న విషయమా? అని ఆయన ప్రశ్నించారు. సొంత తల్లి,చెల్లిని గౌరవించడం వైసీపీ నేతలకు చేతకాకపోవచ్చు కానీ,మహిళలను గౌరవించే సంస్కృతి తమకు ఉందని స్పష్టంచేశారు."జగన్ తల్లి అయినా,చెల్లి అయినా..ఏ మహిళ జోలికి వెళ్ళినా మేము ఊరుకునే ప్రసక్తే లేదు. బెం గళూరులో కూర్చుని ఏదో రెండు చిన్న మాటలు అన్నారని సమర్థించుకోవడం సరికాదు. అంబటి చేసిన స్టేట్‌మెంట్ తప్పో కాదో బొత్స స్పష్టం చేయాలి" అని లోకేష్ డిమాండ్ చేశారు. **అంబటి క్షమాపణ చెప్పారు..దాడులు చేయడం సరైంది కాదు : బొత్స సత్యనారాయణ :** ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అంబటి రాం బాబును వెనకేసుకొచ్చారు.అంబటి ఇంటిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో దుర్మార్గమైన చర్యఅని ఆయన మండిపడ్డారు.ఎవరో కించ పరి చేలా మాట్లాడటంతోనే అంబటి ఆవేశంలో అలా మాట్లాడి ఉండవచ్చని,కానీ వెంటనే విజ్ఞతతో తన మాటలను వెనక్కి తీసుకుని క్షమాపణ కోరారని బొత్స గుర్తుచేశారు. "తప్పు ఎవరు చేసినా తప్పే,మేము సమర్థించడం,కానీ క్షమాపణ చెప్పిన వ్యక్తిని కూడా వేధించడం,వైసీపీ నేతల ఇళ్ళపై పెట్రోల్ బాంబులు వేయడం ఏరకమైన రాజకీయం; ఇలాంటి చర్యలకు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదు అని హెచ్చరించారు.

**రెచ్చగొట్టే వారికా మీరు మద్దతు ఇచ్చేది? : హోం మంత్రి అనిత ధ్వజం:** అంబటి రాంబాబు తల్లిని ఎవరు దూషించారో ఆధారాలు ఇస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామని సవాల్ చేశారు."నా కుక్కను కూడా టచ్ చేయలేదు,ఏ పోలీసు వస్తారో రానివ్వండి"అంటూ అంబటి సవాల్ చేసిన తీరును ఆమె ఎండగట్టారు.తల్లిని,చెల్లిని రెచ్చగొట్టేలా మాట్లాడిన వ్యక్తికి పెద్దల సభలో వైసీపీ సభ్యులు మద్దతు తెలపడం వారి సంస్కృతికి నిదర్శనమని,అసలు వారికి కనీసం 'సెన్స్' ఉందా అని ఆమె ప్రశ్నించారు. శాసన మండలిలో జరిగిన ఈ చర్చ రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది.మహిళల పట్ల గౌరవం, రాజకీయ భాషా సంస్కృతిపై అధికార, ప్రతి పక్షాలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు గుప్పిం చుకున్నాయి.

## సాగరమాల ద్వారా హార్బర్ల ఆధునీకరణ

2లో

14-02Pg7exHMNWJQE.qxd:14-02Pg7exHMNWJQE.qxd 1/1/02 7:54 AM Page 1





ఇంటర్ పరీక్షల నిర్వహణపై అధికారులతో కలెక్టర్ లక్ష్మీశా సమీక్ష

## దూరవిద్య ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: దూరవిద్య ద్వారా ఇంటర్ మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని ఎన్టీఆర్ జిల్లాకలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణకు సన్నద్ధతపై శుక్రవారం వివిధశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీశా మాట్లాడుతూ మార్చి 2వతేదీ నుండి 13వతేదీ వరకు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లావ్యాప్తంగా విజయవాడ డివిజన్‌లో 603, నందిగామ 882, తిరువూరు 369, మొత్తం 1854 మంది విద్యార్థులు ఈపరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. ఇందుకోసం 11 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు ఛీఫ్ సూపరింటిండెంట్‌లను నియమించామని, పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలు చేయటంతోపాటు, బందోబస్తు, భద్రతా చర్యలు, సిసి కెమెరాల నిఘా విషయంలో పోలీసుశాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. పరీక్షల్లో అక్రమాలను నిరోధించటానికి మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించాలని, పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో హాజరయ్యేందుకు ప్రజారవాణా అధికారులు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యుత్ అవాంతారాలు రాకుండా చూడాలని, తాగునీరు అందుబాటులో ఉంచటంతోపాటు, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో డిఆర్వో లక్ష్మీనరసింహం, డిఈఓ ఎల్.చంద్రకళ, డియంహెచ్ఓ డాక్టర్ యం.సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

### నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 17వతేదీన చేపట్టే జాతీయనులిపురుగుల నిర్మూలనా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబందిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ లక్ష్మీశా పిలుపు నిచ్చారు. నులిపురుగుల నిర్మూలనా కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం కలెక్టర్ వివిధశాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 5లక్షల మందికి నులిపురుగుల నివారణా మందులు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. ఏడాది నుండి రెండేళ్ళ చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు 200 యంజి డోస్ ఇవ్వాలని, మిగిలిన వారికి 400 యంజి సింగిల్‌డోస్‌లో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 17వతేదీ మాత్రలు తీసుకోని వారికి ఈనెల 24వతేదీ మాత్రలు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తుంటే ఎందుకు స్పందించారు: హైకోర్టు

విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: విశాఖజిల్లా, భీమునిపట్నం పరిధిలో సిఆర్ జెడ్ నిబంధనలకు వ్యతిరేకంగా తీరానికి సమీపంలో కాంక్రీట్ గోడ నిర్మాణం జరుగుతోందని తెలిసి కూడా చర్యలు తీసుకోని అధికారులపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి అధికారులను రక్షి ంచేందుకు జివిఎంసి కమిషనర్ ప్రయత్నిస్తున్నారని అభిప్రాయపడింది. బాధ్యులైన అధికారుల వివరాలివ్వాలని కోరితే కమిషనర్ ఇవ్వలేదని ఆక్షేపించింది. వాళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించింది. అలాగే గోడ కూల్చడం ద్వారా పోగైన వ్యర్థాలను మూడు వారాల్లో తొలగించాలని జివిఎంసి కమిషనర్ను చీఫ్ జస్టిస్ దీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలిచ్చింది. భీమునిపట్నం పరిధిలోని సీఆర్ జెడ్1 ప్రాంతంలో సముద్రానికి అతిసమీపంలో మాజీ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనక నేహారెడ్డి అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్పీ శాశ్వత కాంక్రీట్ నిర్మాణాలు చేయడంపై జనసేన కార్పొరేటర్ పిఎల్వీఎన్ మూర్తి యాదవ్ వేసిన పిల్పై తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## వెనుకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు

అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రం విడిపోయిన తర్వాత వెనుకబడిన ప్రాంతాలు మరింత నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయని, ఇలాగే కొనసాగితే ఈ ప్రాంతాలలో ప్రజల నుండి తీవ్రమైన తిరుగుబాటు వస్తుందని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు అభిప్రాయం వ్యక్తం చేశారు. వేదిక నాయకులు శుక్రవారం కడపలో సమావేశమై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల గురించి చర్చించి సమాలోచనలు చేశారు. ఈ సందర్భంగా వెనక బడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు మాట్లాడుతూ.. 2026-27 బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన ప్రాంతాలకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెనుక బడిన అభివృద్ధి ప్రాంతాల్లో ఆయకట్టుకు నీళ్ల ఇవ్వాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ కల్పన చేయాలని, నీళ్లు, నిధులు, నియామకాలు అన్ని ప్రాంతాలకు సమానంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 60 సంవత్సరములుగా పేద ప్రజల పండగ నిలబడిన ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ రెన్యువల్ చేయాలని, మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం-2005ను పునరుద్ధరించాలని, విభజన చట్టంలో పొందుపరిచిన బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీని వెనుకబడిన ప్రాంతాలకు అమలు చేయాలని కోరుతూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రాంతాలలో జాతాలు నిర్వహించి ప్రజలను సంఘటితం చేయాలని కడపలో జరిగిన రాష్ట్ర స్థాయివేదిక సమావేశంలో తీర్మానించినట్లు వేదిక నేతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణ, కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులు కేవీ రమణ, జి.నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగా వృద్ధాప్య, వితంతు పింఛన్లు


● విధివిధానాలు రెడీ ● త్వరలోనే దరఖాస్తుల స్వీకరణ ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రంలో కొత్తగా వృద్ధాప్య. వితంతు పింఛన్లు ఇచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నట్లు శాసనమండలిలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వీటి కోసం ఇప్పటికే విధివిధానాలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ మేరకు త్వరలోనే కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ ప్రారంభం కాగానే అర్హులైన వారికి దరఖాస్తు చేసే అవకాశం కల్పించనున్నారు. దీనిపై అధికారిక నోటిఫికేషన్ త్వరలో విడుదల కానుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందే పెన్షన్ల పెంపు హామీ ఇచ్చింది. అన్నట్లుగానే సూపర్ సిక్స్ లో భాగంగా వృద్ధాప్య, వితంతు పెన్షన్లను 4 వేలకు పెంచారు. అలాగే దివ్యాంగుల పెన్షన్లను 6 వేలకు పెంచారు. అనంతరం అనర్హుల ఏరివేత కోసం భారీ కసరత్తు చేశారు. దీంతో పెన్షన్ల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ అర్హులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం విధివిధానాలను ఖరారు చేస్తోంది. త్వరలోనే దరఖాస్తుల ప్రక్రియను సచివాలయాల ద్వారా ప్రారంభించబోతున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

# స్వర్ణాంధ్ర దిశగా పర్యాటకం

● గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి ● మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: "నేషనల్ ట్రావెల్ మార్ట్" కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు, ఎకోఅడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్‌లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన, ఆవిష్కరణ లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. కేంద్రం



సహకారంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 202429, పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ.20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం ఖీఈజ్ ఆఫ్ డూయింగ్‌ఖీ మాత్రమే కాకుండా, ఖీస్పీడ్ ఆఫ్ డూయింగ్‌ఖీ ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. **భవిష్యత్తు ప్రణాళికలు:** విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభి స్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్‌లైట్ మోడల్ పెట్టు బడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ మరియు వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక ఖీస్టార్టప్‌ఖీ లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఛత్తీస్‌గఢ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నీలూశర్మ, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట, ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ వివేక్ ఆచార్య, ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏడీటీవోఐ ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, విజయ్ మోహన్, స్వామినాయుడు, మహాపాత్ర, టూర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు, జీరో అవర్‌లకు సమయం పరిమితం

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో నూతన పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రశ్నోత్తరాల సమయాన్ని గాని, జీరో అవర్‌నుగాని గంటకు పరిమితం చేసారు. సమయ పాలన చట్టసభలో అవసరమని స్పీకరు తెల్చిచెబుతున్నారు. శుక్రవారం ఈ విధానాన్ని కచ్చితంగా అమలు చేసారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సమయంలో పలు అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు బదులిచ్చారు. పెందుర్తి నియోజకవర్గంలో మినీ జెట్టి నిర్మాణంపై పంచకర్ల రమేశ్ బాబు ప్రశ్నించారు. ఆయన అడిగిన ప్రశ్నకు మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం ఇచ్చారు. జువలదిన్నె, మచిలీపట్నం వంటి ఫిషింగ్ హార్బర్‌ల నిర్మాణాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. పనులు లేని సమయంలో రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచి పని కల్పించామన్నారు. విశాఖపట్నం హార్బర్ చాలా దారుణంగా తయారైందని అన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో అధునాతన పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. సాగరమాల కార్యక్రమం ద్వారా మత్స్యకారులను న్యాయం చేస్తామన్నారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ముత్యాలమ్మపాలెం జెట్టి నిర్మాణానికి సరైనదని ప్రభుత్వం రిపోర్టు కూడా ఇచ్చిందని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జీరో అవర్లో పలువురు సభ్యులు స్థానిక అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో తాగునీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే కాకర్ల రమేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ సుజల పథకం కింద 331 ఆవాసాలకు నీరందించే ప్రాజెక్టు పనులు ఏళ్ల తరబడి ప్రారంభం కాలేదని చెప్పారు. ఇందుకోసం రూ.8.5 కోట్లు మంజూరు చేశారని, ఈ ప్రాజెక్టును రద్దు చేసి, కొత్తది ప్రారంభించడమా లేక దీనినే పూర్తి చేయడమా అనే అంశాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతుందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రస్తావించారు. జాప్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సత్యవేడు నియోజకవర్గం పరిధిలోని కె.బి పురం రాయల చెరువు కట్ట తెగిపోవడం కారణంగా ముంపునకు గురై వెయ్యి ఎకరాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చెప్పారు. పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వంశధార ప్రాజెక్టు నిర్వాసితుల్లో కొద్ది మందికి ఇప్పటికీ పరిహారం చెల్లించలేదని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. గతంలో రైతులు ఆందోళనలు చేసిన సమయంలో వారిపై కేసులు పెట్టడంతో అనేక మంది రైతులు గ్రామాలను వదిలి ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారని, ఈ కేసులను తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరాంధ్ర సృజల స్రవంతి పథకాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని చోడవరం ఎమ్మెల్యే కెఎన్ఎస్ సన్యాసి రాజు ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ, పారిశ్రామిక అవసరాలకు పుష్కలంగా నీరు అందు తుందని తెలిపారు. పార్వతీపురం జిల్లాలోని రెవిన్యూ కార్యాలయాల్లో ఉండాల్సిన రెవెన్యూ రికార్డులు గత వైసిపి ఎమ్మెల్యేల ఇళ్లలో ఉన్నాయని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. గత ఎమ్మెల్యేలు, ఆయా మండల తహశీల్దారు సంతకాలను ఫోర్జరీ చేశారని, ఈ అంశంపై విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలో గత ప్రభుత్వం ప్రజల భూములను 220గా నమోదు చేసిందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చెప్పారు. వీటిని పరిశీలించి జాబితాలోని వాస్తవంగా లేని వాటిని తొలగించి ప్రజలకు న్యాయం చేయాలన్నారు. శ్రీకాళహస్తి నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరారు. సాగర్ ఎడమ కాల్వ నుంచి రాష్ట్రానికి అందాల్సిన వాటా ప్రకారం తెలంగాణ అధికారులు నీటిని విడుదల చేయడం లేదని మైలవరం ఎమ్మెల్యే . వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ సీజన్లో 14 టిఎంసీలు విడుదల చేయాల్సి ఉండగా 1.6 టిఎంసిలు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. జలవరుల శాఖ మంత్రి తెలంగాణ మంత్రితో చర్చించి సమస్య పరిష్కరించాలని కోరారు. మదనపల్లె జిల్లాలోని వక్ఫ్ భూముల్లో 100 షెడ్లును గత ప్రభుత్వంలో తొలగించారని, వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం చేశారన్నారు. వక్ఫ్ బోర్డులో రూ.3 కోట్ల నిధులు దుర్వినియోగం అయిన ఘటనపై విచారణ నిర్వహించాలని కోరారు. ఏలూరు నగరంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసి 1 సెంటు స్థలం కేటాయించారని, ఆ లబ్దిదారులందరికీ 2 సెంట్లు స్థలం కోటాయించాలని ఎమ్మెల్యే బడేటి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు.

## పిజిఆర్ఎస్ ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూకు సంబంధించినవే

- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

విజయవాడ, జనవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: పీజీఆర్ఎస్ ద్వారా వస్తున్న ఫిర్యాదుల్లో 61 శాతం రెవెన్యూకు సంబంధించినవి ఉన్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రెవెన్యూ సదస్సులు, ఫిర్యాదుల పరిష్కారంపై ఎమ్మెల్యేలు బుచ్చయ్య చౌదరి, ధూళిపాళ్ల నరేంద్ర అసెంబ్లీలో అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నట్లు అనగాని తెలిపారు. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రి వర్గ ఉప సంఘం వేశామని, చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తామని ఆయన చెప్పారు. ఆ తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయి: రీసర్వేలపై కూడా లక్షా 70వేల ఫిర్యాదులు వచ్చాయన్నారు. జేసీల దగ్గర ఉన్న అధికారాలు ఆర్డీఓ, ఎమ్మార్వోకు ఇచ్చి వేగంగా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. రెవన్యూ సదస్సులు పెడుతున్నా ఇంకా ఎందుకు సమస్యలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు గట్టిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పిదాలు ఇంకా వెంటాడుతున్నాయని, ఫ్రీ హోల్డ్ భూములుకు సంబంధించి జిల్లా కలెక్టర్‌లు వాగులు వంకలు ఇష్టానుసారంగా మార్చారని ఆరోపించారు. లిటిగేషన్ ఉన్న భూములను వైఎస్సార్సీపీకి చెందిన మాజీ శాసనసభ్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు ఫ్రీహోల్డ్, ఈనాం భూముల గురించిన అన్ని అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలనలు జరుతున్నాం. ప్రతీ నెల సంబంధిత అధికారులతో చర్చలు జరిపి చర్యలు చేపడుతున్నాం. పేదవారికి ఎలాంటి నష్టం జరగకుండా చూసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. వైఎస్సార్సీపీ హయాంలో రికార్డులు మార్చిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఫ్రీ హోల్డర్ భూముల విషయంలో మంత్రివర్గ ఉపసంఘం వేశాం. చట్ట వ్యతిరేకంగా జరిగిన వాటిని గుర్తించి సరిచేస్తామని తెలిపారు.

### శాసనసభలో మూడు బిల్లులు ఆమోదం

శాసనసభలో ఇవాళ మూడు బిల్లులకు ఆమోదం లభించింది. మున్సిపల్ చట్టంలో సవరణలు చేస్తూ రెండు బిల్లులను ప్రవేశ పెట్టారు. మంత్రి నారాయణ శాసనమండలిలో ఉండటంతో ఆయన బదులు మంత్రి టీజీ భరత్ ఈ బిల్లులు ప్రవేశ పెట్టారు. విద్యుత్తు చట్టంలో సవరణలు ప్రతిపాదిస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. ఈ మూడు బిల్లులు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదం పొందాయి.

## దాచాలంటే దాగవులే గణాంకాల్లోకి గుట్టు

### సగం పూర్తయిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే

పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ఒక వ్యక్తికి, తన కుటుంబానికి సంబంధించిన అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయడం ద్వారా ప్రభుత్వానికి చేరబోతున్నాయి. దీనికి సంబంధించి యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పేరుతో గత ఏడాది డిసెంబర్ నెల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సర్వే కార్యక్రమాన్ని వేగంగా నిర్వహిస్తున్నారు. ఈ సర్వేలో వ్యక్తిగత సమాచారంతోపాటు కుటుంబ స్థాయిని కూడా సమగ్రంగా ప్రభుత్వానికి అందించనున్నారు. గ్రామస్థాయిలో జిఎస్‌డబ్ల్యుఎస్ (స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు) సిబ్బందినీ, పంచాయితీ సిబ్బందితో కలిపి ఎంపీడీవో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సర్వే కార్యక్రమం ద్వారా ప్రతి వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు 20 ప్రశ్నల రూపంలో సంధించి వాటికి సంబంధించిన ఆధారాలు, కొన్ని ధ్రువీకరణ పత్రాలతో సహా డిజిటలైజేషన్ చేస్తున్నారు. యాప్‌లో వివరాలన్నీ ఆధార ఓటిపి ద్వారా సమర్పిస్తున్నారు. పూర్తిస్థాయి వివరాలను సదరు వ్యక్తి తప్పనిసరిగా చెప్పవలసి ఉంటుంది. డిసెంబర్లో ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈరోజుకి 50శాతం మాత్రమే పూర్తయినట్టు తెలుస్తుంది. ఈ సర్వే పూర్తిచేయడంలో రాష్ట్రవ్యాప్తంగా నంద్యాల జిల్లా 71 శాతంతో అగ్రస్థానంలో ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లా 32 శాతంతో చివరి స్థానంలో ఉంది. పశ్చిమగోదావరి జిల్లా 52 శాతం, ఏలూరు జిల్లా 62 శాతం పూర్తి చేసుకున్నాయి. ఈ యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో పౌరుల ప్రాథమిక సమాచారం, సామాజిక సమాచారం, విద్య నైపుణ్యం సమాచారాలతో పాటు ఉపాధి జీవనోపాధి విభాగాల్లో ప్రశ్నలు రూపొందించారు. అంతేకాక ప్రభుత్వాన్ని నుంచి పొందిన ధ్రువపత్రాలను కూడా యాప్లో పొందుపరుస్తున్నారు. ఈ సర్వే కోసం ప్రత్యేకంగా మొబైల్ యాప్‌ను రూపొందించడమే కాకుండా అవి ఎప్పటికప్పుడు ప్రభుత్వ డొమైన్ లోనికి డంపు అయ్యేలా డిజైన్ చేశారు. ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే కి సంబంధించి పూర్తి ప్రశ్నల జాబితాను, వెరిఫికేషన్ విధానాన్ని ఆన్లైన్లో అందుబాటులో ఉంచారు వీటి ద్వారా పౌరులు సిద్ధంగా ఉండడానికి వెసులుబాటుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా సచివాలయ సిబ్బందికి పంచాయతీ సిబ్బందికి మధ్య సమన్వయం లోపించడంతో ఈ సర్వే కొన్నిచోట్ల మందకొడిగా సాగుతుందని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు దీనికి సంబంధించి పశ్చిమగోదావరి జిల్లా ఇరగవరం మండల పరిషత్ అధికారి రెవిన్యూ అధికారులకు నోటీసులు సైతం జారీ చేసినట్లు విశ్వసనీయ సమాచారం.





## శ్రీసిటీలో స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం

సత్యవేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: భారతదేశ ఆర్థిక భవిష్యత్ దేశీయ సామర్థ్యాల బలోపేతం, ఆవిష్కరణల ఆధారిత వృద్ధి, విధాన స్థిరత్వంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్, ఆర్థిక నిపుణులు, స్వదేశీ జాగరణ మంచ్ జాతీయ కన్వీనర్ ఆర్.సుందరం పేర్కొన్నారు. పన్నులు, కార్పొరేట్ చట్టం, ఆర్థిక విధానంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న ఆయన శుక్రవారం శ్రీసిటీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పరిశ్రమల ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. అతిథికి సాదర స్వాగతం పలికిన శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మారుతున్న విధానాలు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా పరిశ్రమ వర్గాలను చైతన్యవంతులను చేయడానికి సంబంధిత నిపుణులతో తరచూ ఈ తరహా కార్యక్రమాల నిర్వహణ ప్రాముఖ్యతను వివరించారు. మారుతున్న గ్లోబల్ పరిస్థితుల్లో భారత ఆర్థిక వ్యవస్థ అనే అంశంపై ప్రసంగించిన సుందరం, ప్రధానంగా ప్రపంచ ఆర్థిక పరిణామాలు, భారత ఆర్థిక వ్యవస్థలోని నిర్మాణాత్మక బలాలను ప్రస్తావించారు. స్వావలంబన, స్వయం సమృద్ధి, బలమైన సరఫరా గొలుసులు, దేశీయ విలువ సృష్టి ప్రాధాన్యతను వివరించిన ఆయన, దేశ పురోగాభివృద్ధిలో బలమైన పరిశ్రమ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిశ్రమలకు చెందిన పలువురు సీఈవోలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## శ్రీకాళహస్తీశ్వరునికి ఇంద్రకీలాద్రి అమ్మవారి పట్టువస్త్రాల సమర్పణ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త : దక్షిణ కాశీ శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వేడుకగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా, ఫిబ్రవరి 15న జరగనున్న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ వారి తరపున శ్రీకాళహస్తీశ్వర స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. సమర్పించారు. శుక్రవారం దుర్గగుడి పాలక మండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వి.కె. సీనా నాయక్ నేతృత్వంలో ప్రతినిధి బృందం స్వామివారికి పట్టు వస్త్రాలు తీసుకొనిరాగా శ్రీకాళహస్తి దేవస్థానం ఈ.ఓ బాపిరెడ్డి, ఆలయ వేద పండితులు మరియు అర్చకులు మంగళవాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు దుర్గగుడి ప్రతినిధులకు ఆశీర్వచనాలు పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

### వైభవంగా మహాశివరాత్రి మహోత్సవాలు



ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో మహాశివరాత్రి మహోత్సవాలు శుక్రవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు పవిత్ర మంగళ స్నానాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించే కన్నుల పండుగ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఆలయ ఈ.ఓ వి.కె. సీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీ ధర్మారావు, మన్నె కళావతి, సరోజి పద్మశేఖర్, పద్మావతి ఠాకూర్, సరిత మరియు ప్రత్యేక ఆహ్వానితులు వేలగపూడి శంకర్ బాబు పాల్గొన్నారు. సాయంత్రం గణపతి పూజ, మండపారాధన, గణపతి పూజ, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠాపన, మూల హవన పూజలు, బలిహరణ, హారతి, మంత్రపుష్పం, అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిపారు.

## అమరావతి పనుల ప్రతిపాదనలపై స్క్రీనింగ్ కమిటీ

విజయవాడ.ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి పనుల ప్రతిపాదనలకు సంబంధించి అథారిటీ ముందుంచే ప్రతిపాదనలు పరిశీలించేందుకు కమిషనర్ కన్నబాబు ఆధ్వర్యాన కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకూ అథారిటీ ముందుకు వెళ్లే ప్రతిపాదనలు చాలా వరకూ ఆమోదించిన తరువాత సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అందువల్ల ముందుగానే కమిటీ నుండి అన్ని విధాలా స్క్రూటినీ చేసి అథారిటీకి పంపాలని నిర్ణయించారు. సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో న్యాయవిభాగ అదనపు సెక్రటరీ అరవింద్ రమణి, ఆర్థికశాఖ అదనపు కార్యదర్శి జంపాని శివయ్య, సలహాదారు లక్ష్మీ ్మనాయక్, పట్టణాభివృద్ధిశాఖ ఓఎస్‌డి వెంకట సుబ్బయ్య, పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి ప్రభాకరరావు, సిడిఎంఎ డిడి చిట్టిబాబు, ఎడిసిఎల్ సిఇ ధనుంజయ్య సభ్యులుగా ఉన్నారు.

## టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా విశ్వనాథ రాజు

గుంటూరు, ఫిబ్రవరి 13 ప్రభాత వార్త ప్రతినిధి: శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్ గా గుంటూరు అటవీ సంరక్షణాధికారిగా పనిచేస్తున్న ఐ. కాశీ విశ్వనాథ రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఫీల్డ్ డైరెక్టర్‌గా పనిచేసిన బి.విజయ కుమార్‌ను రాష్ట్ర అటవీశాఖ అధికారికి రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. విశ్వనాధ రాజు ఫీల్డ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో పనిచేయనున్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ లో నాగార్జున సాగర్ శ్రీశైలం టైగర్ రిజర్వ్‌ను కలిగి ఉంది. కుర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో ఈ సర్కిల్ విస్తరించి ఉంది.

## ఆర్డిటి ఎఫ్‌సిఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించండి

### కేంద్ర హోంశాఖను కోరిన అనంతపురం ఎంపి లక్ష్మినారాయణ



అనంతపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త బ్యూరో: అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మినారాయణ అనంతపురం కేంద్రంగా సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్‌కు సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఎ రిజిస్ట్రేషన్ పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వాన్ని టీడీపీ పార్లమెంటరీ ఫ్లోర్ లీడర్ లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాజ్యసభ ఎంపీ సానా సతీష్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి కలిసి కేంద్ర హోంశాఖ సెక్రటరీ గోవింద్ మోహన్‌ని కోరారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాని కలిసి ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణ అంశాన్ని ప్రస్తావించగా, ఆ మేరకు హోం కార్యదర్శికి లేఖ పంపబడింది. ఆ లేఖ ఆధారంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఆదేశాల మేరకు ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కేంద్ర హోంశాఖ సెక్రటరీ గోవింద్ మోహన్‌ను శుక్రవారం ఢిల్లీలో కలిసి ఆర్‌డిటికి సంబంధించిన ఎఫ్‌సిఆర్‌ఏ పునరుద్ధరణను త్వరితగతిన పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. 1969 నుంచి ఆర్‌డిటి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో వివిధ రంగాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా చేస్తోందని, ప్రజలకు ఎంతో మేలు చేసిందని, రాజకీయేతర, లౌకిక సంస్థగా ఆర్‌డిటి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తోందని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో 2025లో కొత్తగా దాఖలు చేసిన ఎఫ్‌సిఆర్‌ఏ దరఖాస్తు ఇప్పటికీ పెండింగ్‌లో ఉండటంతో ఆసుపత్రులు, విద్యా, సంక్షేమ కార్యక్రమాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొంటూ, మానవతా సేవలు కొనసాగేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఎంపీ కోరారు.

## మనమిత్ర వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

విజయవాడ, ఫిబ్రవరి13,ప్రభాతవార్తప్రతినిధి: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేట్ కళాశాలకు చెక్ పెట్టింది. ఫీజు చెల్లిస్తే గాని హాల్ టికెట్లు ఇవ్వం అన్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని ఇంటర్మీడియట్ విద్యార్థులకు నేరుగా మనమిత్ర వాట్సాప్ ద్వారా డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చుని ఇంటర్మీడియట్ బోర్డు విద్యా మండలి కార్యదర్శి రంజిత్ భాష శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల హాల్ టికెట్లను శుక్రవారం ఉదయం 11 గంటలకు విడుదల చేశారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్‌బాషా తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా నేరుగా హాల్‌టికెట్లు పొందొచ్చన్నారు. మొదటి సంవత్సరం వారు పదో తరగతి హాల్ టికెట్ నంబరు, ద్వితీయ సంవత్సరం వారు మొదటి సంవత్సరం హాల్ టికెట్ నంబరు లేదా ఆధార్ నంబరు, పుట్టిన తేదీ వివరాలు నమోదు చేసి హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చుని సూచించారు. మనమిత్ర వాట్సప్ నంబరు 955230 0009కు హాయ్ అని మెసేజ్ పెట్టి, హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. హాల్ టికెట్లపై కళాశాల ప్రిన్సిపల్, కళాశాల స్టాంప్ అవసరం లేదని తెలిపారు.

14-2Pg5ff.qxd:14-2Pg5ff.qxd 1/1/02 6:17 AM Page 1



## ఇరాన్‌పై దాడికి అమెరికా సన్నాహాలు!

# అతిపెద్ద విమాన వాహక నౌకను మధ్య ప్రాచ్యంవైపు తరలిస్తున్న యుఎస్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 13:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరుకుంటున్న వేళ, ట్రంప్ ప్రభుత్వం తమ సైనిక శక్తిని ప్రదర్శిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద విమాన వాహక నౌక అయిన యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్. ఫోర్డ్‌ను కరేబియన్ సముద్రం నుంచి మధ్యప్రాచ్యం వైపు తరలిస్తోంది. ఇరాన్ పై సైనిక ఒత్తిడిని మరింత పెంచేందుకే ఈ చర్య తీసుకున్నట్టు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొం టున్నాయి. ఇరాన్‌తో అణు కార్యక్రమం పై చర్చలు విఫలమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవలే హెచ్చరించిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం ఒమన్ వేదికగా ఇరు దేశాల మధ్య పరోక్షంగా చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలు కొలిక్కి రాకపోతే దాడులకు దిగేందుకైనా సిద్ధమేనని అమెరికా సంకేతాలిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. పశ్చిమాసియాలో ఇప్పటికే యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ విమాన వాహక నౌక సమూహం మోహరించి ఉంది. ఇప్పుడు జెరాల్డ్ ఫోర్డ్ కూడా చేరనుండటంతో ఆ ప్రాంతంలో అమెరికాకు చెందిన రెండు శక్తివంతమైన విమాన వాహక నౌకలు అందుబాటులో ఉంటాయి. కరేబియన్‌లో ఉన్న జెరాల్డ్ ఫోర్డ్ స్ట్రైక్ గ్రూప్ అట్లాంటిక్ మహాసముద్రం, మధ్యధరా సముద్రం మీదుగా పర్షియన్ గల్ఫ్ వైపు పయనిస్తోంది. ఈ నౌకతో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ మ్రూయాన్స్, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీ వంటి అత్యాధునిక డిస్ట్రాయర్లు కూడా ఈ బృందంలో ఉన్నాయి. ఈ విమానవాహక నౌక మే నెల ఆరంభం వరకు మధ్యప్రాచ్యంలోనే ఉండే అవకాశం ఉందని, దీంతో దీని మోహరింపు కాలం 10 నెలలకు పొడిగించవచ్చని తెలుస్తోంది. గతంలో వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను బంధించేందుకు అమెరికా చేపట్టిన సైనిక చర్యలో జెరాల్డ్ ఫోర్డ్ నుంచే యుద్ధ విమానాలు పాల్గొన్నాయని నివేదికలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై సైనిక ఒత్తిడిని తీవ్రతరం చేసేందుకే అమెరికా ఈ చర్య తీసుకుందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ భారీ యుద్ధ నౌక తరలింపు పశ్చిమాసియాలో కొత్త ఆందోళనలకు దారితీస్తోంది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే పరిస్థితి చేయిదాటిపోయే ప్రమాదం ఉందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

## న్యాయమూర్తులపై 8600కిపైగా ఫిర్యాదులు

### పార్లమెంటులో న్యాయశాఖమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్..

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** దేశంలో పనిచేస్తున్న ప్రస్తుత న్యాయమూర్తులపై ఇప్పటివరకూ 8600వరకూ ఫిర్యాదులు వచ్చినట్లు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం ప్రకటించింది. 2016 నుంచి ఇప్పటివరకూ మొత్తం 8600కిపైగా ఫిర్యాదులు వచ్చినట్లు న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్‌మేఘ్‌వాల్‌వెల్లడించారు. 2024లోనే అత్యధికంగా 1170 ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. అంతర్గత వ్యవస్థల ద్వారా ఈ న్యాయమూర్తులపై ఫిర్యాదులను విచారణ చేస్తామని మంత్రి వివరించారు. 1997 మేనెలలో సుప్రీంకోర్టు రెండు తీర్మానాలను కూడా ఆమోదించింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు నిర్దేశించిన కొన్ని ప్రామాణికాలకు అనుగుణంగా ఈ విచారణ ఉంటుంది. ఇన్‌హౌస్ విచారణలే ఉంటాయని, జడ్జిలపై సరైన నిర్ణయం కూడా ప్రకటించడం జరుగుతుందని, అంతర్జాతీయంగా ఆమోదించిన విలువలనే న్యాయవ్యవస్థలో కూడా అమలు చేయడం జరుగుతుందని అన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులపై వచ్చే ఫిర్యాదులను కేవలం సుప్రీం ప్రధానన్యామూర్తి మాత్రమే స్వీకరిస్తారు. అలాగే హైకోర్టుల్లోని చీఫ్‌జస్టిస్‌లు హైకోర్టు న్యాయమూర్తులపై వచ్చే ఫిర్యాదులు పరిశీలిస్తారు. ఉన్నతస్థాయి న్యాయవ్యవస్తలో వచ్చే ఫిర్యాదులపై కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పర్యవేక్షణ వ్యవస్థ సిపిజిరామ్స్ ద్వారానే పరిశీలన పరిష్కారం ఉంటుందని మంత్రి వివరించారు. వీటన్నింటినీ కేవలం సిజెఐ, లేదా హైకోర్టుల న్యాయమూర్తులవద్దకు పంపించడం జరుగుతుందన్నారు.

# ప్రధానిగా తారిక్‌రహమాన్ ఎంపిక లాంఛనమే!

### భారత్‌తో బిఎన్పీ వైఖరిపైనే ఇపుడు అంతటా చర్చ



**ఢాకా, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్‌లో జరిగిన ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ) భారీ విజయం సాధించింది. దీంతో ఈ పార్టీ తరఫున తారిఖ్ రహమాన్ ప్రధానిగా ఎన్నిక ఏకపక్షం కానున్నది. ఒకప్పుడు దేశ బహిష్కరణకు గురైన తారిఖ్ బంగ్లాదేశ్ తిరిగొచ్చిన కొద్ది రోజుల్లోనే ఆయన ప్రధాని పదవి చేపట్టబోతుండటం విశేషం. తారిఖ్ రహమాన్ 17 ఏళ్లు దేశ బహిష్కరణకు గురై, బ్రిటన్‌లో ఉన్నారు. గత ఏడాది డిసెంబర్లో దేశానికి తిరిగొచ్చారు. రహమాన్ బంగ్లా మాజీ ప్రధాని ఖలిదా జియా తనయుడు. ఆమె అధికారంలో ఉన్న 2002-06 కాలంలో రహమాన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించి, అవినీతికి పాల్పడ్డాడని ఆరోపణలొచ్చాయి. దీంతో తన తల్లి ప్రభుత్వం కూలిపోయిన తర్వాత అతడిపై అవినీతి ఆరోపణలు రావడంతో 2007లో అప్పటి ప్రభుత్వం అరెస్టు చేసింది. 17 నెలలు జైలులో ఉన్నాడు. తర్వాత దేశ బహిష్కరణకు గురి కావడంతో బ్రిటన్ వెళ్లిపోయారు. తన తల్లి మరణంతో 17 ఏళ్ల తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్ తిరిగొచ్చాడు. ఈ సందర్భంగా అతడికి ఘన స్వాగతం లభించింది. ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తన తల్లి మరణం తర్వాత ఆయన ఆ పార్టీ బాధ్యతలు చేపట్టారు. గురువారం జరిగిన ఎన్నికల్లో పాల్గొని విజయం సాధించారు. తన పార్టీని విజయపథంలో నడిపించారు. దాదాపు 20 ఏళ్ల తర్వాత బీఎన్‌పీ అధికారంలోకి వచ్చింది. డార్క్ ప్రిన్స్‌గా పిలిచే అతడు తన తల్లి ప్రధానిగా ఉన్నప్పుడు షాడో పీఎంగా వ్యవహరించారు. బీఎన్‌పీ గతంలో ఇండియాతో వ్యతిరేక వైఖరి అవలంబించింది. ఆమె తల్లి ప్రధానిగా ఉన్న సమయంలో ఇండియాకు వ్యతిరేకంగా చాలా చర్యలు తీసుకుంది. భారత వ్యతిరేక శక్తులకు ఆమె ఆశ్రయం ఇచ్చారనే ఆరోపణలున్నాయి. వ్యాపార, వాణిజ్య పరమైన అంశాలు, జల వివాదాల్లో ఇరు దేశాల మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. ఇప్పుడు ఆ పార్టీ ఎలా వ్యవహరిస్తుంది అనేది కీలకం. ఈ అంశంపై తారిఖ్ భిన్నంగా వ్యవహరించవచ్చని విశ్లేషకుల అంచనా. సమ్మిళిత బంగ్లాదేశ్ అంటూ ఆయన కొత్త నినాదం అందుకున్నారు. అంటే ఎవరితో శతృత్వం లేకుండా వ్యవహరిస్తామని చెప్పారు. దీంతో ఆయన ఇండియాతో ఎక్కువ విబేధాలు తెచ్చుకోకపోవచ్చని అంచనా. ఇండియాకు బంగ్లాదేశ్‌తో ఇప్పుడు సంబంధాలు బలపడటం చాలా కీలకం. రెండు దేశాల మధ్య దాదాపు 4వేల కిలోమీటర్ల సరిహద్దు ఉంది. సరిహద్దు భద్రత, శాంతి భద్రతలు, వ్యాపార, వాణిజ్య సంబంధాలు, బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రత వంటి అనేక అంశాల్లో ఇరు దేశాలు సమన్వయంతో పని చేయాల్సి ఉంది.



# అమలులోకి 'పిఎం - రాహత్'

- రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స
- వినూత్న పథకానికి ప్రధాని ఆమోదం
- కర్తవ్యభవన్ 1,2 సేవాతీర్థ సముదాయాలను జాతికి అంకితం చేసిన ప్రధాని

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** భారతదేశ పరిపాలన వ్యవస్థలో ఒక చారిత్రాత్మక మార్పుకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ శ్రీకారం చుట్టారు. దశాబ్దాల కాలం నాటి పాత మౌలిక సదుపాయాలకు స్వస్తి పలుకుతూ.. అత్యున్నత నిర్ణయాధికార సంస్థలన్నింటినీ ఒకే చోటకు చేరుస్తూ నిర్మించిన కర్తవ్య భవన్1, కర్తవ్య భవన్2, సేవా తీర్థ సముదాయాలను ఆయన జాతికి అంకితం చేశారు. ఇప్పటివరకు సెంట్రల్ విస్టాలోని వివిధ ప్రాంతాల్లో చెల్లాచెదురుగా ఉన్న కార్యాలయాలను ఇప్పుడు ఒకే ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్‌లోకి తీసుకువచ్చారు. ఇందులో ప్రధానంగా.. ప్రధానమంత్రి కార్యాలయం, జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్, క్యాబినెట్ సెక్రటేరియట్. దీనివల్ల శాఖల మధ్య సమన్వయం పెరగడమే కాకుండా పరిపాలనా పరమైన జాప్యం తగ్గి నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం కలుగుతుంది. అనంతరం నూతన పరిపాలనా కేంద్రం సేవా తీర్థలో తన కార్యాలయంలో కొలువుదీరిన ప్రధానమంత్రి మోడీ తనదైన శైలిలో పాలనా ముద్ర వేశారు. కేవలం భవనాల మార్పు మాత్రమే కాదు సామాన్యుడి మేలు చేకూర్చే దిశగా ప్రధాని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జనహితమే లక్ష్యంగా కీలక ఫైళ్లపై సంతకాలు చేశారు. రైతులు, మహిళలు, యువత, సామాన్య పౌరుల జీవితాల్లో వెలుగులు నింపేలా నాలుగు ప్రధాన పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. వాటిలో భాగంగానే ప్రమాదాల బారిన పడిన పౌరులను ఆదుకునేందుకు పిఎం రాహత్ పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఈ పథకం కింద ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుంది. సకాలంలో వైద్యం అందక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదనే లక్ష్యంతో ఈ విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. అలాగే మహిళా సాధికారతలో భారత్ మరో మైలురాయిని అధిగమించింది. 3 కోట్ల మంది మహిళలను లఖ్పతి దీదీలుగా మార్చాలనే లక్ష్యాన్ని ఏడాది ముందే చేరుకోవడంతో, ప్రధాని ఈ లక్ష్యాన్ని ఇప్పుడు రెట్టింపు చేశారు. మార్చి 2029 నాటికి 6 కోట్ల మంది మహిళలను లఖ్పతి దీదీలుగా తీర్చిదిద్దాలని కొత్త లక్ష్యాన్ని నిర్దేశించారు. వీటితోపాటు అన్నదాతలకు అండగా ఉండాలనే లక్ష్యంతో వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించేందుకు ప్రధాని భారీ కేటాయింపులు చేశారు. గతంలో రూ.1 లక్ష కోట్లుగా ఉన్న వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధిని రూ.2 లక్షల కోట్లకు రెట్టింపు చేస్తూ సంతకం చేశారు. దీనివల్ల గ్రామాల్లో కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు వేగవంతం కానుంది. భారత యువతలోని సృజనాత్మకతను ప్రోత్స హిం చేందుకు స్టార్టప్ ఇండియా ఫండ్ ఆఫ్ ఫండ్స్ 2.0కు ఆమోదం తెలిపారు. రూ.10,000 కోట్ల భారీ కార్పస్‌తో ఈ నిధిని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా డీప్ టెక్నాలజీ, అధునాతన తయారీ రంగాల్లో కొత్త ఆలోచనలతో వచ్చే యువ పారిశ్రామికవేత్తలకు ఇది గొప్ప వరంగా మారనుంది. వీటితోపాటు పర్యావరణ హితానికి పెద్దపీట వేస్తూ ఈ సముదాయాలను 4స్టార్ జీఆర్ఐహెచ్ఎ గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలతో నిర్మించారు. ఇది దాదాపు 2.26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనిని సుమారు రూ.1,189 కోట్ల వ్యయంతో నిర్మించారు. భవన అవసరాల కోసం సోలార్ ప్యానెల్స్, ఇతర ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగం. అత్యాధునిక నీటి రీసైక్లింగ్, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు. డిజిటల్ ఇంటిగ్రేషన్, స్మార్ట్ యాక్సెస్ కంట్రోల్స్, అత్యున్నత స్థాయి నిఘా వ్యవస్థలు వంటివి ఉంటాయి. కర్తవ్య భవన్1, 2 భవనాల్లో రక్షణ, ఆర్థిక, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, న్యాయ శాఖలతో సహా మొత్తం 11 కీలక మంత్రిత్వ శాఖలు కొలువుదీర నున్నాయి. పౌరుల సౌకర్యార్థం ఇందులో కేంద్రీకృత రిసెప్షన్, పబ్లిక్ ఇంటర్‌ఫేస్ జోన్‌లను ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రజలు తమ సమ స్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తప్పుతుంది. ఈ నిర్ణయాల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం సేవా స్ఫూర్తి అన్నారు.

# డబ్బులు తీసుకోండి.. గట్టిగా 'విజిల్' వేయండి :విజయ్



**సేలం, ఫిబ్రవరి 13:** ఎన్నికల షెడ్యూల్ రాకముందే తమిళనాడు రాజకీయాలు రసవత్తరంగా మారాయి. టీవీకే పార్టీకి రాజకీయాల్లో అనుభవం లేదంటూ ప్రత్యర్థుల నుంచి వస్తున్న విమర్శలపై నటుడు, ఆ పార్టీ అధినేత విజయ్ గట్టి కౌంటర్ ఇచ్చారు. తమకు దోపిడీల్లోనూ అనుభవం లేదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకేపై విజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సేలంలో శుక్రవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో విజయ్ మాట్లాడుతూ నా ఓటు నా హక్కు. ఎవరూ దాన్ని కొనలేరు అంటూ ప్రతిజ్ఞ చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో అనేక మంది వచ్చి మీకు వేల రూపాయలు ఇస్తారు. అది మీ డబ్బే దాన్ని తీసుకోండి. సొమ్ము తీసుకున్న తర్వాత గట్టిగా విజిల్ వేయండి అని విజయ్ తన పార్టీ గుర్తును ప్రస్తావించారు. ఈ పోరాటం డీఎంకే, టీవీకే మధ్యనే ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని విజయ్ ఆరోపించారు. హామీలపై ప్రభుత్వం ప్రజలకు అసత్యాలు చెబుతూనే ఉందని విమర్శించారు. రాష్ట్రంలోని మహిళలకు భద్రత ఉందంటూ సీఎం గొప్పలు చెబుతున్నారని, అయితే వారిపై నేరాలు ఎందుకు పెరుగుతున్నాయని టీవీకే చీఫ్ ప్రశ్నించారు. తాను ఏ పార్టీని దెబ్బతీయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదని, రాష్ట్ర ప్రజల కోసం మాత్రమే వచ్చానని స్పష్టంచేశారు. రాజకీయాల్లో అనుభవం గురించి వచ్చిన విమర్శలపై మాట్లాడుతూ నా రాజకీయ అనుభవంపై అనేక మంది ప్రశ్నిస్తున్నారు. నన్ను ప్రశ్నించేవారికి దోపిడీల్లో కూడా అనుభవం ఉంది. కానీ మాకు అందులో కూడా అనుభవం లేదు అని కౌంటర్ ఇచ్చారు.

# చూపు కోల్పోయిన పాక్ మాజీ పిఎం ఇమ్రాన్‌ఖాన్

## జైలులో సాధారణ ఖైదీ కంటే దారుణ పరిస్థితి..



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 13:** పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ జీవితం జైలులోనే ముగిసిపోయేలా ఉంది. అడియా జైలులో ఉన్న ఆయన ఆరోగ్యం ఇప్పటికే క్షీణించగా.. ప్రస్తుతం కంటిచూపు కూడా మందగించినట్టు కోర్టు నియమించిన మధ్యవర్తి (అమికస్ క్యూరీ) నివేదిక పేర్కొంది. ఒంటరిగా ఓ గదిలో నిర్బంధించి, ఉద్దేశపూర్వకంగా, అమానవీయంగా, చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపింది. ఈ మేరకు పాకిస్థాన్ సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ సల్మాన్ సఫ్దర్ రూపొందించిన పూర్తిస్థాయి నివేదికలో భయానక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నివేదిక ప్రకారం అనేక నెలలుగా ఆయన ఆరోగ్య సమస్యల గురించి జైలు అధికారులు పట్టించుకోక పోవడంతో కుడి కంటిచూపు 85 శాతం కోల్పోయారు. మాజీ ప్రధానిని ఒంటరిగా నిర్బంధించడం, సకాలంలో వైద్యసౌకర్యం అందజేయకపోవడం, కుటుంబ సభ్యులను కలవకుండా నిరోధించడం, న్యాయసహాయకులకు అనుమతి ఇవ్వకపోవడం వంటి దారుణమైన అంశాలను నివేదిక బయటపెట్టింది. ఈ పరిస్థితికి ప్రభుత్వం, పాకిస్థాన్ సైన్యమే కారణమనే విమర్శలు వస్తున్నాయి. దాదాపు మూడు, నాలుగు నెలల కిందట అంటే గతేడాది అక్టోబరులో తన కంటి చూపు సాధారణంగా ఉండేదని అమికస్ క్యూరీకి ఇమ్రాన్‌ఖాన్ వివరించారు. ఆ తర్వాత నుంచి క్రమంగా తగ్గిపోయిందని, ఈ విషయం గురించి జైలు సూపరింటెండెంట్‌కు పదేపదే చెప్పినా ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ నిర్లక్ష్యం కారణంగా కుడి కంటిచూపు పూర్తిగా పోయిందని పేర్కొన్నారు. జైలులో మాజీ ప్రధానమంత్రి పట్ల అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారని, ఆరోగ్య పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని లాయర్ సఫ్దర్ తన నివేదికలో ఆరోపించారు. 2023 అక్టోబరులో అడియాలా జైలుకు బదలీ అయినప్పటి నుంచి, ఇమ్రాన్‌ఖాన్ దాదాపు రెండు సంవత్సరాల నాలుగు నెలలుగా ఏకాంత నిర్బంధంలో ఉన్నారని నివేదిక ధ్రువీకరిస్తుంది. పలు అనారోగ్య సమస్యలు వేధిస్తున్నాయని, వ్యక్తిగత వైద్యుడ్ని చికిత్సకు అనుమతించలేదని ఇమ్రాన్ చెప్పారు. తన కుటుంబసభ్యులను కలవడానికి కూడా నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త జైలు సూపరింటెండెంట్ వచ్చిన తర్వాత తన భార్యను వారానికి ఒకసారి కలవడానికి అనుమతిస్తున్నారని ఇమ్రాన్ అన్నట్లు నివేదికలో పొందుపరిచారు.

# తమిళనాడులో స్టాలిన్ ఎన్నికల వరాలు!



**చెన్నై, ఫిబ్రవరి 13:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార డీఎంకే ప్రభుత్వం మహిళలకు మరో ఆకర్షణీయ కానుక అందించింది. కలైంజ్ఞర్ మహిళా హక్కుల పథకం కింద 1.31 కోట్ల మంది లబ్ధిదారులకు ముందస్తు మూడు నెలల ప్యాకేజీని విడుదల చేసింది. ముందస్తుగా రూ.3,000తో పాటు వేసవి ప్రత్యేక ప్యాకేజీ కింద మరో రూ.2,000 మొత్తం రూ.5,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. ముఖ్యమంత్రి స్టాలిన్ సోషల్ మీడియాలో ఈ వివరాలు వెల్లడించారు. ఎన్నికల సాకుతో ఈ సాయాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్టాలిన్ విపక్షాలపై మండిపడ్డారు. ఈ కారణంగానే, ముందస్తుగా నిధులు విడుదల చేశామని తెలిపారు. మళ్లీ గెలిస్తే ప్రస్తుతం ఇస్తున్న నెలవారీ రూ.1,000 సాయాన్ని రూ.2,000కు పెంచుతామని హామీ ఇచ్చారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ఇచ్చే సామాజిక భద్రతా పింఛన్లను రూ.1,200 నుంచి రూ.2,000కు పెంచుతామని తెలిపారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఈ ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరగనున్నాయి. 2021లో డీఎంకే 133 స్థానాల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

## ఏనుగుల దాడిలో ఆరుగురు దుర్మరణం

**రాంచీ, ఫిబ్రవరి 13:** జార్ఖండ్‌లోని హాజీరాబాగ్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శుక్రవారం ఏనుగుల దాడిలో ఆరుగురు వ్యక్తులు దుర్మరణం చెందినట్లు అక్కడి అధికారులు ప్రకటించారు. ఒక చిన్నారి తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. మరణించిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారున్నట్లు అధికారులు తెలిపారు. ఆ రాష్ట్రంలో కొద్ది రోజులుగా ఏనుగుల దాడులు తీవ్రతర మయ్యాయి. ఏనుగుల గుంపులు గ్రామంలోకి చొరబడి ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఒక ఏనుగుల గుంపు చుర్చా బ్లాక్ ప్రాంతంలోని గోంద్వార్ గ్రామంలోకి ప్రవేశించి ప్రజలపై దాడి చేశాయి. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో గాయపడిన ఆరుగురు శుక్రవారం ఉదయం మృతి చెందినట్లు అధికారులు ప్రకటించారు.

## సంక్షిప్తంగా..

### రణ్‌వీర్, రోహిత్‌శెట్టిలకు బిష్ణోయ్‌గ్యాంగ్ బెదిరింపులు



**ముంబయి, ఫిబ్రవరి 13:** బాలీవుడ్ ప్రముఖ నటుడు రణ్‌వీర్ సింగ్ కు బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. రణ్‌వీర్‌ను, అతడి దగ్గర పనిచేస్తున్న వారినీ చంపేస్తానని బిష్ణోయ్ అనుచరుడి పేరుతో ఓ దుండగుడు హెచ్చరించాడు. ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి ని కూడా ఇదే తరహాలో బెదిరించాడు. ఈ మేరకు వాట్సాప్‌లో ఓ ఆడియో సందేశం పంపించినట్లు సమాచారం. ఈ బెదిరింపు సందేశంతో బాలీవుడ్ లో కలకలం రేగుతోంది. తనను తాను బిష్ణోయ్ అనుచరుడిగా పేర్కొంటూ హ్యారీ బాక్సర్ అనే వ్యక్తి ఈ బెదిరింపులకు పాల్పడ్డాడు.

తన డిమాండ్లను అంగీకరించకపోతే ఆ సెలెబ్రిటీలతోపాటు వారి సిబ్బందినీ హత్య చేస్తామని హెచ్చరించాడు. భవిష్యత్తులో ఏడు తరాలకు గుర్తుండి పోయేలా హత్య జరుగుతుందని వార్నింగ్ ఇచ్చాడు.

### విజయ్ ర్యాలీలో గుండెపోటుతో ఒకరి మృతి

**చెన్నై, ఫిబ్రవరి 13:** సినీ నటుడు, టివికె పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన ఎన్నికల ర్యాలీకి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. విజయ్ మాట్లాడుతుండగా ఓ వ్యక్తి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన సూరజ్(37)గా గుర్తించారు. ఉపాధి నిమిత్తం అతడు కొన్నేళ్ల క్రితం కుటుంబంతో సహా సేలానికి వచ్చాడు. కొంత కాలంగా అతడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట వంటి పరిస్థితులు తలెత్తకుండా విజయ్ ర్యాలీల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

### లోధా డెవలపర్స్ రాజేంద్ర లోధా అరెస్ట్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** లోధా డెవలపర్స్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ మాజీ డైరెక్టర్ రాజేంద్ర లోధాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. మనీల్యాండరింగ్ కేసులో అతన్ని ఈడీ అదుపులోకి తీసుకున్నది. కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడిగా ఉన్న సమయంలో రాజేంద్ర లోధా సుమారు 85 కోట్ల అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. మనీల్యాండరింగ్ కేసులో రాజేంద్ర లోధాను కస్టడీలోకి తీసుకునేందుకుగురువారమే ప్రత్యేక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఎల్‌డీఎల్ కంపెనీకి కావాలనే ఆయన సుమారు 85 కోట్ల నష్టానికి కలగచేసినట్లు లోధాపై ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబర్‌లో క్రైం బ్రాంచ్ కేసులో ఆయన్ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన జుడిషియల్ కస్టడీలో ఉన్నారు.

### పంజాబ్ మాజీ సిఎం అమరీందర్ ఆయన కుమారుడికి ఇడి నోటీసులు



చండీఘర్, ఫిబ్రవరి 13: పంజాబ్‌మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు కెప్టెన్ అమరీందర్‌సింగ్, ఆయన కుమారుడు రణీందర్‌సింగ్‌లకు సమన్లు జారీచేసిన ఈడీ అధికారిని చెన్నైకు బదలీచేయడం ఇపుడు రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం కలిగించింది. ఫెమా చట్ట నిబంధనలు ఉల్లంఘించారన్న కేసులో ఏజెన్సీ అదనపు డైరెక్టర్ జలంధర్‌లోపనిచేస్తున్న 2009 బ్యాచ్ ఐఆర్ఎస్ అధికారి రవితివారిని బదిలీచేయడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జలంధర్‌లో 2023 సెప్టెంబరులోచేరిన తివారిని చెన్నైకు బదిలీచేసారు.

ఆయన స్థానంలో దినేష్ పచౌరిని నియిమంచారు. గురు,శుక్రవారాల్లోనే రణిందర్, అమరీందర్‌లు హాజరుకావాలని సమన్లుజారీచేసిన సంగతి తెలిసిందే.



# భారత్‌లో రోల్స్ రాయిస్ విస్తరణ ప్రణాళికలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** రోల్స్ రాయిస కంపెనీ ఇండియాలో తన వ్యాపార విస్తరణ ప్రణాళికలు అమలుచేస్తోంది. యుద్ధ విమానాల తయారీకి సంబంధించిన ఏరో ఇంజిన్లను అభివృద్ధి చేసేందుకు ఆ కంపెనీ ఆసక్తి ప్రదర్శిస్తున్నది. రక్షణ, పౌరవిమానయాన, ఎనర్జీ రంగాల్లోనూ రోల్స్ రాయిస్ కంపెనీ తన భాగస్వామ్యాన్ని విస్తరించనున్నది.

భారత్‌కు అవసరమైన 120 కిలో న్యూటన్ క్లాస్ యుద్ధ విమాన ఇంజిన్‌ను అభివృద్ధి చేయనున్నామని, దీని కోసం యూకే ప్రభుత్వంతో సహా భారత్ ఆసక్తిగా ఉన్నట్లు కంపెనీ తన ప్రకటనలో చెప్పింది. కో డెవలప్మెంట్‌లో భాగంగా పూర్తి స్థాయిలో టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేయనున్నారు. ఐపీ ఓనర్‌షిప్ కూడా ట్రాన్స్‌ఫర్ కానున్నది. ఈ నేపథ్యంలో రోల్స్ రాయిస్ సీఈవో టుఫాన్ ఎరిగిన్ బిల్‌జిక్ ప్రధాని మోదీని కలిశారు. భారత్ ప్రగతిలో భాగస్వామ్యం కావాలనుకుంటున్నట్లు రోల్స్ రాయిస్ సీఈవో తెలిపారు.

# హసీనా అప్పగింతకు భారత్‌పై బిఎన్పీ ఒత్తిడిపెంచే ఛాన్స్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికల్లో బిఎన్పీ అనూహ్య విజయం సాధించిన వేళ ఆపార్టీ ప్రభుత్వం ఏర్పాటుచేస్తే భారత్‌పై తన వ్యూహాలు మారుస్తుందన్న ఊహాగానాలుపెరిగాయి. ప్రధానంగా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలన్న ఒత్తిడిని పెంచవచ్చున్న భావన వ్యక్తం అవుతోంది. సీనియర్ బిఎన్‌పి నేత సలాహుద్దీన్ అహ్మద్ మాట్లాడుతూ చట్టపరమైన విధానాలతో తమ పార్టీ ప్రబుత్వం హసీనాను వెనక్కు రప్పించేందుకు కృషిచేస్తుందని అన్నారు. మా విదేశాంగమంత్రి ఇప్పటికే ఆమెను స్వదేశానికి రప్పించేందుకు కస రత్తులు ప్రారంభించారని, మేం ఆ కార్యాచరణకు మద్దతిస్తామని చెప్పారు. చట్టపరమైన అప్పగింతనే తాము స్వాగతిస్తామన్నారు. రెండు దేశాల విదేశాంగమంత్రిత్వశాఖల మధ్య ఈ వివాదం నడుస్తోందన్నారు. అధికారం నుంచి దిగిపోయినప్పటినుంచి బంగ్లాలో జరిగిన తిరుగుబాటుతో హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. 2025 నవంబరులోనే బంగ్లా ప్రత్యేకట్రిబ్యునల్ ఆమెపరోక్షంలో మరణశిక్ష విధిం చింది. 2024 నిరసనలను హింసాత్మకంగా అణిచివేసిన నేరాలు ఆమెపై నమోదుచేసి ఆమె పరోక్షంలోనే విచారణజరిపి మరణశిక్ష విధించారు



## బిఎన్పీ విజయంపై తారిక్ రెహామాన్‌కు

# ప్రధానిమోడీ ఫోన్!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** బంగ్లాదేశ్‌లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అధినేత తారిక్ రహ్మాన్‌కు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. గురువారం బంగ్లాదేశ్ 13వ జాతీయ పార్లమెంట్ ఎన్నికలు జరిగాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా పదవీచ్యుతురాలైన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు ఇవే. వెలువడుతున్న అనధికారిక ఫలితాల ప్రకారం 17 ఏళ్ల ప్రవాసం తర్వాత ఇటీవలే దేశానికి తిరిగి వచ్చిన తారిక్ రహ్మాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ పార్టీ 300 స్థానాల పార్లమెంట్‌లో స్పష్టమైన మెజారిటీని కైవసం చేసుకుంది. ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. "బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీని ఘన విజయపథంలో నడిపించినందుకు మీకు నా హృదయపూర్వక అభినందనలు.

14-2Pg6exHMNWJQE.qxd:14-2Pg6exHMNWJQE.qxd 1/1/02 7:05 AM Page 1





## హంస, యాళీ వాహనాలపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఉదయం స్వామి అమ్మవార్లుహంస, యాళీవాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఏర్పాట్లలో ఆలయాధికారులు సిబ్బంది నిమగ్నమై ఏర్పాట్లను చురుగ్గా చేస్తున్నారు. ఉదయం స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించారు. రాజేష్, సూరి గురుకుల్స్ స్వామి అమ్మవార్లతో పాటు పంచ మూర్తులను చక్కగా ముస్తాబు చేయగా చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి హారతులిచ్చి గ్రామోత్సవానికి తరలించారు. వివిధ వాయిద్య బృందాలతో భక్తుల్ని గగుర్పాటు కల్పిస్తూ ఉత్సవాన్ని శివయ్య గోపురం, రాజగోపురం గుండా వాహనాల మండపం వద్దకు చేర్చారు. స్వామి వారిని బంగారు హంస వాహనంపై, అమ్మవారిని బంగారు యాళీ వాహనంపై ప్రతిష్టించారు. స్వామి అమ్మవార్ల ముందు వినాయకుడు, వల్లిదేవ సేన సమేత సుబ్రమణ్యం స్వామి, కన్నప్ప వెళుతుండగా కోలాటాల బృందాలు కోలాటాలతో భక్తులను ఆకర్షించారు. ఉత్సవాలను టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, దఫేదార్ రాజాలు పర్యవేక్షించారు. ఊరేగింపు సందర్భంగా సిఐ ప్రకాష్‌కుమార్ సూచనలతో ట్రాఫిక్ గోవిందు వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డిలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాలను దారి మళ్ళించారు. గ్రామోత్సవం తేరువీధి, నెహ్రూ వీధి, సినిమావీధి, బాబూ అగ్రహారం, నగరి వీధి, బజారువీధుల గుండా సాగింది.



## పుష్ప ప్రియుడు శ్రీశైలం మల్లన్న

శ్రీశైలం ప్రాజెక్టు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: మహాశివరాత్రిని పురస్కరించుకుని నవాహ్నిక దీక్షతో పదకొండు రోజుల పాటు నిర్వహింపబడే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజైన శ్రీ స్వామి అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. తరువాత యాగశాలయందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు చేశారు. లోకకల్యాణం కోసం జపాలు, పారాయణలు నిర్వహించారు. మండపారాధనలు, పంచావరణార్చనలు, శివపంచాక్షరి, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం ఆగమ శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. సాయంకాలం ప్రదోషకాల పూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి. శుక్రవారం రాత్రి శ్రీస్వామి అమ్మవార్లకు పుష్ప పల్లకీసేవ జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేక పూజలు జరిపారు. తదుపరి పుష్పపల్లకి మేళతాళాలతో శ్రీ స్వామి అమ్మవార్లను తోడ్కొని వచ్చి వివిధపుష్పాలతో అలంకరించబడిన పుష్ప పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు. ఈ విశేషసేవలో ఎర్రబంతి, పసుపు బంతి, తెల్లచేమంతి, పసుపు చేమంతి, కనకాంబరాలు, డచ్ రోస్, అశోక పత్రాల మాల, కాగడాలు, గ్లాడియేలస్, అస్పెర్ గ్రాస్, జబ్రా, కార్నేషన్, ఆర్కిడ్స్, నందివర్ధనం, గరుడవర్ధనం పుష్పాలను వినియోగించడం జరిగింది.

## ముగిసిన బార్ కౌన్సిల్ ఎన్నికల పోలింగ్

- 23 పోస్టులకు 143 మంది పోటీ
- 16 నుంచి ఓట్ల లెక్కింపు

విజయవాడ కార్పొరేషన్/ గుంటూరు (లీగల్), ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా బార్ కౌన్సిల్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. బరిలో ఉన్న అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు నిర్వహించారు. బార్ కౌన్సిల్‌లో 18 జనరల్, 5 మహిళ సభ్యుల పోస్టులకు గాను రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 143 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. గత కౌన్సిల్లో సభ్యులుగాఉన్న 19మంది తిరిగి పోటీ చేశారు. ఉదయం 10.30 నిమిషాల నుండి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఎన్నిలల్లో పోటీలో నిలబడిన అభ్యర్థులతో పాటు పలువురు న్యాయవాదులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవి శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. సాధారణ ఎన్నికల కంటే హోరాహోరీగా ఎన్నికలు జరిగాయి. ఎవరి స్థాయిలో వారు తమకు అవకాశం ఉన్న మేరకు శతవిధాల న్యాయవాదుల నుండి ఓట్లు రాబట్టుకునేందుకు కృషి చేశారు. మునుపెన్నడూ లేనంతగా ఈసారి ఎన్నికలలో అత్యధికమంది న్యాయవాదులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలువురు అభ్యర్థులు న్యాయవాద ఓట్లు కోసం రాజకీయ నాయకుల మద్దతు కూడా తీసుకోవటం కొసమెరుపు. మద్యం, ధనం కూడా ప్రవాహమై పారాయి. కొన్ని ఓట్లు పదివేల రూపాయలు పైచిలుకు పెట్టి కూడా కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఈ నెల 16న అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఆవరణలో కౌంటింగ్ మొదలవుతుందని న్యాయవాద వర్గాలు తెలిపాయి.

# శ్రీకాళహస్తి అభివృద్ధిలో పరుగు

## రూ.30 కోట్ల కైలాసగిరి రోడ్డును వర్చువల్‌గా ప్రారంభించిన డి.సిఎం పవన్‌కల్యాణ్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాత వార్త: కూటమి ప్రభుత్వంలో ఆధ్యాత్మిక చింతన కల్గిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం రూ.30 కోట్లతో రెండు దశల్లో నిర్మించిన 22కిలోమీటర్ల సిమెంటు రోడ్డును వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సందేశమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 42 ఆలయాల్లో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. మహాశివరాత్రి హిందూ ధర్మానికి, సనాతనాచారానికి అనుగుణంగా జరుపుకుంటున్నట్లు వివరించారు. శ్రీకాళహస్తి పంచభూత లింగాల్లో ఒకటైన వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రంలో కైలాసగిరి ప్రదక్షిణకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ఇది సత్యవ్రతభాస్కర క్షేత్రం కాబట్టి తాను ఒక సారి స్వామి అమ్మవార్లను దర్శించుకుంటానని పవన్ కల్యాణ్ వివరించారు. సనాతన ధర్మపరిరక్షణలో అందరికంటే ఒక అడుగు ముందుండే వ్యక్తి చంద్రబాబు నాయుడు అన్నారు. అలాంటి నాయకుని సారధ్యంలో పనిచేయటం తన అదృష్టమన్నారు. శ్రీకాళహస్తిలోని కైలాసగిరి పర్వతపంక్తులో నిర్మించిన సిమెంటు రోడ్డును ప్రారంభించటం తన అదృష్టమన్నారు.

**5821 ఆలయాలకు ధూపదీప నైవేద్యాలకు నిధులు:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేవాదాయశాఖకు అనం రామనారాయణరెడ్డిని మంత్రిగా నియమించారని ఆయనకు ఆలయాల పట్ల మంచి పట్టు ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని 5821 ఆలయాలకు ధూప దీన నైవేద్యం పథకంలో ఒక్కొక్క ఆలయానికి నెలకు రూ.10వేలు చొప్పున నిధులు విడుదల చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2017 పుష్కరాల సందర్భంగా పురాతన ఆలయాల పరిరక్షణలో భాగంగా 495 ఆలయాల పునర్నిర్మాణానికి రూ.608 కోట్లు నిధులు కేటాయించి పనులు చేపట్టినట్లు వివరించారు. ఏజెన్సి ప్రాంతాల్లో వెనుకబడిన ప్రాంతాల్లో శ్రీవాణి ఆలయాల పేరిట టిటిడి ఆర్థిక సహాకారంతో 5వేల ఆలయాలకు రూ.750 కోట్లు కేటాయించినట్లు, ఇప్పటికే 697 ఆలయాలకు రూ.113.25 కోట్లు నిధులు మంజూరు చేస్తూ అనుమతులివ్వటం ఒక్క కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం అన్నారు. 1561 ఆలయాలకు పాలక మండళ్ల నియమించాల్సి ఉంటే 1,002లకు నియమించామన్నారు. గోదావరి పుష్కరాల పేరిట 31 ప్రధాన ఆలయాలను రూ.37 కోట్లతో అభివృద్ధి చేస్తూ 'ఆంధ్ర ప్రదేశ్‌ను ఆధ్మాత్మిక ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రిన్సిపల్ కార్యదర్శి జవహర్‌లాల్ శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి, తిరుపతి ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు హాజరు కాగా సిమెంటు రోడ్డును ప్రారంభించారు. వర్చువల్ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఆలయ చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి, హస్తకళల అభివృద్ధి బోర్డు చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనందకుమార్ తదిరులు పాల్గొన్నారు.

# శ్రీముఖలింగేశ్వర ఉత్సవాల్లో లోపాలు ఉండకూడదు

- చక్రతీర్థ స్నానాలపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పరిశీలించిన విశాఖపట్నం రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ




శ్రీకాకుళం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలం, శ్రీముఖలింగం గ్రామంలోని ప్రసిద్ధ శ్రీముఖలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఈ నెల 15 నుండి 18 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి లోపాలు లేకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖపట్నం రేంజ్ ఐజీ గోపీనాథ్ జట్టి ఆదేశించారు. ఆదివారం జరిగే శివరాత్రి వేడుకలతో పాటు, ముఖ్యంగా (ఫిబ్రవరి 18)వంశధార నది పరివాహక ప్రాంతంలో నిర్వహించనున్న చక్రతీర్థ స్నానాలు లక్షలాది మంది భక్తులను ఆకర్షించే అవకాశమున్నందున, అక్కడ భద్రతా ఏర్పాట్లు, రాకపోకల నియంత్రణ, క్యూలైన్ వ్యవస్థ, బ్యారికేడింగ్, అత్యవసర మార్గాలు, పార్కింగ్ స్థలాలు తదితర అంశాలను రేంజ్ ఐజీ, జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు, గర్భగుడి క్యూలైన్లు, చక్రతీర్థ ఘాట్ ప్రాంతం, ప్రధాన రహదారులు, పార్కింగ్ ప్రాంతాలు, కంట్రోల్ రూమ్ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పర్యవేక్షణ తదితర అంశాలను సమీక్షించారు. ఇతర శాఖలతో సమన్వయం చేస్తూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు, స్పెషల్ పార్టీ ఫోర్స్, రోప్ పార్టీ, లా అండ్ ఆర్డర్ సిబ్బందితో విస్తృత భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామని తెలిపారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ద్వారా మార్గదర్శకాలు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాలు, సముచిత లైటింగ్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 18న స్వామివారి ఉత్సవ విగ్రహాలు నంది వాహనంపై ఆలయం నుండి బయలుదేరి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వంశధార నది పరివాహక ప్రాంతానికి చేరుకుని చక్రతీర్థ స్నానాలు నిర్వహించనున్న నేపథ్యంలో మార్గమధ్యంలో ఇరువైపులా బ్యారికేడ్లు ఏర్పాటు చేసి, భక్తుల నియంత్రణకు పటిష్ట బందోబస్తు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రశాంతంగా స్నానాలు జరిగేలా సమగ్ర కార్యాచరణ రూపొందించామని అధికారులు పేర్కొన్నారు.

జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శివరాత్రి, చక్రతీర్థ స్నానాలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసే అవకాశమున్నందున తగిన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులు పరస్పర సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారని పేర్కొన్నారు. బందోబస్తు కార్యాచరణ వివరాలు రేంజ్ ఐజికి జిల్లా ఎస్పీ వివరించారు. భక్తులు పోలీసు సూచనలను పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో పోలీసు, రెవెన్యూ, ఆలయ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# న్యాయమే గెలిచింది!

- మూడేళ్ల పోరాటంలో జాహ్నవి కుటుంబానికే న్యాయం
- అమెరికాలో 2023 జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జాహ్నవి
- పోరాట ఫలితం రూ.262 కోట్లు పరిహారం
- మంత్రాలయం నియోజకవర్గం కౌతాళం కుంబలనూరు క్యాంప్ వాసి



కోసిగి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: న్యాయం అనేది అందరికి సమానమేనని దానిని ఆశ్రయించిన వారికి తప్పకుండ న్యాయ దేవత కరుణిస్తుందని జాహ్నవి సంఘటన ద్వారా బయట పడింది. మూడేళ్ల దేశం కానీ దేశంలో న్యాయపోరాటం చేసిన జాహ్నవి(23) కుటుంబం ఎటి ్టకేల కు పరిహారం అందించాలని అమెరికా కోర్టు తీర్పు చెప్పింది. దీంతో అమెరికా డాలర్లు 29 మిలియన్ డాలర్లు అందించాలని, భారత దేశ కరెన్సీ ప్రకారం అయితే రూ.262 కోట్లను జాహ్నవి కుటుం బానికి అందించాలని తీర్పు వెలువడింది. మారుమూల గ్రామం కౌతాళం మండలం కంబలనూర్ క్యాంప్ నుండి ఉన్నత చదువుల కోసం జాహ్నవి గత 2021వ సంవత్సరంలో అమెరికాలోని సౌత్ అలేఖ్య నార్తు ఈస్టన్ యూనివర్సిటీలో మాస్టర్సు డిగ్రీ కోసం అక్కడికి వెళ్లింది. కాగా అక్కడనే చదువుకుం టున్న జాహ్నవి 2023 జనవరి 23న రోడ్డు దాటుతుండగా ప్రమాదానికి గురైంది.. వేగంగా వచ్చిన అక్కడి పోలీసు పెట్రోలింగ్ వాహనం ఈమెను ఢీ కొనడంతో తీవ్ర ప్రమాదానికి గురై అక్కడే ప్రాణాలు కోల్పోయింది. అయితే ఈ ప్రమాదానికి కారణమైన పోలీసు అధికారి కెవిన్‌దేవ్ ఈ సంఘటనను తేలికగా తీసుకుని రోడ్డు ప్రమాదాలు సహజమే ఈమె మృతికి విలువ లేదంటూ వ్యాఖ్యలు చేసారు. అంతేకాక గట్టిగ అడిగితే 11 వేల డాలర్లు ఇస్తు సరిపోతుందనే మాట అప్పట్లో దుమారం రేపింది. ఈ అనుచిత వ్యాఖ్యలు దేశంలో అందరికి ఆగ్రహానికి గురిచేసింది. ఆమె ప్రాణానికి విలువ తేదన్నట్టుగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు తావిచ్చింది. భారతీయులే కాకుండా అమెరికా పౌరులు కూడా ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.. ఈ వ్యాఖ్యలకు పరిహారంగా అప్పుడే ఉద్యోగం కోల్పోయిన ఆ అధికారికి మళ్ళీ నేడు ధర్మాసనం తీర్పు ఒక చెంప పెట్టులాంటిదని అమెరికాలోని భారతీయ విద్యార్థులు పేర్కొంటునా న్నరు.

**జాహ్నవి కుటుంబ నేపథ్యం:** ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా మంత్రాలయం నియోజక వర్గంలోని కౌతాళం మండలం నదీతీర ప్రాంతమైన కుంబలనూరు క్యాంప్ వారి నివాసం. విజయలక్ష్మి స్కూల్ టీచర్ కాగా, తండ్రి శ్రీకాంత్ పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తూ తమకు ఉన ్న ఇద్దరు ఆడ పిల్లలను చదివిస్తునా న్నరు. అయితే ఉన్నతంగా తన పిల్లలు చదవాలని ఇద్దరు దంపతులు ఆదోనికి తమ మకాం మార్చారు. ఆదోనిలో తిరుమల నగర్‌లో నివాసం ఉంటున్న వారు తన పెద్ద కుమార్తె జాహ్నవిని ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికాకి పంపారు. ఉన్నత చదువుల కోసం వెళ్లిన తన కుమార్తె రెండేళ్లకే మృతి చెందిన సంఘటనను తండ్రీ జీర్ణించుకోలేక పోయాడు. ఈ విషయంలో సియాటెల్ సిటీ అధికారులే తన కుమార్తె మరణానికి కారణమని 110 మిలియను డాలర్లు పరిహారంగా చెల్లించాలని జాహ్నవి కుటుంబం 2024 సెప్టెంబరులో కోర్టులో దావా వేసింది.

**జాహ్నవి మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి మృతి:** కోర్టులో వేసిన దావా ఎన్నాళకు తీర్పు వస్తుందోనని కుమిలి, కుమిలి జాహ్నవి తండ్రి ఈ నెల 11వ తేదిన ఆదోనిలోని తిరుమల నగర్‌లో మృతి చెందాడు. తీవ్ర విషాదంలో ఉన్న ఈ కుటుంబంలో తల్లి విజయలక్ష్మితో పాటు చెల్లెలు మాత్రం ఇంట్లో ఉనా న్నరు. గురువారం తండ్రి మూడో రోజు కర్మకాండ చేస్తుండగానే వీరి కుటుంబానికి రూ.262 కోట్లు పరిహారం వచ్చినట్లు సమాచారం రావడం విశేషం. అయితే ఈ విషయం ఇంకా ఈ కుటుంబానికి తెలియలేదు. త్వరలోనే బాధిత కుటుంబానికి భారత ఎంబసీ ద్వారా ఈ పరిహారం అందించేందుకు చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# రూ.10 వేల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడ డిటి



- పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో సోదాలు
- నిందితుడు అరెస్టు... కోర్టుకు తరలింపు

పులివెందుల, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో అవినీతి ముసుగు చీలింది. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, లంచం స్వీకరిస్తున్న డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన జిల్లాలో సంచలనం రేపింది. కడప ఏసీబీ డీఎస్పీ సీతారామారావు నేతృత్వంలో నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, పదివేల రూపాయలు లంచంగా స్వీకరిస్తున్న సమయంలో అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదు మరియు సంబంధిత ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. మసీదు భూముల కేసులో లంచం డిమాండ్‌తో బాధితుడు, ఏసీబీ అధికారులు ఉచ్చు బిగించారు. చక్రాయపేట మండలంలోని ఖాద్రియ మసీదుకు చెందిన సుమారు 40 ఎకరాల ఈనామ్ భూములు కొందరు వ్యక్తులు ఆక్రమించి, తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకుని పట్టాదారు పుస్తకాలు పొందినట్లు ఫిర్యాదు వచ్చింది. కుమార కాలువ గ్రామానికి చెందిన కరీముల్లా 2024లో జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా ఫైల్ ప్రాసెస్ చేస్తామని చెప్పిన డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబు పాసుబుక్కులను రద్దు చేసి భూములను తిరిగి మసీదు పేరున మార్చాలంటే పదివేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు దీంతో బాధితుడు ఏసీబీ అధికారు లను సంప్రదించగా, అధికారులు ఉచ్చుపన్ని కార్యాలయంలోనే లంచం తీసుకుంటున్న సమయంలో పట్టుకున్నారు. అదుపులోకి తీసుకున్న నాగేంద్ర కుమార్ బాబును ఈ సంఘటనలో ఇంకా ఏ అధికారుల ప్రమేయం ఉందో అనే విషయం మీద ఏసీబీ డీఎస్పీ విచారిస్తున్నారు. అరెస్టు చేసిన డిప్యూటీ తహసిల్దార్ నాగేంద్ర కుమార్ బాబును విచారణ అనంతరం కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

## ఆర్టీసీ డిపోలు ప్రై'వేటు'కు వాస్తవం కాదు

సచివాలయం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రజలకు పర్యావరణహిత, కాలుష్య రహిత బస్సులతో మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం "పీఎం ఈ-బస్సు సేవ" పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని 11నగరాల్లో 12డిపోల్లో 750ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించిన టెండర్లలో ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 750బస్సులు సరఫరా చేయడానికి ఎలక్ట్రిక్ బస్సు తయారీదారులైన మెస్సర్స్ పినాకిల్ మొబిలిటీ పుణె" వారిని ఎంపిక చేయడం జరిగింది. ఈ సందర్భంగా 750బస్సులు మెయింటెనెన్స్, చార్జింగ్ కొరకు సివిల్, ఎలక్ట్రికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫెసిలిటీస్ ఏర్పాటు చేయడానికి సంబంధించిన పనులు ఏపిఎస్‌ఆర్టీసీ చేపట్టడం జరుగుతుంది. సివిల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుకు అయ్యే ఖర్చులో 60శాతం ఎలక్ట్రికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొరకు అయ్యే ఖర్చులో 100శాతం కేంద్ర ప్రభుత్వం ఏపిఎస్‌ఆర్టీసీకి గ్రాంటుగా అందజేయడం జరుగుతుంది. సెలెక్ట్ చేసిన 12డిపోల్లో సివిల్ వర్క్స్ కొరకు టెండర్ ప్రక్రియ ప్రారంభించబడింది. టెండర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఈ డిపోల్లో ఏపిఎస్‌ఆర్టీసి సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ పనులు ప్రారంభిస్తారు. అదేవిధంగా సెలెక్ట్ చేసిన ఈ డిపోల్లో ఎలక్ట్రిక్ బస్సులతో పాటు డిజిల్ బస్సులు కూడా సమాంతరంగా ఆపరేట్ చేయడం జరుగుతుందని ఎపిఎస్ ఆర్‌టిసి ఒక ప్రకటనలో తెలిపింది.

## అగ్రిగోల్డ్ ప్లాట్ల రిజిస్ట్రేషన్ పూర్తయిన వారికి ఊరట

విజయవాడ, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త ప్రతినిధి: అగ్రిగోల్డ్ పై క్రిమినల్ కేసులు నమోదు కాకముందు ఆ సంస్థ వేసిన లేఔట్లలో ప్లాట్లు కొనుక్కొని రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వారి స్థలాల్ని జప్తు నుంచి మినహాయిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను ప్రభుత్వం యథాతథంగా పునరుద్ధరించింది. ఆ ప్లాట్ల యజమానులకు వైకాపా ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని సరిదిద్దిందని. అగ్రిగోల్డ్‌కు చెందిన 16,857.81 ఎకరాల భూమి 82,207.08 చదరపు గజాల స్థలాలను జప్తు చేస్తూ 2015 ఫిబ్రవరి 20న అప్పటి తెదేపా ప్రభుత్వం జీవో 23 జారీ చేసింది. ఆ భూముల్లో పలు చోట్ల అగ్రిగోల్డ్ లేఔట్లు ఉన్నాయి. వాటిల్లో ప్లాట్ల కొనుగోలు కోసం పలువురు చందాదారులు అగ్రిగోల్డ్‌పై కేసులు నమోదు కాక మునుపే పూర్తిగా డబ్బులు చెల్లించి స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాంటి ప్లాట్లను జప్తు నుంచి మినహాయిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే వైకాపా అధికారం చేపట్టాక ఆ మినహాయింపును తొలగిస్తూ 2021 ఫిబ్రవరి 9న జీవో 19లో సవరణ ఉత్తర్వులిచ్చింది. దీంతో బాధితులైన ప్లాట్ల యజమానులు తమ సమస్యను ఇటీవల సీఐడీ అధికారులు, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లటంతో వారు స్పందించారు. తాజాగా జప్తు నుంచి మినహాయింపు లభించడంతో ప్లాట్ల యజమానులకు ఊరట దక్కనుంది.

## కన్న తల్లిని సజీవదహనం చేసిన కూతురు

సత్తెనపల్లి (పల్నాడుజిల్లా), ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: సత్తెనపల్లిలో అనుమానాస్పద మృతి కేసు కాస్తా.. హత్య కేసుగా మారిన వైనమిది. కన్నతల్లిని కుమార్తె చంపిందని విచారణలో పోలీసులు ఆశ్చర్యపోయారు. సత్తెనపల్లి 8వ వార్డులోని క్రిస్టియన్ పేటలో ఈ నెల 8న ఒంటరి మహిళ రమాదేవి ఒళ్లంతా కాలిన గాయాలతో సజీవ దహనమైంది.పోలీసులు మరణ సమాచారాన్ని కుమార్తెకు తెలియజేసినా ఆమె సరైన రీతిలో స్పందించక పోవడంతో పోలీసులు ఒకింత అనుమానించారు. సీసీ కెమేరాల ఫుటేజీతో రమాదేవి చనిపోయిన సమయంలో ఆమె కుమార్తె అక్కడే ఉందని పోలీసులు నిర్ధారించుకున్నారు. మృతురాలి కూతురు కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకుని వెంటనే విచారించారు. కుటుంబ గొడవలతో తానే తల్లిని చంపానని ఆ కుమార్తె పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. తల్లికి టీలోటాబ్లెట్లువేసి ఆమె మత్తులోకి వెళ్లిన తర్వాత చీరలు ఒంటి పైవేసి పెట్రోలుతో నిప్పంటించిందని తెలిసింది. తల్లిని చంపేంత పగ కుమార్తెకు ఎందుకు వచ్చింది? వారి మధ్య అంతకు ముందు ఏం జరిగింది? అనే విషయాలపై పోలీసులు విచారణ చేపట్టారు.



## సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామికి రూ.1.10 కోట్ల బంగారం బహూకరణ

అద్దంకి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త: ప్రకాశం జిల్లాలో ప్రసిద్ధిగాంచిన అద్దంకి మండలం, సింగరకొండలోని శ్రీప్రసన్న ఆంజనేయస్వామి వారికి బంగారం కిరీటం కొరకు చీరాలలోని కొత్తపేటకు చెందిన ముప్పవరపు సుధీర్‌కుమార్, ధర్మపత్ని ప్రత్యూషలు 1.10కోట్ల విలువ కలిగిన 6 బంగారు బిస్కెట్లను శుక్రవారం ఆలయ సహాయ కమీషనర్ ఎం.తిమ్మానాయుడు,ఛైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, పాలకమండలి సభ్యులకు అందజేశారు. స్వామివారికి బంగారు కిరీటం తయారు కొరకు మంగళగిరికి చెందిన స్వర్ణకారుడు కాటూరి సుబ్బారావుకు ఆలయ సహాయ కమీషనర్ దాతల సమక్షంలో వెంటనే అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలిసభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పేరు మార్పుతో ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చే యత్నం

## - పాకలలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో పిసిసి చీఫ్ షర్మిల



సింగరాయకొండ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను బలహీనపరచే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని ఏపీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల పేర్కొన్నారు. కొండేపి నియోజకవర్గం, సింగరాయకొండ మండలంలోని పాకల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి ప్రతి గ్రామీణ కుటుంబానికి సంవత్సరానికి 100 రోజుల ఉపాధి కల్పించే లక్ష్యంతో అమలు చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు.ప్రస్తుతం అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఈ ఉపాధి హామీ పథకాన్ని విబి జీ రాంజీ పేరుతో నూతన చట్టం ద్వారా మార్పులు చేసి అమలు చేయాలనుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన విధంగా ఉపాధి హామీ నిధులు నేరుగా పేదల ఖాతాల్లో జమ కావడంతో బీజేపీకి చెందిన నాయకులు, కాంట్రాక్టర్లకు అవకాశం లేకుండా పోవడంతోనే పథకాన్ని బలహీనపరచే యత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.కాంగ్రెస్ హయాంలో ఉపాధి హామీ నిధులను రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రం మంజూరు చేసేదని పేర్కొన్నారు. ప్రస్తుతం నూతన చట్టం ప్రకారం కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు సమకూర్చాల్సి ఉంటుందని తెలిపారు.గతంలో గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామ అవసరాలకు అనుగుణంగా రోడ్లు, చెరువుల పూడికతీత, పారం పండ్స్ గుంటలు, పొలం పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలు ఉపాధి హామీ ద్వారా చేపట్టేవారని వివరించారు. ఈ పథకం గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు.ఉపాధి హామీ పథకాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని షర్మిల స్పష్టం చేశారు. అనంతరం యాత్ర దర్శికి బయలుదేరి వెళ్లింది.ఉపాధి హామీ కూలీలు తమ సమస్యలను వెల్లడిస్తూ పనికి తగ్గ వేతనం అందడం లేదని, ఆరు రోజులు పని చేస్తే మూడు రోజులకు మాత్రమే కూలి ఇస్తున్నారని, జాబ్ కార్డు కోసం దరఖాస్తు చేసినా పదేళ్లు గడిచినా మంజూరు కాలేదని వాపోయారు. ఈ కార్యక్రమంలోకొండేపి ఇంచార్జి శ్రీపతి సతీష్, స్టేట్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శ్రీపతి ప్రకాశం, జనరల్ సెక్రటరీ ఇదా సుధాకర్ రెడ్డి, ప్రకాశం జిల్లా ఇంచార్జ్ తాటి కొండ వెంకటేశ్వర్లు,ఓబీసీ స్టేట్ చైర్మన్ శొంఠి శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ సైదా షేక్, మండల్ ప్రెసిడెంట్ షేక్ నాయబ్ రసూల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రజా పక్షాన పల్లా గళం..

- గంగవరం అభివృద్ధికి సరికొత్త ఆశలు!
- అసెంబ్లీలో మత్స్యకారుల సమస్యలుపై పోరాటం
- విశాఖ ప్రగతిపై పల్లా శ్రీనివాసరావు అంకితభావం

**గాజువాక,ఫిబ్రవరి 13,(ప్రభాతవార్త**

గాజువాక నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను, ముఖ్యంగా గంగవరం మత్స్యకారుల చిరకాల స్వప్నాలను సాకారం చేసే దిశగా శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అసెంబ్లీ వేదికగా గళం విప్పారు. నియోజకవర్గ అభివృద్ధిపై తనకున్న చిత్తశుద్ధిని చాటుకుంటూ, మత్స్యకారుల జీవనోపాధికి భరోసా కల్పించాలని ఆయన చేసిన ప్రసంగం సభలో అందరి దృష్టిని ఆకర్షించింది. జెట్టి నిర్మాణమే లక్ష్యంగా గంగవరం మత్స్యకారులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న జెట్టి నిర్మాణ హామీని పల్లా గట్టిగా వినిపించారు. "మత్స్యకారుల సంక్షేమమే మా ప్రాధాన్యత" అని చెబుతూ, జెట్టి లేకపోవడం వల్ల వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కళ్లకు కట్టినట్లు వివరించారు. సముద్రపు అలల ఉధృతి నుంచి మత్స్యకారుల పడవలకు రక్షణ కల్పించే బ్రేక్ వాటర్ నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇది పూర్తయితే వందలాది మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఉపాధిని కాపాడటమే అసలైన అభివృద్ధి అని, వారి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తానని ఆయన ప్రకటించడం స్థానిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతుంది. విశాఖపట్నం పారిశ్రామికంగానే కాకుండా, సామాన్యుల సంక్షేమంలోనూ అగ్రగామిగా ఉండాలన్నది పల్లా సంకల్పం. సభలో ఆయన ప్రదర్శించిన ధైర్యం, స్పష్టత విశాఖ భవిష్యత్తుపై కొత్త ఆశలు చిగురింపజేశాయి. ఈ చొరవతో త్వరలోనే గంగవరం తీరంలో పనులు వేగవంతం అవుతాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త



## నా హక్కులు హరించేలా ప్రతిష్ఠన దిగజాస్తున్నారు...

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే సుందరపు...

**ఎలమంచిలి, ఫిబ్రవరి 13,(ప్రభాతవార్త:**



ఎలమంచిలి నియోజకవర్గ రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దళితులకు ఇచ్చిన డి ఫామ్ పట్టా భూములను తాను కబ్జా చేసాను అంటూ కొంత మంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శాసనసభాపతి అయిన పాత్రుడికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తనకు ఎటువంటి సంబంధం లేకపోయినా శాసనసభ్యుడిగా నా హక్కులను హరించేలా నాపై నిరాధార కథనాలను ప్రచురింప చేసిన, నా పరువుకు ప్రతిష్టకు దిగజార్చాలని కొత్త చేసిన కొందరు పై సభా హక్కుల కమిటీ క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసభాపతి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మానవతా చట్టంపై గీతంలో జాతీయ సదస్సు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మానవతా చట్టంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా సాయుధ సంఘర్షణల కారణంగా ఏర్పడుతున్న మానవతా సవాళ్లపై ప్రముఖ న్యాయ నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు ఈ సదస్సులో చర్చించారు. సదస్సులో ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి ఇన్‌చార్జ్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు, ధర్మశాస్త్ర నేషనల్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ మనోజ్ కుమార్ సిన్హా, ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ న్యాయ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఎస్.సుమిత్ర, గీతం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎరోల్‌డిసౌజా, గీతం న్యాయ కళాశాల డీన్ ప్రొఫెసర్ ఎ.రాజేంద్రప్రసాద్,

మిగతా 8..లో

## విశాఖపట్నం పార్లమెంట్ కమిటీ సమీక్ష

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



విశాఖపట్నం పార్లమెంట్ కమిటీ కార్యవర్గం సభ్యులలో రోజుకు రెండు నియోజకవర్గం లకు సంబంధించి పార్లమెంట్ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించాలని నిర్ణయంలో భాగంగా రెండు వ రోజు విశాఖ పశ్చిమ నియోజకవర్గం, గాజువాక నియోజకవర్గం నకు చెందిన సభ్యులతో పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాభిరామ్ సమావేశం నిర్వహించారు.

మిగతా 8..లో

## హార్బర్ ఏసీపీగా బాధ్యతలు... 24 గంటల్లోనే బదిలీ!

- సీహెచ్ వివేకానంద ఆకస్మిక మార్పు పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశం
- హార్బర్ నూతన ఎసిపి గా ఐ. చిట్టిబాబు నియామకం

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



విశాఖ నగర హార్బర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ వివేకానందను 24 గంటలు గడవకముందే మళ్లీ శ్రీకాకుళంకు బదిలీ చేయడం పోలీస్ శాఖలో చర్చకు దారితీసింది. శ్రీకాకుళం జిల్లా ఎస్డీపీఓగా పనిచేస్తున్న వివేకానందను ఈనెల 11న రాష్ట్ర డీజీపీ హార్బర్ ఏసీపీగా బదిలీ చేశారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించగా, మరుసటి రోజే మళ్లీ శ్రీకాకుళంకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ఉన్న ఐ. చిట్టిబాబును నియమించారు. అయితే ఆకస్మికంగా చోటుచేసుకున్న ఈ బదిలీ నిర్ణయం వెనుక కారణాలపై అధికారికంగా స్పష్టత రాలేదు. విశాఖ సిటీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు వివేకానంద నియామకాన్ని సమర్థించినప్పటికీ, బదిలీని అడ్డుకోలేకపోయారనే చర్చ పోలీస్ వర్గాల్లో వినిపిస్తోంది. సాధారణంగా కీలక పదవుల్లో కనీసం కొంతకాలం పని చేసే అవకాశం కల్పించడం పరిపాటి కాగా, 24 గంటల వ్యవధిలోనే బదిలీ జరగడం విశేషంగా మారింది. ఈ పరిణామం వెనుక ఉన్న కారణాలపై పోలీస్ శాఖలో ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

## విద్యార్థులకు సైబర్ భద్రతాపై అవగాహన

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



విశాఖపట్నం నగర భద్రతా మండలి (వీసీఎస్సీ) ఆధ్వర్యంలో సైబర్ ఫోరం సంయుక్త కార్యదర్శి కిషోర్ దాసరి నేతృత్వంలో ఆనందపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 7వ తరగతి విద్యార్థులకు సైబర్ భద్రతా అవగాహన సెషన్‌ను నిర్వహించింది. యువ విద్యార్థులలో సురక్షితమైన డిజిటల్ పద్ధతులను ప్రోత్సహించేందుకు వీసీఎస్సీ చొరవలో భాగంగా ఈ సెషన్‌కు సీమా సిక్రీ, నవీన్ కుమార్ జగ్గుమంత్రి నాయకత్వం వహించారు. సోషల్ మీడియాను ఉపయోగించేందుకు తగిన వయస్సు, ఆన్‌లైన్ గేమ్‌లలో తెలియని వ్యక్తులతో సంభాషించడం వల్ల కలిగే నష్టాలు, సైబర్ మోసానికి దారితీసే అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ ప్రవర్తన, ప్రాముఖ్యతను కూడా సెషన్ హైలైట్ చేసింది. ఏవైనా సైబర్ సంబంధిత సమస్యలు తలెత్తినప్పుడు సరైన రిపోర్టింగ్ విధానాలను వివరించింది. ఈ ముఖ్యమైన అవగాహన సెషన్‌ను సులభతరం చేసేందుకు సమన్వయం చేసినందుకు సహకరించిన ప్రిన్సిపాల్, కంప్యూటర్ టీచర్ ధనలక్ష్మికి వీసీఎస్సీ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు.

## రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్‌ను సత్కరించిన అనకాపల్లి జిల్లా శాసనసభ్యులు

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**

8..లో



నేషనల్ ట్రావెల్ మార్ట్ ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో

# కొత్త అధ్యయనానికి నాంది




- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- టూర్ ఆపరేటర్లే పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి దుర్గేష్ వెల్లడి
- గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి
- స్వర్ణాంధ్ర విజన్ 2047 దిశగా పర్యాటక రంగం పరుగులు పెడుతోందని వెల్లడి

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

నేషనల్ ట్రావెల్ మార్ట్ కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు మరియు ఎకోఅడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్ లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన మరియు ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సంస్కృతిని, రామాయణ కాలం నాటి దండకారణ్య విశేషాలను ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

మిగతా 8..లో

# రాష్ట్రంలో అద్భుతమైన పాలసీ

- ఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో అభివృద్ధి పరుగులు
- గత వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అధోగతిపాలు
- తాడేపల్లి ప్యాలెస్‌లో క్రికెట్ ఆడుకుంటున్న జగన్‌తో సహా 11మంది క్రికెట్ టీమ్
- విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని, ప్రస్తుతం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం అద్భుతమైన పాలన అందిస్తూ, అభివృద్ధి బాటలో నడిపిస్తోందని విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. విశాఖలో ఆర్.ఎస్సాల్ మిట్టల్, విశాఖ మెట్రో, విమానాశ్రయం, 15 సాఫ్ట్‌వేర్ కంపెనీలు తీసుకువచ్చారని వివరించారు. యువతను భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతోందన్నారు. మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డితో సహా 11మంది క్రికెట్ టీమ్ అసెంబ్లీకి రాకుండా తాడేపల్లి ప్యాలెస్‌లో క్రికెట్ ఆడుకుంటున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో ప్రశ్నించడానికి

మిగతా 8..లో

## విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శిగా ఎం. శంకర్ బాబు బాధ్యతలు స్వీకరణ

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



విశాఖపట్నం పోర్ట్ నూతన కార్యదర్శిగా ఎం. శంకర్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం పోర్ట్‌కు రాక పూర్వం ఆయన మార్మగోవ పోర్ట్, గోవా, కార్యదర్శిగా సేవలందించారు. కేంద్ర పోర్టులు నౌకా జల రవాణా శాఖ మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ఆయనను విశాఖపట్నం పోర్ట్ అథారిటీకి కార్యదర్శిగా బదిలీ చేసి నియమించారు. కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించే ముందు, శంకర్‌బాబు విశాఖపట్నం పోర్ట్ ఉపాధ్యక్షురాలు రోష్ని అపరంజి కొరాటిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పోర్ట్ విభాగాధిపతులు, ఉన్నతాధికారులు మరియు సిబ్బంది శంకర్ బాబుకి పుష్పగుచ్ఛాలు అందజేసి హృదయపూర్వక స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

# 15న టిఎస్ఆర్ ఆధ్వర్యంలో "41వ మహా కుంభాభిషేకం"

- సాగర తీరాన పండుగ వాతావరణాన్ని తలపించేలా మహాశివరాత్రి వేడుకలు
- పవిత్ర జలాలు, పళ్ల రసాలతో శివలింగానికి భక్తులతో అభిషేకం
- ఉత్సవ కన్వీనర్, తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ టి.సుబ్బరామి రెడ్డి ఆధ్వర్యంలో విశాఖపట్నం ఆర్కే బీచ్ సాగర తీరాన మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 15న ఆదివారం 41వ మహా కుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఉత్సవ కన్వీనర్, తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి రామ్ తెలిపారు. శుక్రవారం ఉదయం టిఎస్ఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, ఈ ప్రాంతానికి ప్రకృతి వైపరీత్యాల వలన ఎటువంటి ఆపద కలగకూడదనే సంకల్పంతో 40 ఏళ్ళ కిందట డా. టి.సుబ్బరామిరెడ్డి ఆర్కే బీచ్ వద్ద మహా కుంభాభిషేకానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ప్రతి ఏటా అంగరంగ వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారని. అదే ఆనవాయితీతో ఈ ఏడాది కూడా ఆర్కే బీచ్ వద్ద మహా కుంభాభిషేకానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. జనసేన నాయకులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ సాగర తీరాన పండుగ వాతావరణాన్ని తలపించేలా మహాశివరాత్రి వేడుకలు ప్రతి ఏటా నిర్వహిస్తున్న డా. టి సుబ్బరామిరెడ్డి అభినందనీయులన్నారు. కాకినాడ భారత యజ్ఞపీఠం ప్రతినిధి, ఉత్సవ నిర్వాహకులు రత్నాల చంద్రశేఖర్ మాట్లాడుతూ టి. సుబ్బరామిరెడ్డి సొంత నిధులతో ప్రతి ఏటా నిర్వహిస్తున్న మహా కుంభాభిషేకానికి తన తాతగారైన

మిగతా 8..లో

## ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్ళేనా?

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



భారత దేశంలో పుట్టిన మనకు మనసే ఉండదా? ఇప్పటికీ బానిసత్వపు సంకెళ్ళేనా? అంటూ రాజ్యసభ మాజీ సభ్యులు వి. విజయసాయిరెడ్డి తన ట్విట్టర్ ద్వారా ప్రశ్నించారు. విదేశీ పాలకులు వెళ్ళిపోయినా విదేశీ మతాలు మాత్రం మనమధ్య మిగిలిపోయాయి. అవి మన సంస్కృతి మీద ఇంకా పరిపాలన చెయ్యాలనే చూస్తున్నాయి. విదేశీ మతాలవారు ఏదో అనుకుంటారని 120 సంవత్సరాలకు పైగా మనమంతా సగం "వందేమాతరం" గేయాన్ని పాడామా? మన జాతీయ గేయంలో మన అమ్మవార్ల పేర్లే ఉండకూడదా? ఈ దుస్థితిని మార్చి పూర్తి "వందేమాతరం" పాడాల్సిందే అన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని మనమంతా సమర్థించాలి.. స్వాగతించాలి అని ట్విట్టర్లో పేర్కొన్నారు.

# వైద్యులకు తమ వృత్తిపట్ల నిబద్ధత ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీందర ప్రసాద్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**




జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పి.జగదీశ్వర రావు వారి అధ్యక్షతన ముఖ్య అతిదిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీందర ప్రసాద్ వారు ప్రోగ్రాం అధికారులను మరియు పట్టణ/ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాదికారులను అన్ని ఆరోగ్య కార్యక్రమాల మీద సమీక్ష చేశారు. వీటిలో ముఖ్యమైనవి ఎన్.సి.డి. 4.0 స్క్రీనింగ్ నెమ్మదిగా జరుగుతుందని, ఇది శతశాతం అయ్యేలా చూడాలని రిఫరల్స్ ఎక్కువగా అయ్యేటట్లు చూడాలని ఆదేశించారు. తదుపరి మాతా శిశు మరణాల గురించి సమీక్షిస్తూ హై రిస్క్ గర్భిణీలను గుర్తించి వారికి తగు సలహాలు ఇవ్వాలని, 2దీ ఎకో చేయించాలని, అవసరమైన వారికి టిఫా స్కాన్ చేయించాలని సూచించారు. తదుపరి శిశు మరణాల గురించి ప్రస్తావిస్తూ కౌమార దశలో గల గర్భిణీలను, హైరిస్క్ గర్భిణీలను గమనించి మరియు మామ్ చిల్డ్రెన్ ను సకాలంలో విళిది కి రిఫర్ చేయవలెను. శిశు మరణాలకు గల సరైన కారణాలు గుర్తించి అటువంటి మరణాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని సూచించారు. ఏ తల్లి గాని, శిశువు గాని మెడికల్ నెగ్లిజెన్స్ వలన చనిపోకూడదని ఆదేశించారు. తదుపరి ప్రివెంటివ్ కేర్ మీద

మిగతా 8..లో

## నేడు ప్రేమికుల దినోత్సవం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త**



ప్రపంచవ్యాప్తంగా ప్రేమికులు ఈ రోజును ఎంతో ప్రత్యేకంగా జరుపుకుంటారు. ప్రేమికుల దినోత్సవం చరిత్ర: ప్రేమికుల దినోత్సవం సెయింట్ వాలెంటైన్ జ్ఞాపకార్థంగా జరుపుకుంటారు. 270లో రోమ్ దేశంలో జీవించిన వాలెంటైన్ యువతకు ప్రేమ సందేశాలు ఇవ్వడం, ప్రేమ వివాహాలను ప్రోత్సహించడం చేసేవాడు. అదే సమయంలో రోమ్‌ను పాలిస్తున్న చక్రవర్తి క్లాడియస్

మిగతా 8..లో

# చిన్నారులకు అసౌకర్యంగా ఎంపీపీ పాఠశాల

- అధికారుల నిర్లక్ష్యం చిన్నారులకు శాపం

**చింతూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



మన్యం ప్రాంతాల్లో ఆదివాసి చిన్నారులకు విద్యా విధానం నిర్లక్ష్యపు నీడలో కొట్టుమిట్టాడుతుంది అనటానికి ఈ ఘటన ప్రత్యక్ష ఉదాహరణ. చింతూరు మండలం తుమ్మల గ్రామపంచాయతీ పరిధిలోని లచ్చిగూడెం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో 25 మంది గిరిజనుల చిన్నారులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. సింగిల్ టీచర్‌తో నడవబడుతున్న ఈ పాఠశాలలో రెండు భవనాలు ఉన్నాయి. ఒక భవనం మరమ్మతులు చేయక పశువులకు

మిగతా 8..లో

## బార్ కౌన్సిల్ ఎన్నికలు ప్రశాంతం

**- విశాఖలో 2,888 మంది న్యాయవాదుల ఓటింగ్**

**(విశాఖ క్రైమ్. ప్రభాతవార్త)**






రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు శుక్రవారం విశాఖలో ప్రశాంతంగా జరిగాయి. విశాఖపట్నం కేంద్రంలో మొత్తం 3,513 మంది ఓటు హక్కు కలిగిన న్యాయవాదుల్లో 2,888 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 39,400 మంది న్యాయవాదులు ఓటర్లు కాగా, 2020 తర్వాత నిర్వహించిన ఈ ఎన్నికల్లో 143 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. విశాఖలో మొత్తం ఏడు పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. న్యాయవాదులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లాలం పార్వతి నాయుడు తెలిపారు. ఓటు హక్కును వినియోగించిన న్యాయవాదులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైజాగ్ నుంచి 23 మంది పోటీ విశాఖకు చెందిన 23 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ఎస్. కృష్ణ మోహన్, రామ జోగేశ్వరరావు (మురళీ), జి.ఎం. రెడ్డి తదితర సీనియర్ అడ్వకేట్లు ప్రధాన పోటీదారులుగా నిలిచారు.ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో ఫలితాలపై అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది.

## గాజువాకలో డంపింగ్ తొలగించాలి నిరసన తెలుపుతూ రోడ్డుపైనే వంటావార్పు!

**గాజువాక,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



జీవీఎంసీ 76వ వార్డ్ రామచంద్రనగర్ డంపింగ్ యార్డు తరలింపు డిమాండ్‌తో స్థానికులు ఉగ్రరూపం దాల్చారు. మూడు రోజులుగా ధర్నాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో, శుక్రవారం రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. 16 గ్రామాల మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జనం అనారోగ్యం పాలవుతున్నా అధికారుల్లో చలనం లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 16 గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ ఫ్లీట్ రివ్యూ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**- పెందుర్తి పరిధిలో ప్రత్యేక చెక్‌పోస్టులు వాహనాల విస్తృత తనిఖీలు**

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



విశాఖలో జరుగుతున్న ఇండియన్ ఫ్లీట్ రివ్యూ కార్యక్రమం నేపథ్యంలో నగరంలో భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. ముఖ్యంగా పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇతర రాష్ట్రాలు, ఏజెన్సీ ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే మార్గాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. అరకు-విశాఖ మార్గంలోని సరిపెల్లి జంక్షన్ వద్ద, పాడేరు-సబ్బవరం వైపు నుంచి వచ్చే వాహనాల కోసం పెనుగాడి జంక్షన్ వద్ద ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి వంటి మత్తు పదార్థాలు నగరంలోకి రాకుండా నిరోధించడంతో పాటు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు నగరంలోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఈ తనిఖీలు పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది సమన్వయంతో కొనసాగుతున్నాయి. పోలీసుల చర్యలను స్థానికులు అభినందిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఉద్యోగాల పేరుతో మోసం...

**- నిందితుడికి జైలు శిక్ష మూడు కేసుల్లో 18 నెలల కఠిన కారాగారం**

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నిరుద్యోగ యువతులను మోసం చేసిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది.ద్వారకా క్రైమ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన మూడు వేర్వేరు కేసుల్లో నిందితుడు బండారు రామ్ చరణ్ అలియాస్ కార్తీక్ అలియాస్ రవి అలియాస్ రాజు (36), లంకెలపాలెం నివాసి, దోషిగా తేలడంతో 1వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. ప్రదీప్ శుక్రవారం ప్రతి కేసులో 18 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1,000 జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది.అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. విమల్ రాథోర్ తెలిపిన వివరాల ప్రకారం, 2025 ఫిబ్రవరిలో నిందితుడు తనను ఎయిర్‌టెల్ కార్యాలయ ఉద్యోగిగా పరిచయం చేసుకుని, నగరంలోని వివిధ మహిళా హాస్టళ్లలో ఉంటున్న నిరుద్యోగ యువతులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు తీసుకునే పేరుతో వారిని మోసం చేసి, ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు దొంగిలించి పరారయ్యాడు. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)2023 సెక్షన్ 318(4), 303(2) కింద నేరాన్ని ప్రాసిక్యూషన్ సహేతుక సందేహానికి తావులేకుండా నిరూపించిందని ఏపీపీ తెలిపారు. మహిళా పోలీసు కానిస్టేబుల్ అరుంధతి సాక్షులను కోర్టులో హాజరుపరిచారు.

## వీఎంఆర్‌డీఏ సిబ్బందికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక పై శిక్షణ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఆత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పై శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో అవగాహన,శిక్షణా తరగతులు కార్యక్రమం నిర్వహించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభి వద్ధి సంస్థ జాయింట్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో అధికారులకు , సిబ్బందికి కలెక్టరేట్ నోడల్ అధికారిణి శేష శైలజ, కోఆర్డినేటర్ సిహెచ్ ప్రసాదరావు చేపట్టేరు. ఆగ్రా గ్రీవెన్స్ పరిష్కారించడానికి అవసరగమభైన తగు సూచనలను విధి విధివిధానాలు తెలియజేసారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి మురళి కష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్పా ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్ డిఎఫ్ పి శిరిష, పరిపాలనాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి సందర్బంగా 15న మాంసం దుకాణాలకు సెలవు

**- జీవిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**



మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని మాంసం దుఖాణాలకు ఈ నెల 15వ తేదిన మహా శివరాత్రి సందర్భంగా నగరంలో వున్న మాంసం, చికెన్, చేపలు తదితర దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించడమైనదని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. మహా శివరాత్రి సందర్భంగా ఆదివారం సంవత్సరములో ఈ దిగువ ప్రకటించిన జాతీయ సెలవు దినాలలో, పర్వదినములలో నగరంలో వేటమాసం, కోడి మాంసం, చేపలు, రొయ్యలు అమ్మకాలు నిషేధించడమైనందున సంబంధిత దుఖాణాలకు, జంతు వధశాలలకు సెలవు ప్రకటించడమైనదని, సంబంధిత దుఖాణాలు, జంతు వధశాలలు మూసివేయాలని, అతిక్రమించి మాంసపు దుకాణదారులు ఎవరైనా తమ దుకాణాలను తెరిచి మాంసము, చేపలు, రొయ్యలు విక్రయించినా, జంతు వధ శాలలు తెరిచిన యెడల జీవీఎంసీ కఠిన చర్యలు తీసుకోవడం జరుగునని కమిషనర్ తెలియజేశారు. మాంసం, చేపలు, దుఖాణదారులు, జంతు వధశాలలు ఈ క్రింది తెలిపిన తేదీలైన జాతీయ సెలవు దినాలను, పర్వదినాలను గమనించి ఆయా తేదీలలో స్వచ్ఛంధంగా దుఖాణాలను మూసివేయాలని కమిషనరు తెలిపారు.

## 291 మంది పోలీసు సిబ్బందికి రివార్డులు

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



నగర పోలీసు శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 291 మంది సిబ్బందికి నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి రివార్డు మంజూరు ఆర్డర్లను అందజేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన క్రైమ్ రివ్యూ మీటింగ్‌లో ఈ కార్యక్రమం జరిగింది.హోంగార్డు నుండి సీఐ స్థాయి అధికారుల వరకు వివిధ కేసుల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారికి ఈ రివార్డులు మంజూరు చేశారు. గంజాయి అక్రమ రవాణా అడ్డుకట్ట, చోరీ కేసుల ఛేదన, సొత్తు రికవరీ, పేరుమోసిన నేరస్తుల అరెస్టు, సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తులో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని కమిషనర్ అభినందించారు. సిబ్బంది సంక్షేమంతో పాటు వారి ప్రతిభను గుర్తిస్తూ ప్రతి నెలా రివార్డులు అందజేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. సిబ్బంది మరింత సమర్థంగా విధులు నిర్వర్తించి విశాఖ నగరాన్ని సురక్షితంగా ఉంచాలని ఆయన సూచించారు.

## తల్లి కన్నీళ్లు తుడిచిన మహారాణిపేట పోలీసులు

**- గంటలోనే మిస్సింగ్ యువతి ఆచూకీ సీఐ దివాకర్ యాదవ్ తక్షణ చర్య ఫలితం**

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**




కూతురు కనిపించక తల్లి ఆవేదనలో మునిగిపోయిన వేళ మహారాణిపేట పోలీసుల వేగవంతమైన స్పందన ఓ కుటుంబానికి ఊరట ఇచ్చింది. గంట వ్యవధిలోనే మిస్సింగ్ కేసును ఛేదించి యువతిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.కేజీహెచ్ సమీపంలో నివసించే గెద్దం అంబికా (23) తల్లితో చిన్న గొడవ అనంతరం శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సాయంత్రం 4 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు.సమాచారం అందుకున్న మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ వెంటనే అప్రమత్తమై ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. సాంకేతిక ఆధారాలు, పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలతో గంటలోపే యువతిని గుర్తించారు. అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి తల్లికి అప్పగించారు.కూతురిని క్షేమంగా చూసిన తల్లి ఆనందభాష్పాలతో పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. వేగవంతమైన చర్యతో ఓ కుటుంబానికి మళ్లీ చిరునవ్వులు తీసుకొచ్చిన సీఐ దివాకర్ యాదవ్, సిబ్బందిని స్థానికులు అభినందిస్తున్నారు.

## నేరాలపై నిఘా మరింత పటిష్టం

**- ఎన్‌డీపీఎస్, పాక్సో, సైబర్ క్రైమ్ కేసులపై కఠిన చర్యలు సీపీ డా. శంఖబ్రత బాగ్చి స్పష్టం**

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**





నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏడీసీపీలు నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నిర్వహించిన నెలవారీ రివ్యూ సమావేశంలో ప్రతి పోలీస్‌స్టేషన్ పనితీరును సమీక్షించారు. రౌడీషీటర్లపై కఠిన నిఘా ప్రతి స్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. ఎన్‌డీపీఎస్ కేసుల పురోగతిని సమీక్షిస్తూ నగరం గుండా గంజాయి రవాణా పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు. లాంగ్ పెండింగ్ కేసులకు చెక్ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, ఆలస్యానికి కారణాలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు తీర్పుల వివరాలు, కన్విక్షన్ రేటు పెంపుపై దృష్టి పెట్టాలని సూచించారు.మహిళల భద్రతకు ప్రాధాన్యం మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసుల్లో జాప్యం లేకుండా స్పందించాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ పాటించాలని తెలిపారు. పాక్సో కేసులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సైబర్ క్రైమ్, టెక్నాలజీ వినియోగం సైబర్ నేరాల నియంత్రణకు మరిన్ని అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వీఎంఎస్ (విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్) వినియోగాన్ని పెంచి నిందితుల గుర్తింపును వేగవంతం చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట ఈవ్ టీజింగ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్, పికెట్, డికాయ్ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పారదర్శక విధులపై హెచ్చరిక విధుల్లో ఎటువంటి చట్టవ్యతిరేక చర్యలు, అవినీతి, అధికార దుర్వినియోగం జరిగితే కఠిన చర్యలు తప్పవని సీపీ బాగ్చి హెచ్చరించారు.ఈ సమావేశంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలు తదితర అధికారులు పాల్గొన్నారు. వచ్చే నెల రివ్యూ సమావేశానికి ముందు ప్రతి స్టేషన్ పనితీరు మరింత మెరుగుపడాలని సీపీ స్పష్టం చేశారు.

## 21 మంది పోలీసు సిబ్బందికి పదోన్నతులు

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**



నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన 21 మంది సిబ్బందికి పదోన్నతులు అందజేశారు. నగర పోలీసు కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమోషన్ ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందించారు.ఒక అసిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా, 17 మంది ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లుగా, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లకు అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్లుగా, ఒక ఏఆర్ హెడ్ కానిస్టేబులుకు అసిస్టెంట్ రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టరుగా పదోన్నతులు లభించాయి. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్న కమిషనర్, ప్రమోషన్ పొందిన సిబ్బందిని వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉడా చిల్డ్రన్ అరేనాకు ఆహ్వానించి, ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. సిబ్బంది మరింత సమర్థంగా విధులు నిర్వర్తించాలని ఆయన సూచించారు.

## చెట్టుకు ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)**





చెట్టుకు ఉరేసుకొని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కంచరపాలెం పరిధిలో చోటుచేసుకుంది. శుక్రవారం వెలుగులకు వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రామ్మూర్తి పంతుల పేట, ఫ్లై ఓవర్ బ్రిడ్జి కింద చెట్టుకు రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వేలాడుతున్న మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడు జేబులోని కాగితాలను బట్టి బీహార్ కు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుని వయసు సుమారు 30 ఏళ్లు ఉండవచ్చుని, చామన చాయ శరీర రంగులో ఫుల్ హ్యాండ్, ఫుల్ షర్ట్ ధరించి ఉన్నట్టు ఆనవాళ్లు పోలీసులు తెలిపారు. మృతిని బంధువులు ఉంటే తమను సంప్రదించవచ్చని పోలీసులు చెబుతున్నారు. సీఐ కె రవికుమార్ నేతృత్వంలో కంచరపాలెం ఏఎస్ఐ కేకే రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## మహా శివరాత్రి రోజున మాంసం దుకాణాలు తెరవరాదు

**ఆనందపురం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:**



మహా శివరాత్రి సందర్భంగా ఆనందపురం మండల పరిధిలోని మాంసం, చికెన్, చేపలు, రొయ్యలు దుకాణాలు, జంతు వధశాలలు ఆదివారం తప్పని సరిగా మూసివేయాలని సిఐ చింతా వాసునాయుడు చెప్పారు. ఈ మేరకు నగర కమిషనర్ ఆదేశాల జారీ చేసినట్లు ఆయన తెలిపారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మాంసాహార అమ్మకాలను నిషేధిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ ఆదేశాలను అతిక్రమించి ఎవరైనా దుకాణాలు తెరిచి విక్రయాలు జరిపినా లేదా జంతు వధశాలలు నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అంధురాలికి సౌండ్ బాక్సు వితర

**విశాఖపట్నం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త**



పేదరికం, ఆపై కొడుకు అనారోగ్యంతో బాధపడుతున్న నగరానికి చెందిన అంధురాలు శిరీషా సహాయం కోసం చారిటీ బాక్సును ఆశ్రయించింది. స్ట్రీట్ ఆర్కెస్ట్రాకు వెళ్తున్న ఆమె సౌండ్ బాక్సు ఇప్పించమని వేడుకుంది. ఆమె అడిగిన ఆ సౌండ్ బాక్సును చారిటీ బాక్సు ప్రతినిధి మహమ్మద్ ఆజంఖాన్ చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. రూ.16,500 విలువైన ఈ సౌండ్ బాక్సుకు చారిటీ బాక్సు సభ్యులు తమవంతుగా సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో ఎదురుదెబ్బలు తగిలినా ముందుకు సాగాలన్న ఆ సంకల్పం గొప్పదన్నారు. భర్త నిరాదరణకు గురైనా కొడుకు కోసం అహర్నిశలు శ్రమిస్తుందన్నారు. ఆ పిల్లాడు గుండె అనారోగ్యంతో సతమతం అవుతున్నాడన్నారు. ఈ సౌండ్ బాక్సు ఆమెను ఆర్థికంగా స్థిరపరుస్తుందన్నారు. చారిటీ బాక్సు ద్వారా గత ఐదేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అభాగ్యులకు అండగా నిలవడమే చారిటీ బాక్సు లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో లక్కోజు నూకరాజు పాల్గొన్నారు.

## మల్కాపురం పోలీసులకు రివార్డుల పంపిణీ

**- నేరాల అదుపులో ప్రతిభ.. సీపీ ప్రశంసలు**

**గాజువాక,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**



నగర పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మల్కాపురం పోలీసులు ప్రశంసలు అందుకున్నారు. వివిధ కేసుల దర్యాప్తులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను మల్కాపురం పోలీసులకు రివార్డులు దక్కాయి. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు నేతృత్వంలోని బృందం సాధించిన విజయాలను నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. కేసుల ఛేదనలో మల్కాపురం పోలీసులు చురుకైన పాత్ర పోషించారు. ముఖ్యంగా..మాదకద్రవ్యాల విక్రయదారుల గుట్టురట్టు చేసి, నిందితులను కటకటాల్లోకి నెట్టారు. పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాలను పట్టుకోవడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బెల్ట్ షాపులపై మెరుపు దాడులు నిర్వహించి కేసుల నమోదు చేశారు. అదృశ్యమైన వ్యక్తులను కనిపెట్టి, వారిని సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించి బాధితుల కళ్లలో ఆనందం నింపారు. మొత్తం 9 ప్రధాన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, నేరస్థులను పట్టుకోవడంలో చూపిన చొరవకు గుర్తింపుగా సీఐ గొలగాని అప్పారావుతో పాటు సిబ్బందికి రివార్డులను అందజేశారు. ఉన్నతాధికారుల నుంచి అందిన ఈ ప్రశంసలు సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి.

## సాగరతీరాన అందాల సందడి

**- నేడు టీన్, మిస్, మిసెస్ మిస్టర్ స్పార్కిల్ వైజాగ్ 202526 ఫినాలే**

**విశాఖపట్నం: ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త)**



నగర అందాలకు పట్టాభిషేకం చేసేందుకు విశాఖ సాగరతీరం సిద్ధమైంది. ఎలైట్ మోడల్ ఇన్‌స్టిట్యూట్ మరియు విఫ్ట్ ఆధ్వర్యంలో నిర్వహించుతున్న ఖిటీన్, మిస్, మిసెస్ మిస్టర్ స్పార్కిల్ వైజాగ్ 202526ఖి గ్రాండ్ ఫినాలే స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం లో ఫిబ్రవరి 14న అత్యంత వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా నగరంలోని రామ్ నగర్ వి ఏం ఆర్ డి ఎ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్యక్రమ వివరాలను నిర్వాహకులు ఎలైట్ మోడల్ ఇన్‌స్టిట్యూట్ సీఈఓ సన్నీ,విఫ్ట్ ఫ్యాషన్ డిజైనింగ్ ఎండీ బుగతా లక్ష్మి,సువిధ మేకోవర్స్ మేకప్ కొలబ్రేరేషన్స్ ఎండి చందాకా కృష్ణవేణి లు తెలిపారు.ఈ పోటీలు కేవలం బాహ్య సౌందర్యానికే కాకుండా.. అభ్యర్థుల తెలివితేటలు, సామాజిక స్పృహ, ఆత్మవిశ్వాసానికి పరీక్షగా నిలుస్తాయని భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా సాంప్రదాయ దుస్తులతో ర్యాంప్ వాక్,నృత్యం, సంగీతం వంటి కళా నైపుణ్యాల ప్రదర్శన,ఆధునిక దుస్తులతో స్టైల్ మరియు కాన్ఫిడెన్స్‌ను చాటిచెప్పే ప్రదర్శన ఉంటుందన్నారు. ఏపీలోని మోడలింగ్ ఔత్సాహికులను జిల్లా స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తాము కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. శనివారం స్వర్ణభారతి వేదికగా జరిగే ఈ తుది పోరులో పాల్గొంటున్న కంటెస్టెంట్లను ప్రోత్సహించేందుకు వైజాగ్ వాసులందరూ తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ఈ సమావేశంలో మిస్ యూనివర్స్ ఫరెవర్ ఆంధ్ర శశిరేఖ, కొరియోగ్రాఫర్స్ భాగీ,సరిత తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ మాఫియాను అరికట్టాలి: సిపిఐ

**గాజువాక, ఫిబ్రవరి13,ప్రభాతవార్త**



రాష్ట్రంలో కార్పొరేట్ ఆసుపత్రులు, ఫార్మా పరిశ్రమల దోపిడీని అరికట్టాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు కాండ్రేగుల సత్యాంజనేయ డిమాండ్ చేశారు. గురువారం పారిశ్రామిక ప్రాంతాలైన కాకరలోయ, త్రినాధపురం, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో పార్టీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఖిమెడికల్ మాఫియాను అరికట్టండిఖి అనే గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాసిరకం మందులు, జనరిక్ అధిక ధరలతో సామాన్యులను వంచిస్తున్నారని మండిపడ్డారు. వైద్య రంగాన్ని ప్రైవేటీకరించే పి.పి.పి విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని, ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గుడాల రాంబాబు, గండ అప్పారావు, సత్యనారాయణ రెడ్డి, కనకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసానికి ఎన్ఎస్ఎస్ మార్గం

**గాజువాక,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**




విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్ )పాత్ర అత్యంత కీలకమని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సీనియర్ వాలంటీర్ల వీడ్కోలు సమావేశంలో ఆమె ముఖ్య వక్తగా ప్రసంగించారు. ఇంటర్ స్థాయిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లుగా పొందిన అనుభవం, డిగ్రీ స్థాయిలో జాతీయ, అంతర్జాతీయ అవకాశాలకు బాటలు వేస్తుందని ఆమె వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ క్యాస్లిన్ మాట్లాడుతూ.. విద్యార్థినుల్లో జ్ఞానం, విలువలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యంగా కళాశాల పనిచేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన 13 మంది వాలంటీర్లను మెమెంటోలు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు నదియా, సంధ్య, అకడమిక్ కోఆర్డినేటర్ జగన్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినుల సేవలను కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమాకుమారి అభినందించారు.

## పరిశుభ్రతతోనే వ్యాధుల నివారణ

**గాజువాక,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త**




వ్యక్తిగత పరిశుభ్రతతోనే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చని వెస్ట్ జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ అన్నారు. జీవీఎంసీ 58వ వార్డు కుంచమ్మ కాలనీలో శుక్రవారం మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసాల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ట్యాంకులు, కుండీలను వారానికి రెండుసార్లు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మలేరియా సూపర్ వైజర్లు దుల్లా శ్రీనివాసరావు, రాంబాబు, సిబ్బంది లలితకుమారి, నూకాలమ్మ, లక్ష్మణరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




## శివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన దేవదాయ శాఖ డిసి ఎన్ సుజాత



అనకాపల్లి ఫిబ్రవరి 13: (ప్రభాతవార్త)

దేవాదాయ ధర్మాదాయ శాఖ వేల్పుపుల వీధి స్వయంభు దేవాలయం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం దేవదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను పాలకవర్గ సభ్యులు, ఈవో ఘనంగా సత్కరించారు. ఆలయంలో స్తంభానికి నూతనంగా తయారుచేసిన ఇత్తడి తొడుగులు పూజలు చేసి ప్రారంభించారు. ఆలయంలో శివ రాత్రి ఏర్పాట్లు కూడా ఏ విధంగా చేస్తున్నారో ఆలయ ఈవో బి మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఇటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ఆలయ చైర్మన్ తాటికొండ కామేశ్వరరావు(రాంబాబు), ఆలయ అర్చకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

### గ్రామాలలో మౌలికవసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట

అనకాపల్లి ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



కూటమి ప్రభుత్వంలో ప్రజా సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత గెలిపిస్తూ గ్రామాలలో మౌలిక వసతులు కల్పనకు పెద్దపీట వేస్తుందని నియోజకవర్గ ఇన్చార్జ్, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ చైర్మన్ పీలా గోవింద సత్య నారాయణ అన్నారు. ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ప్రజలు వివిధ సమస్యలపై వ్రాత పూర్వకంగా అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతి బాపులే బీసీ గురుకుల పాఠశాలకు సొంత భవనాలను నిర్మించాలని వారిని కోరగా మాజీ మంత్రి, శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ , పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ సహకారంతో కృషి చేస్తామని అన్నారు. అనకాపల్లి మండలంలో పలు గ్రామాలలో వాటర్ సమస్య పై, వాటర్ ట్యాంక్ సమస్యలపై పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పీలా గోవింద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను 100 శాతం అమలుపారుస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర పెద్ద ఎత్తున ప్రజలు, టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లపై డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ



### చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ

అనకాపల్లి ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మహాశివరాత్రి ఈ నెల 15వ తేదీన ఆదివారం శ్రీ భోగలింగేశ్వర దేవస్థానంలో నిర్వహిస్తున్న ఏర్పాట్ల గురించి దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత శుక్రవారం దేవాలయంలో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థప్రసాదాలు స్వీకరించి అనంతరం పాలకమండల సభ్యులు చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ శాలువతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. సుజాత మాట్లాడుతూ భక్తులకి రాత్రి సమయంలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా, మహిళలకు భద్రత కల్పించాలని, అలాగే ఉదయం నుండే ఎండ తగలకుండా టెంట్లు వెయ్యాలని, దాహార్తిని తీర్చడానికి మంచినీరు, మజ్జిగ ప్రసాదాలు వంటివి ఏర్పాటు చేయాలని, ప్రజా ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ రక్షణ కోసం తగు బందోబస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి మురళీకృష్ణ కు ఆదేశాలు ఇచ్చారని సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలక మండల సభ్యులు మద్దాల నారాయణరావు, యలమంచిలి బంగార్రాజు, రాపేటి లీల నాగ సంతోష్, దూలశీ సత్యవతి, బాదంపూడి కొండమ్మ, అర్చకులు పేరూరి చినిస్వామి సాత్విక్ దేవాదాయ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాలకు నూతన ప్రింటర్ల పంపిణీ చేసిన ఎంపీపీ రాజాన శేషు..

ఎలమంచిలి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



మండల పరిధిలో పది (10) గ్రామ సచివాలయాలకు గాను మొదటి విడతలో ఐదు (5) సచివాలయాల కు నూతన ప్రింటర్లు డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి అనకాపల్లి వారి ద్వారా ప్రింటర్లను మండల పరిషత్ అధ్యక్షులు రాజాన సూర్య చంద్ర శేష గిరి రావు (శేషు), జెనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాని, జంపాప పాలెం జెనసేన పార్టీ నాయకులు సతీష్ కుమార్, పెద్ద షేకులపాలెం జెనసేన పార్టీ నాయకులు ప్రగఢ ఆనంద్ కుమార్ ఎంపీడీవో కె.ఎస్. కొండలరావు చేతుల మీదుగా స్వర్ణ గ్రామం కార్యాలయాలకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్రామ సచివాలయాలలో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నూతన ప్రింటర్ల ద్వారా సేవల నిర్వహణ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిబ్బంది సంక్షేమమే మా ధ్యేయం

### నేరుగా జిల్లా అదనపు ఎస్పీతో మాట్లాడిన 10 మంది సిబ్బంది



అనకాపల్లి ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

జిల్లా పోలీసు శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు అమలులోకి వచ్చిన ఎస్పీ ఫోన్-ఇన్ కార్యక్రమం జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు శుక్రవారం స్వయంగా ఫోన్ లైన్ ద్వారా సిబ్బంది సమస్యలను ఆలకించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి మోహన్ రావు మాట్లాడుతూ నాయకత్వానికి, క్షేత్రస్థాయి సిబ్బందికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, సిబ్బంది తమ వ్యక్తిగత లేదా వృత్తిపరమైన ఇబ్బందులను ఎటువంటి సంకోచం లేకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ఈ వేదికను రూపొందించడం జరిగిందన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 10 మంది సిబ్బంది ఫోన్ నంబర్ 93469 12011 ద్వారా సమస్యలు వివరిస్తూ సర్వీస్ పరమైన పోస్టింగ్స్, బదిలీలు, సెలవులు కుటుంబ ఆరోగ్య సమస్యలను మాట్లాడారు. ప్రతి సమస్యను లోతుగా విశ్లేషించిన అదనపు ఎస్పీ, వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏవో సిహెచ్.తిలక్ బాబు, ఎస్సై ప్రసాద్, ఆఫీస్ సూపరింటెండెంట్ ప్రతాప్ శేషయ్య, బీమాబాయి, ప్రేయర్ సన్ పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబునాయుడుని కలిసిన ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



అమరావతిలోని రాష్ట్ర ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, స్థానిక పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని వివరించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, సీనియర్ నాయకులు కర్రీ వెంకటరమణ పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న పప్పల చలపతిరావు



ఎలమంచిలి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపీ పప్పల చలపతిరావు నియోజకవర్గ పరిశీలకులు బొండా జగన్నాథం ప్రజల వద్దనుండి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ మూర్తి, క్లస్టర్ ఇంచార్జ్ కరణం రవికుమార్, వార్డు అధ్యక్షులు కరెడ్ల మల్లికార్జునరావు, గొర్లె బాబురావు, దేవ నాగేంద్ర, శ్రీమంతుల శ్రీనివాసరావు, యూనిట్ ఇంచార్జ్ సేనాపతి రాజా మహేష్, చేబ్రోలు శ్రీను, పాల్గొన్నారు.

## రోటరీ కంటి ఆసుపత్రికి 50 లక్షల నిధులు మంజూరు

అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 13 (ప్రభాత వార్త)



అనకాపల్లి రోటరీ కంటి ఆసుపత్రికి రోటరీ ఇంటర్నేషనల్ నుండి సుమారు 50 లక్షల రూపాయలు నిధులు మంజూరైనట్లు రాత్రి క్లబ్ కంటి ఆసుపత్రి చైర్మన్ బుద్ధ రమణాజీ, కోచెర్మన్ కడిమిశెట్టి సతీష్ తెలిపారు. ఈ మేరకు నిధులు మంజూరుకు కృషి చేసిన సభ్యులను రోటరీ క్లబ్ కార్యాలయంలో క్లబ్ ప్రతినిధులతో శుక్రవారం ఘనంగా సత్కరించారు. కాంటాక్ట్ ప్రెషర్ కుష్వంత్, డిఆర్ఎఫ్‌సిపి రాజేశ్వరప్రసాద్ ముఖ్య అతిథి డైరెక్టర్ ఆఫ్ ఆడిట్స్ ఏపీ గవర్నమెంట్ జి శ్రీకాంత్ చేతుల మీదగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, కార్యదర్శి రాజేష్ అధిక సంఖ్యలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## సమస్యలు పరిష్కారం కోరుతూ కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయులు నిరసన



అనకాపల్లి ఫిబ్రవరి13,ప్రభాతవార్త

సమస్యలు పరిష్కారం కోరుతూ ఎస్ టి యు అనకాపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా సిపిఎస్ రద్దు ఆర్థిక బకాయిలు చెల్లింపు పిఆర్సి కమిషన్ నియామకం మధ్యంతర భృతి ప్రకటన, పాఠశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి అనకాపల్లి జిల్లా రాష్ట్ర ఉపాధ్యాయ శాఖ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 50 మంది సంఘం సభ్యులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు ఐవి రామి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కే పరదేశి, రాష్ట్ర కౌన్సిలర్ పి గంగాధర్, ఉపాధ్యక్షులు ఉదయ భాస్కర్, మహిళా అధ్యక్షురాలు సునీత అసోసియేట్ అధ్యక్షులు భాస్కర్, ఎలమంచిలి బాధ్యులు రాజశేఖర్, జిల్లా నలుమూలల నుండి 50 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సంతూర్, రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్షిప్స్‌కు డిగ్రీ కళాశాల విద్యార్థినిల ఎంపిక

చోడవరం, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి బిఏ చదువుతున్న బాలికలలో మొత్తం 24 మంది విప్రో సంస్థ అందించే విప్రో- సంతూర్ ఉమెన్స్ స్కాలర్షిప్స్ కార్యక్రమానికి ఎంపికయ్యా రని ప్రిన్సిపాల్ డా.పి.కిరణ్ కుమార్ శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో తెలిపారు. వీరికి ఒక్కొక్కరికి ఏడాదికి 30 వేల చొప్పున మొత్తం మూడు ఏళ్లు పాటు 90 వేల రూపాయలు స్కాలర్షిప్స్ గా అందించబడతాయన్నారం అలాగే రిలయన్స్ ఫౌండేషన్ వారు దేశవ్యాప్తంగా అందించే 5000 స్కాలర్షిప్స్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఎస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం చదువుతున్న వై ధనలక్ష్మి అనే విద్యార్థిని ఎంపికయింది. ఈ విద్యార్థినికి సంవత్సరానికి 50వేల చొప్పున మొత్తం మూడు సంవత్సరాలకు 1,50,000 వేల రూపాయలు అందించబడతాయన్నారు. ఈ స్కాలర్షిప్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకునే విద్యార్థినులకు మాత్రమే అందిస్తారని, కాబట్టి రాబోయే విద్యా సంవత్సరానికి (2026-27) చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలనుకునే విద్యార్థినులు మరింత ఎక్కువమంది ఈ సంతూర్ ఉమెన్స్ స్కాలర్షిప్స్ పొందాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఈ స్కాలర్షిప్స్ ను విద్యార్థినిల ఉన్నత చదువులకి వినియోగించాలని కోరారు. స్కాలర్షిప్ పొందిన విద్యార్థినులను అధ్యాపకులు అభినందించారు.

## ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుంది..



అనకాపల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

కూటమి ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ ప్రోత్సాహం అందిస్తుందని గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర అన్నారు. స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరి తోటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన నేషనల్ సబ్ జూనియర్స్ టీమ్ సెలక్షన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నలుమూలలు నుండి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఉదయం 9 గంటలకు నుండి సాయంత్రం 5 గంటల వరకు పోటీలు నిర్వహించారు. వీరిలో 18 మంది బాయ్స్ టీమ్,18 మంది గర్ల్స్ టీమ్ లు ను ఎంపిక చేశారు. వీరు వారం రోజుల ట్రైనింగ్ పూర్తి చేసుకొని ఈ నెల 25 న వెస్ట్ బెంగాల్ లో జరిగే నేషనల్ టీమ్ లో పాల్గొంటారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళా సురేంద్ర ముందుగా క్రీడాకారులను పరిచయ కార్యక్రమం చేసి అనంతరం మల్ల సురేంద్ర మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం అందిస్తుందని, నేషనల్ పోటీలకు ఎంపిక అయిన వారినందరినీ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగన్నాథ స్వామి దేవస్థానం చైర్మన్ దాడి బుజ్జి, ఆర్గనైజర్స్ దాడి శ్రీను, యల్లపు గోవింద్, బుద్ధ శివ, పీలా రమణారావు, మరియు కోచెస్, టీమ్ మేనేజర్స్ తదితరులు పాల్గొన్నారు.

## మనస్థాపంతో యువకుడు ఆత్మహత్య...

ఎలమంచిలి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



పట్టణంలోనే ద్వారకా నగర్ లో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. పట్టణ ఎస్సై సావిత్రి తెలిపిన వివరాలు ప్రకారం ద్వారకా నగర్‌లోని నివాసముంటున్న ఏ వీర వెంకట శివ నాగేశ్వరరావు (27)ను పెంచి పెద్ద చేసిన మేనమామ పెద్దమ్మ చనిపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. ఇదే విషయాన్ని డైరీలో కూడా వ్రాసుకున్నట్లు పట్టణ ఎస్సై సావిత్రి తెలిపారు. మృతుని తండ్రి శ్రీనివాస రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## నా హక్కులు హరించేలా ప్రతిష్ఠన దిగజాస్తున్నారు...

### స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



ఎలమంచిలి ,ఫిబ్రవరి 13,ప్రభాతవార్త

ఎలమంచిలి నియోజకవర్గ రాంబిల్లి మండలం పంచదార్ల గ్రామంలో దళితులకు ఇచ్చిన డి ఫామ్ పట్టా భూములను తాను కబ్జా చేసాను అంటూ కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ శాసనసభాపతి అయ్యన్న పాత్రుడికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో తనకు ఎటువంటి సంబంధం లేకపోయినా శాసనసభ్యుడిగా నా హక్కులను హరించేలా నాపై నిరాధార కథనాలను ప్రచురింప చేసి, నా పరువుకు ప్రతిష్టకు దిగజార్చాలని చేసిన కొందరు పై సభా హక్కుల కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసభాపతి రఘు రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వానికి 108 సిబ్బంది కృతజ్ఞతలు

గొలుగొండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త




108 వాహనాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఇచ్చిన మాట నెరవేర్చిన ఓటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ 108 వాహనం ముందు ప్లకార్డులను ప్రదర్శించారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట ప్రకారం 4000 రూపాయలు పెంచుతూ మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా యూనియన్ నాయకులు కార్యక్రమాన్ని కేంద్రంలో నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చారని అన్నారు. మరింత ఉత్సాహంగా సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభుత్వానికి గోల్డెన్ అవర్ సేవలు అందిస్తూ 24 గంటలు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని అధ్యక్షులు మట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. గొలుగొండ సిబ్బంది అప్పారావు, రమణ, రామ్మోహన్ మోహన్ పాల్గొన్నారు.

## సాంకేతికతతో సాగు - లాభాల దిశగా రైతులు

రాంబిల్లి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త




రాంబిల్లి మండలంలో హరిపురం బిసిటి - కెవికెలో శుక్రవారం అభ్యుదయ రైతులతో జరిగిన కార్యాసాలలో పలువురు రైతులు తమ అనుభవాలను వివరించారు, వినూత్న సాగు పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చవచ్చని అభ్యుదయ రైతులు కోరారు. తోటి రైతులు కూడా శ్రద్ధ వహించాలని అన్నారు, రైతులు మరింత ప్రగతి పథంలో సాగడం కోసమే ఈ కార్యసాలను ఏర్పాటు చేశామని కెవికె సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ కుర్ర చెప్పారు, రైతులు విభిన్న ఆలోచనలతో మేలైన నూతన పద్ధతులు పాటించడం ద్వారా ఒకే ఎకరంలో రూ.లక్షల్లో ఆదాయం పొందుతున్న రైతులు ఆదర్శనీయమని బీసీటీ - కెవికె చైర్మన్ భాగవతుల శ్రీరామ్మూర్తి చెప్పారు, అభ్యుదయ రైతులు గౌతమ్ రాజు, ప్రసాద్ రాజు, సుబ్బరాజు కొండ ప్రాంతాల్లో యంత్రాలు లేకుండా చేసే లాభసాటి వ్యవసాయ విధానాలను వివరించారు, కొబ్బరిలో అంతరపటంగా వక్క,డ్రాగన్ ఫ్రూట్ ఇతర ఉద్యాన పంటల సాగును వివరించారు, వ్యవసాయం శ్రద్ధతో శ్రమతో చేస్తే లాభసాటి కానిదేది లేదని శ్రీపతి రాజు తెలిపారు. వరి పంటలో కన్నా మొక్కజొన్న నువ్వులు వంటి పంటలు కూడా లాభదాయకమని చెప్పారు, చెరకులో ఎకరాకు 100 టన్నుల సాధించడమే లక్ష్యంగా వ్యవసాయం చేస్తున్నామన్నారు, పోషకాలు సమతూలంగా అందించేందుకు శ్రద్ధ వహించాలని చెప్పారు, పచ్చిరొట్ట ఎరువులను సరిహద్దుల్లో పెంచుకోవడం ద్వారా యూరియా అవసరం ఉండదని తెలియజేశారు, నాటు ఆవు ప్రాధాన్యత, ప్రకృతి వ్యవసాయం, కూలీల ఇబ్బందులు అధికమించడంపై అవగాహన కల్పించారు, ఈ కార్యక్రమంలో కెవికె అభ్యుదయ రైతులు మరియు శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

## దారమల్లేశ్వరస్వామి ఆలయానికి స్టీల్ గేట్ వితరణ

గొలుగొండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



శ్రీ ఉమా దార మల్లేశ్వర స్వామి ఆలయానికి స్టీల్ గేట్ వితరణగా అందించిన ఆర్టీసీ ఉద్యోగి నల్లబెల్లి గంగాధర దంపతులు. శివరాత్రి మహోత్సవాలకు సిద్ధమవుతున్న ఆలయం మండపానికి గేటును జోగంపేట గ్రామానికి చెందిన నల్లబెల్లి గంగాధర్ దంపతులు స్టీల్ గేటును బహూకరించారు. మండపానికి గేటు మరమ్మతులు గురి కావడంతో కోతులతో ఇబ్బంది కలగడంతో భక్తులకు ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గేటును విరాళంగా అందించారు. శుక్రవారం ఈ గేటును పాత మల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి ఆనంద్, ఆలయ పూజారి మణి సమక్షంలో ఏర్పాటు చేశారు. గ్రామస్థులు, తోటి సిబ్బంది దాతలను అభినందిస్తూ భక్తులు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు.ల్ణ

## పెడల్ ఫర్ ఫ్రీడమ్ సైకిల్ యాత్ర..




ఎలమంచిలి ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

కమిషనర్ ఆఫ్ కాలేజీయేట ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్, రెడ్ రోప్ ఉద్యమం సంయుక్త ఆధ్వర్యంలో పెడల్ ఫర్ ఫ్రీడమ్ అనే సందేశంతో సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. ఈ సైకిల్ యాత్ర ఫిబ్రవరి 9న విజయవాడలో బయలుదేరి పలు కళాశాలలో పాఠశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాలు వలన కలిగే దుష్పర నామాలను శారీరక మానసిక ఆరోగ్యం పై వచ్చే ప్రభావం నేరచరిత్ర పై పడే ప్రభావాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. వీరు సైకిల్ యాత్రలో భాగంగా ఎలమంచిలి పట్టణంలో గల గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గురువారం చేరుకున్నారు. వీరికి కళాశాల సిబ్బంది ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ స్వాగతం పలికారు. అనంతరం వీరు శుక్రవారం పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గర్ల్స్ హై స్కూల్ లోని విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

## జీడి తోటలకు నష్టపరిహారం చెల్లించాలి..

### దళిత సంఘాలు ఆందోళన.!

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని డిఎల్ పురంలో గల సర్వేనెంబర్ 85 /6లో ఉన్న జీడి తోటలకు నష్ట పరిహారం తక్షణమే చెల్లించాలని కోరుతూ గురువారం తేజ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ దూలపల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామాని కి చెందిన దళితులు కుందేటి సింహాచలం, ఆరుగుల ప్రకాష్ ,దేవుడు, ఏడిద వీరన్న ,దూలపల్లి రమణ, కుందేటి సత్యనారాయణ, తదితరులు, మహిళలతో కలిసి రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ నాయకత్వంలో శుక్రవారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. తక్షణమే ఏపీఐఐసీ అధికారులు భూసేకరణలో భాగంగా ఈ సర్వే నెంబర్‌లో ఉన్న జీడి తోటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. 75 మంది వరకు రైతులు ఎన్నో సంవత్సరాల నుంచి ఈ జీడి తోట మీద ఆధారపడి జీవిస్తున్నారని, అటువంటి తోటను స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఫెన్సింగ్ చేసే విషయంలో తొలగిస్తున్నారని, ఆ తొలగించిన జీడి తోటలకు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప తాసిల్దార్ నారాయణ రావుకు వినతిపత్రం అందజేశారు.

## దారమఠంను సందర్శించిన డివిజన్ అధికారులు



గొలుగొండ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మహాశివరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న దారమఠం ఆలయాన్ని డివిజన్ అధికారులు శుక్రవారం సందర్శించారు. డివిజన్ పంచాయతీ రాజ్ అధికారి సత్యనారాయణమూర్తి, ఎలక్ట్రికల్ డిఈ సునీల్ వేర్వేరుగా తమ సిబ్బందితో పరిశీలించారు. పంచాయతీ రాజ్ శాఖ నుండి అందించాల్సిన సేవలు అలాగే ప్రస్తుతం జరుగుతున్న ఏర్పాట్లుపై ఆరా తీశారు. భక్తులకు అందిస్తున్న మౌలిక వసతులు తాగునీరు, మరుగుదొడ్లు, స్నానాల గదులు ఏర్పాటుపై కమిటీ సభ్యులతో మాట్లాడారు. విషయంలో ఎక్కడా రాజీ పడవద్దు అని సూచించారు. అలాగే విద్యుత్ సరఫరా లో ఎటువంటి అంతరాయం లేకుండా చూస్తామని ఎలక్ట్రికల్ డిఈ సునీల్ తెలిపారు. అలాగే ఉత్సవాలు జరిగే మూడు రోజులు పాటు సిబ్బందిని ఇక్కడే ఉంచుతామని ఏ విధమైన విద్యుత్ సమస్య తలెత్తదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఏఈ మహేష్, సహాయ సిబ్బంది, గడ్డం ఆనంద్ పాల్గొన్నారు.

## డ్రైనేజీ పైన పలకలు ఏర్పాటు

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



మండలంలోని రాజయ్యపేట గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ పిక్కి అప్పలనర్స ఆధ్వర్యంలో పంచాయతీ నిధులతో నూకతాత జాతర మహోత్సవాలు సందర్భంగా ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేటట్లు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పంచాయితీ డ్రైనేజీపై పలకలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, ఐటీడీపీ మండల అధికార ప్రతినిధి మైలపల్లి ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సొంత నిధులతో పైప్‌లైన్ పునరుద్ధరణ



### తెదేపా నాయకులు సంఘీభావం

రాంబిల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

రాంబిల్లి మండలం వెల్చూరు పంచాయతీ శివారు వీ.ఆర్ అగ్రహారం పరిధి ఇందిరమ్మ కాలనీలో సుమారు 100 కుటుంబాలకు మూడు నెలలుగా స్తంభించిన తాగునీటి పైపులైను శుక్రవారం తేదేపా నాయకులు తమ సొంత నిధులతో పునరుద్ధరించారు. తెదేపా మండల కమిటీ మాజీ కార్యదర్శి లాలం తాతబాబు తన సొంత నిధులు రూ.40 వేలు ఖర్చు చేసి రెండు చోట్ల తెగిపోయిన పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేయించారు. ఈ కాలనీ సమీ పంగా ఉన్న అటవీ భూముల చుట్టూ రక్షణశాఖ నిర్మించే ప్రహరీలో పైపులు ధ్వంసమయ్యాయి. ఇందిరమ్మ కాలనీ, వి.ఆర్ అగ్రహారం పరిధిలో ఉన్న అక్కడ ఉండే ఓటర్లు చాలావరకు గొరపూడి పంచాయతీలో నమోదయ్ ఉన్నారు, దీంతో వెల్చూరు గొరపూడి రెండు పంచాయతీల కార్యదర్శిలు మరమ్మత్తులకు గురైన తాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తులకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో నీటి ఇబ్బందులు తలెత్తాయి. ఎట్టకేలకు తెదేపా నాయకులు స్పందించి మరమ్మత్తులు చేయడంతో తాగునీటి వెతలు తీరాయని ఆ కాలనీవాసులు ఆనందం వ్యక్త పరిచారు.

## నేడు కసింకోట శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

కసింకోట, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



మండల కేంద్రమైన కసింకోటలో నేడు అనగా శనివారం శ్రీ గౌరీ పరమేశ్వర మహోత్సవం ఘనంగా నిర్వహించుటకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామములో భారీ ఎత్తున విద్యుత్తు లైటింగ్, విద్యుత్ కటౌట్లు, అలంకరణ ఏర్పడు చేశారు. ఉత్సవంలో స్టేజ్ ప్రోగ్రామ్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు ఏర్పాట్లు చేశారు.

## చిత్రలేఖన పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా చోడవరం చిత్రకళా నిలయంలో జరిగిన జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. 30 మంది పాల్గొనగా ఆరుగురు బంగారు పతకాలను సాధించారు. ఈసందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల హెచ్ఎంఎ ఆదిలక్ష్మి అధ్యక్షతన పాఠశాల చైర్మన్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం జరిగింది. విద్యార్థులను ఉద్దేశించి హెచ్ ఎం మాట్లాడుతూ చిత్రలేఖనంలో విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో బంగారు పతకాలను గెలుపొందడం అభినందనీయమన్నారు. చిత్రలేఖనంలో తర్ఫీదు ఇచ్చిన డ్రాయింగ్ ఉపాధ్యాయులకు బెస్ట్ ఆర్ట్ టీచర్ అవార్డ్ రావడం అభినందనీయమని అన్నారు. చైర్మన్ మరిచెర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజానికి తెలిసే విధంగా చిత్రించే చిత్రకారులు మీలో ఉన్నారని అన్నారు. అనంతరం చిత్రలేఖన ఉపాధ్యాయుడు మిరియాల కొండబాబుని శాలువాను కప్పి సన్మానించారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు యం హిమశ్రీ వి.బాలనాగదుర్గ, ఎస్ కె అర్మాన్ వలి, ఎస్ కె ఇస్హాక్, ఎల్ కార్తికేయ, ఎం సాయి చంద్రికకు బంగారు పతకాలను ప్రశంస పత్రాలను బహుకరించారు. సి హెచ్ శివకృష్ణ, మిరియాల కొండబాబు ఉదయ్, సింహాచలం, జయలక్ష్మి, పార్వతీ, షెహనాజ్, శాంతి ప్రియ, రేష్మ, జె రామస్వామి, పాల్ బాబు, హరినాథ్, ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్‌కు ఏ.ఎస్.ఐగా పదోన్నతి



రాజవొమ్మంగి, ఫిబ్రవరి 13,, ప్రభాతవార్త

రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కె. రంగబాబుకు ఏ. ఎస్. ఐ గా ప్రమోషన్ వచ్చిందని సి. ఐ. గౌరీశంకర్ తెలిపారు. ఈసందర్భంగా రంగబాబు ప్రభాతవార్త తో మాట్లాడుతూ 1991 సం. రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ కు కానిస్టేబుల్ గా విధుల్లోకి చేరానని అన్నారు. రైల్వే, స్పెషల్ బ్రాంచ్ పోలీసు, ఎలక్ట్రికల్ విజిలెన్స్ విభాగాల్లో పనిచేసి మరలా రాజవొమ్మంగి పోలీస్ స్టేషన్ కు గత ఏడాది ఫిబ్రవరి నెలలో హెడ్ కానిస్టేబుల్ గా వచ్చినట్లు వివరించారు. ఈనెలలో ఏ. ఎస్. ఐ గా ప్రమోషన్ వచ్చిందని రంగబాబు అన్నారు. 1990 బ్యాచ్ కు చెందిన తను ఇప్పటివరకూ 150 రివార్డులు, 2 ప్రశంసాపత్రాలను పొందినట్లు వివరించారు.

## పశుగ్రాసం కొరతతో బక్క చిక్కుతున్న పశు సంపద..ఆందోళనలో గిరి రైతులు



దుంబ్రిగూడ, ఫిబ్రవరి 13,ప్రభాతవార్త

మన్యంలో పశుగ్రాసం పూర్తిగా కొరత ఏర్పడడంతో బక్క చిక్కిపోతున్న పశు సంపద వ్యవసాయ గిరి రైతులు ఆందోళన చెందుతున్న పరిస్థితి ఏర్పడింది అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. పశుసంపదను దైవముల భావిస్తున్న రైతులకు వ్యవసాయ పరంగా తోడ్పాటు నిచ్చే మూగజీవులకు సరైన పశుగ్రాసం దొరక్క వీధుల్లో దొరికే పాడైపోయిన అన్నం పేపర్లు కవర్లు ప్లాస్టిక్ వంటి వస్తువులను ఆశ్రయిస్తూ మూగజీవుల ఆరోగ్యాలకు కుంటుపడుతుండడంతో అనారోగ్యాల భారిన పడి మూగజీవులు మృతి చెందు తుంటే రైతులు వ్యవసాయానికి వినియోగించకుండా ఎంతోకొంతకు విక్రయాలు సాగిస్తుంటారు. పంట సాగుకు దుక్కి నుండి నూర్పుల వరకు రైతుకు సహకారనీ అందించే పశుసంపద అందుబాటులో ఉండక పోవడంతో ఆస్థానంలో దుక్కి నుండి నూర్పులు వరకు యంత్రాలను రైతులు వినియోగిస్తున్న పరిస్థితి ఏర్పడిం దని గిరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో పశు సంపద కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంటదన్న ఆందోళనలో రైతులు పడ్డారు. అధికార యంత్రాంగం మూగ జీవులకు అందించే పశుగ్రాసం కొరత నివారణకై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని వ్యవసాయ గిరి రైతులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

## అడ్డతీగల గిరిజన సంక్షేమ పాఠశాలను తనిఖీ చేసిన రుగ్మందయ్య



అడ్డతీగల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మండల స్పెషల్ ఆఫీసర్ మరియు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుగ్మందయ్య శుక్రవారం అడ్డతీగల మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శిం చారు. ఈ పర్యటనలో భాగంగా పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షా కేంద్రాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. పరీక్షకు 14 మంది విద్యార్థులకు గాను 14 మంది హాజరు కావడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రాబోయే పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న హాస్టల్ భవన పనులను పరిశీలించిన ఆయన, నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని తాపీ మేస్త్రీలకు, కాంట్రాక్టర్లకు సూచించారు. నాడు-నేడు పథకంలో భాగంగా పదో తరగతి గది నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంపై డిప్యూటీ డైరెక్టర్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తరగతి గదులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన, పనులు ఎందుకు ఆగిపోయాయనే విషయంపై మండల విద్యాశాఖ అధికారి ఎం.ఈ.ఓ. పి. శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గతంలో ఈ పనులు చేపట్టిన ప్రధానోపాధ్యాయులను, ప్రస్తుత కమిటీ సభ్యులను విచారించేందుకు త్వరలోనే ప్రత్యేకంగా ఎంక్వయిరీ నిర్వహిస్తానని, ఇందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వార్డెన్ ఎస్.కృష్ణ, ఉపాధ్యాయులు సుందర్‌రావు, రేవతి, అశోక్, పాల్గొన్నారు.


## జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవ సన్నాహక సమావేశం



అడ్డతీగల, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు మండల ప్రత్యేకాధికారి, రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. రుక్మందయ అధ్యక్షతన అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఫిబ్రవరి 17న నిర్వహించ తలపెట్టిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలలో నులిపురుగుల ఇన్ఫెక్షన్‌ను నివారించడం ద్వారా వారిలో రక్తహీనత మరియు పోషకాహార లోపాలను అరికట్టి, ఆరోగ్యకరమైన శారీరక, మానసిక వికాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ప్రత్యేకాధికారి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 17న మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. గణాంకాల ప్రకారం.. ఎల్లవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్‌సి పరిధిలోని 49 అంగన్‌వాడీ కేంద్రాలు, 52 పాఠశాలల్లో కలిపి మొత్తం 5,950 మంది పిల్లలకు, అలాగే దుప్పులపాలెం పిహెచ్‌సి పరిధిలోని 42 అంగన్‌వాడీ కేంద్రాలు, 44 పాఠశాలల్లో కలిపి మొత్తం 3,328 మంది పిల్లలకు, అనగా మండల వ్యాప్తంగా మొత్తం 9,278 మంది పిల్లలకు ఈ మాత్రలను వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ 17న ఏవైనా కారణాల వల్ల మాత్రలు వేయించుకోలేకపోయిన పిల్లల కోసం తిరిగి ఫిబ్రవరి 24న ప్రత్యేకంగా పంపిణీ కార్యక్రమం నిర్వ హించబడుతుందని అధికారులు తెలిపారు. అడ్డతీగల ఎంపిడిఓ ఏవివి కుమార్, తహశీల్దార్ ఎన్. దొరకయ్య, మండల విద్యా శాఖాధికారులు ఎంఈఓ-1 కె. రమేష్, ఎంఈఓ-2 పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే దుప్పులపాలెం వైద్యాధికారి ఎం.శివప్రసాద్ రెడ్డి, ఎల్లవరం వైద్యాధికారి వై.దేవి ప్రియాంక, ఐసిడిఎస్ సూపర్వైజర్ పి.అరుణాలత, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొని కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



రంపచోడవరం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

పోలవరం జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతముగా పూర్తిచేయాలని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ కార్యాలయ సమావేశపు హాల్లో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో అదేవిధంగా ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ జాయింట్ కలెక్టర్ అభివృద్ధి పనులు వేగవంతముగా పూర్తిచేసే విధంగా సమావేశం నిర్వహించారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ వివిధ శాఖలకు సంబంధించిన ప్రారంభించిన అభివృద్ధి పనులు వేగవంతముగా చేసి ప్రాఫారమ్‌లో పొందుపరిచి అప్లోడ్ చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రారంభించిన పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నది ఎప్పటికల్లా పూర్తి చేయుచున్నది అదేవిధంగా సమస్యల ఏమైనా ఉన్నయెడల తెలియజేయాలని ఆయన అన్నారు. జిల్లాలోని పంచాయతీలకు సంబంధించిన డంపు యార్డులు ఎక్కడ ఎక్కడ ఏర్పాటు చేసింది అదేవిధంగా ఇంకా ఏమి చేయవలసి యున్నది ఇంకా స్థల సమస్యలు ఏమైనా ఉన్నాదేలా తెలియజేయాలని ఎంపీడీవో లను ఆయన ఆదేశించారు. ఏపీవో జనరల్ డీవీన్వి రమణ, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడిఏలు సావిత్రి, రామ మోహన్ రావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ, శ్రీనివాసరావు, సుబ్బయ్య, పీహెచ్ఓ దేవదానం పిఏఓ ఎల్. రాంబాబు, డాక్టర్ శ్వేత, సిడిపిఓ క్రాంతి కుమారి, డిఈలు వెంకటరమణ,మల్లికార్జునరావు, భవాని,సుబ్బారావు, శివ,రమేష్, పీఎంయు అధికారిని చంద్రకళ పాల్గొన్నారు.

## ఘనంగా పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాలు



పాడేరు,ఫిబ్రవరి13,ప్రభాతవార్త

పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం అయ్యి ఈ సంవత్సరంతొ 50 సంవత్సరాలు అయిన సందర్భంగా కళాశాల లో స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శరగడం శ్రీనివాస్ రావ్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ముంచింగిపుట్టు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దొర, పాడేరు హై స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ హాజరయ్యారు. వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి మరియు కాలేజ్ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలి



మారేడుమిల్లి,, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ఏజెన్సీలోని గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం,సంపూర్ణత అభియన్ 2.0 ప్రోగ్రాం ను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ,రాష్ట్ర,ఎస్టీ కమిషన్ మెంబర్ గొర్లె సునీత, ఎంపీపీ సార్ల లత, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయుచున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందే విధంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిం చడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ఎస్పిరేషనల్ బ్లాక్ ప్రోగ్రాం సంపూర్ణత అభియాన్ 2.0 ద్వారా ఆరు రకాల సేవలు ఆరోగ్య, పోషణ, విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ ప్రోగ్రాం ఒక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన అన్నారు. జనవరి 28 నుండి ఏప్రిల్ 14 వరకు మూడు నెలల పాటు ఈ ఎస్పీరేషనల్ బ్లాక్ సంపూర్ణత అభియాన్ 2.0 కొనసాగుతుందని ఆయన అన్నారు. ఐసిడిఎస్ ద్వారా నాలుగు ఇండికేటర్లు ఉన్నాయి ఆరు నెలల నుంచి ఆరు సంవత్సరాల వయసులో ఉన్న పిల్లల మానసిక శారీరక ఎదుగుదల కోసం అదేవిధంగా బాలింతలకు పౌష్టికఆహారం ఎప్పటికప్పుడు అందించాలని ఆయన అన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా పశువులన్న రైతులకు పశువులకు సంబంధించిన వ్యాధికి సరిపడ టీకాలు తప్పకుండా అందించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సార్ల లత, జడ్పిటిసి గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, ఎంపీడీవో రవి కిషోర్, ఎస్పిరేషినల్ అధికారి లవన్ రెడ్డి, సర్పంచులు, ఎంపిటీసీలు, వీరబాబు, పాల్గొన్నారు.

## వినతుల పరిష్కారం వేగవంతం చేయాలి

**సమస్యల పరిష్కారానికి అధికారుల చొరవ చూపించండి -పిజిఆర్ఎస్‌కు 109 అర్జీలు**

**-రెవెన్యూ క్లినిక్‌కు 16 అర్జీలు : జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్**

పాడేరు,ఫిబ్రవరి13, ప్రభాతవార్త



సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 109, రెవెన్యూ క్లినిక్‌కు 16 వినతులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ పాడేరు ఐటిడిఏ పిఓ తిరుమాని శ్రీ పూజ, అసిస్టెంట్ కలెక్టర్ కె సాహిత్, ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి పి.అంబేద్కర్, పాడేరు ఇంచార్జ్ ఆర్డీవో ఎమ్‌వి ఎస్ లోకేశ్వరరావు సంయుక్తంగా వివిధ మండలాల, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరితగతన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యలను తక్షణమే పరిష్కరించుటకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నందు ప్రత్యేకంగా రెవెన్యూ క్లినిక్ ని నిర్వహించడం జరుగుతుందని మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తాసిల్దారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు,సర్వేయర్లు, విలేజి రెవెన్యూ ఆఫీసర్లు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులను స్వీకరించడం, పరిష్కరించడం జరుగుతుందని కొన్ని రకాల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించడం, పరిష్కరం కానీ ఫిర్యాదులను ఎంత గడువు గడువులోగా పరిష్కరిస్తారో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలి, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జివో విడాట్ ఇన్ వెబ్సైట్‌ను సంప్రదించవచ్చన్నారు. గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పిబికె పరిమళ, పాడేరు ఇంచార్జ్ డిఎఫ్ వో కె.ఉమామహేశ్వరి, జిల్లా విద్యాశాఖ అధికారి రామకృష్ణ రావు, భూగర్భ జల వనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి. శ్రీనివాస రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ బి ఎస్ నంద్, జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి . కృష్ణ మూర్తి నాయక్ , జిల్లా క్రీడా అభివృద్ధి శాఖ అధికారి జగన్మోహన్ రావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఆర్.వి. రమణా రావు, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు కార్యాలయాల నోడల్ ఆఫీసర్ పి ఎస్ కుమార్, డిపివో కె.పి. చంద్ర శేఖర్, జిల్లా ఖజానా శాఖాధికారి ప్రసాద్ బాబు , జిల్లా ఉద్యాన శాఖ అధికారి బాలకర్ణ, డివిజనల్ డెవలప్మెంట్ అధికారి ఎ .జయప్రకాష్, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి ఝాన్సీ రామ్ పడాల్, పాడేరు ఐటిడిఏ ఏవో హేమలత పలువురు తాహసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరి జిల్లా జిఓ03 పునరుద్ధరించాలని.. జోన్ 01లో మాత్రమే కొనసాగించాలి



పాడేరు,ఫిబ్రవరి13,ప్రభాతవార్త

అల్లూరి జిల్లా జిఓ03 పునరుద్ధరించాలని..,జోన్ 01 లో మాత్రమే కొనసాగించాలని కోరుతూ పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీ పూజ వినతి పత్రం అందజేసినట్టు అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు పేర్కొన్నారు. మా సమస్యలపై ప్రభుత్వనికి లేఖ రాయమని కోరడం పీ ఓ ను కోరారు. జి ఓ నెంబర్ 03 సుప్రీంకోర్టు రద్దు చేయటం 2025 డీఎస్సీ 4000 మంది గిరిజన నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోయారనీ రద్దు చేసిన జి ఓ 03 స్థానంలో గిరిజన నిరుద్యోగుల ప్రయోజనాల రక్షణ కొరకు నూతన ఉద్యోగ నియామక చట్టంన్నీ తీసుకురావాలని, ఇందుకోసం తక్షణమే గిరిజన సలహా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉద్యోగ నియామక చట్టం రూపకల్పన చేసి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలనికోరామన్నారు. గతంలో విశాఖపట్నం జిల్లాలో ఉన్నపాటించి నుండి మా ప్రాంతం జోన్ 01 పరిధి లో ఉండేది.అయితే, ఇటీవల కాలంలో అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 2 లో కీ మార్చడం జరిగింది. దీనివల్ల గిరిజన ఉద్యోగుల పదోన్నతులు, ఆర్థిక మరియు సామాజిక ప్రయోజనాలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతుంది. బాబట్టి ప్రభుత్వం తక్షణమే అల్లూరి సీతారామరాజు జిల్లా జోన్ 01 తీసుకురావాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కి లేఖ రాయాలని కోరడం జరిగిందనీ ఈశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోడా చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి కూడా రాంబాబు, జాయింట్ సెక్రెటరీ కూడ ఈశ్వరరావు. సెక్రెటరీ చప్పాలి యువరాజు, వైస్ ప్రెసిడెంట్ పీ. సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయిలో విధిగా పిజిఆర్ఎస్ నిర్వహించాలి..

**మండల స్థాయి అధికారులకు ఆదేశాలు: జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్**

పాడేరు,ఫిబ్రవరి13, ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ఇందులో భాగంగా ప్రతి సోమవారం మండల స్థాయిలో విధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లా,మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. తప్పనిసరిగా మండల స్థాయి అధికారులు, మండల తాసిల్దార్, ఎంపీడీవో, డిఆర్డిఏ, వ్యవసాయ, వైద్యారోగ పోలీస్ తదితర శాఖల సమన్వయంతో అందరూ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో పిజిఆర్ఎస్ నిర్వహించాలని, మండల స్థాయి అధికారులు ప్రతి ఒక్కరు అందుబాటులో ఉండాలని, పిజిఆర్ఎస్ లో హాజరైన మండల స్థాయి అధికారుల ప్రతి ఒక్కరి పై పిజిఆర్ఎస్‌ను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వారిపై పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గ్రామస్థాయి నుండి మండల స్థాయి వరకు అర్జీదారుల అర్జీలను మండల్ స్థాయి లోనే త్వరితగతిన పరిష్కారం జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజల నుండి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిర్ణీత కాలపరిమితిలోపు పరిష్కరించాలి. నాణ్యమైన సేవలు కేవలం అర్జీలను స్వీకరించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని తెలిపారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను మాత్రమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దూర ప్రాంతాల నుండి జిల్లా కేంద్రానికి రాలేని సామాన్య ప్రజలకు స్థానికంగానే న్యాయం జరిగేలా చూడటమే ఈ పిజిఆర్ఎస్ కార్యక్రమం ఉద్దేశమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## రాధాకృష్ణ మాస్టర్ మరణం చాలా బాధాకరం

**చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన టిడిపి డివిజన్ నాయకులు పాండురంగస్వామి**



పాడేరు,ఫిబ్రవరి13,ప్రభాతవార్త:

అల్లూరి జిల్లా కేంద్రంలో పాడేరు రాష్ట్ర జిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో రాధాకృష్ణ మాస్టారు కు ఘన నివాళులు అర్పించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎంతోమందిని నైపుణ్యం అందించి గొప్ప స్థాయిలో తీర్చిదిద్దిన రాధాకృష్ణ మరణం చాలా బాధాకరమని టిడిపి డివిజన్ నాయకులు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు.ఈ సందర్భంగా పాడేరు రాష్ట్ర జిసిసి చైర్మన్ కార్యాలయంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో నిరక్ష రాసిత ఎక్కువగా ఉన్నప్పుడు అక్షరాస్యత నేర్పిన మహనీయుడు రాధాకృష్ణ మాస్టారు అని కొనియాడారు. అనేకమందికి సలహా సూచనలు ఇస్తూ అందరితో ఆప్యాయతగా ఉంటూ స్వర్గీయ కిడారి సర్వేశ్వరరావు ఎమ్మెల్సీగా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పిఎ గా పనిచేస్తూ అనేక సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తి రాధాకృష్ణ అని అటువంటి మాస్టారు ఇప్పుడు లేకపోవడం చాలా బాధాకరమన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నానన్నారు. ఆ కుటుంబానికి ప్రగాడ సంతాప సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పెనుమాల లింగమూర్తి, కోటి బాబు, రుక్మన్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.




## మత్స్యగుండం శివరాత్రి జాతర మహోత్సవాలకు పటిష్ట చర్యలు



హుకుంపేట,ఫిబ్రవరి 11ప్రభాతవార్త

హుకుంపేట మండలం, మఠం గ్రామంలో వెలసిన మత్స్యగుండం శైవ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా, ఎటువంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఇన్ఛార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీ పూజ అన్నారు.ఈ ఉత్సవం నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కలిసి పని చేయాలని ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించి, ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్,ప్రజా ప్రతినిధులు, పాడేరు ఆర్డిఒ, డీఎల్పిఒ వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో ఆమె జాతర ఏర్పాట్లపై కీలక అంశాలపై చర్చలు జరిపారు. ఈ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతఈ మహోత్సవానికి భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, స్త్రీల స్నాన గదులు ఏర్పాటు, మరియు రోడ్డు మరమ్మతులు, వినియోగం, విషయంలో రాజీ పడకూడదని ఆయా శాఖలను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎక్సైజ్, ఫైర్, విద్యుత్, రోడ్లు మరియు భవనాల శాఖలు పరస్పర సహకారంతో జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి ఆర్డిఒ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఏం వి ఎస్ లోకేశ్వరరావు, డీఎల్పిఒ, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు నోడల్ అధికారి పి. ఎస్. కుమార్, హుకుంపేట సీఐ, సన్యాసినాయుడు, ఎస్ఐ , దుర్గాప్రసాద్ తహసీల్దార్, శ్రీనివాసరావు ,ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ , ఎక్సైజ్, ఫైర్, ఆర్టిసి, అధికారులు ఆలయ కమిటీసభ్యులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## పి.ఎం జన్మన్ గృహాల బకాయిలు తక్షణమే చెల్లించాలి ..



గూడెం కొత్త వీధి ఫిబ్రవరి 13 (ప్రభాతవార

గూడెం కొత్త వీధి మండలంలో 16 పంచాయతీలకు చెందిన పీఎం జన్మన్ గ్రామీణ హౌసింగ్ లబ్ధిదారులతో గూడెం చైతన్య స్రవంతి నుండి హౌసింగ్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సి.పి.ఎం పార్టీ మండల కార్యదర్శి గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు మాట్లాడుతూ పి.ఎం జన్మన్ గ్రామీణ ఇళ్లకు చెల్లించవలసిన బకాయి బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే పి.ఎం జన్మన్ గ్రామీణ ఇళ్లకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం సీ.ఎం జగన్ ఇళ్లకు లక్ష రూపాయలు,గ్రామీణ ఇల్లుకు 75 వేల రూపాయలు ఇస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం జరిగిందని. అయితే ఈ రాష్ట్రంలో అన్ని జిల్లాలకు నిధులు విడుదల చేశారు కానీ అల్లూరి జిల్లా కు నిధులు ఎందుకు విడుదల చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న అధికారులు, కూటమి నాయకులు ఈ విషయంపై మాట్లాడకపోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. అందుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు బిల్లులు తక్షణమే చెల్లించాలని, లేనిపక్షంలో ఈ నెల 27వ తేదీన చలో ఐటీడీఏ కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. కావున లబ్ధిదారులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ మండల నాయకులు కుర్ర బాలయ్య ,ఎమ్మెల్యే పరమేశ్వరరావు, ఎమ్మెల్యే కేశవరావు, కాంగ్రెస్ నాయకులు అల్లంగి రాజు లబ్ధిదారులు కల్లో బాబురావు, గిన్నెల రమేష్ ,ఎస్ కరయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## అధికారులు ఏకపక్ష నిర్ణయాల వలన గిరిజన విద్య తిరోగమనం

**డిప్యూటీ వార్డెన్లు నియామకాలపై తీవ్రంగా వ్యతిరేకం : ఏపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం**

పాడేరు,ఫిబ్రవరి13, ప్రభాతవార్త:



గిరిజన సంక్షేమ విద్యా శాఖలో విద్యాపరమైన విధానపరమైన నిర్ణయాలు తీసుకొనేటప్పుడు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘంను భాగస్వామ్యం చేయకుండా నియంతృత్వ ధోరణిలో చేస్తున్న ఏకపక్ష నిర్ణయాల వలన గిరిజన విద్య తిరోగమణం చెందుతున్నాయనీ దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎపి గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం అల్లూరి జిల్లా అధ్యక్షులు కోడా చిట్టిబాబు,ప్రధాన కార్యదర్శి కూడా రాంబాబు పేర్కొన్నారు. మెగా డిఎస్సీ 2025 ఉపాధ్యాయులకు డిప్యూటీ వార్డెన్ల విధుల వలన సర్వీసుకు రక్షణ లేదనీ వారికి సర్వీసు రెగ్యూలరైజేషన్ రెండు సంవత్సరాల కాలం కూడా పూర్తి కానందున వారిని ఏవిధంగా డిప్యూటీ వార్డెన్లుగా నియమిస్తున్నారో అధికారులు సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేసారు. 2025 డిఎస్సీలో ఎంపిక కాబడిన ఎస్.జి.టి.లను బలవంతంగా వార్డెన్ బాధ్యతలను నిర్వహించాలని ఒత్తిడి చేసి వార్డెన్లుగా నియమించడాన్ని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. మా హక్కులకు భంగం కలిగించే అధికారుల నిర్ణయాలను వెనుకకు తీసుకొవాలని లేని యెడల దశల వారీగా ఆందోళనలు చేపట్టడానికి నిర్ణయించాలన్నారు.ఈ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 24 వ తేదీన ధర్నాకు పిలుపు నిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు చిట్టిబాబు,రాంబాబు తెలియజేశారు.

## అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా, ఆర్చరీలో పథకాలు పొందిన గ్రామ వాసులకు ఘన సన్మానం



హుకుంపేట, ఫిబ్రవరి13, ప్రభాతవార్త

మండలం శోభకోట పంచాయతీ శోభకోట గ్రామం నుండి ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ నుండి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్‌గా శోభవల్లభ నాయుడు మరియు 2025 సంవత్సరం నవంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడాల్లో అరుణాచలప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాలలో రజత పథకాలు గెలుపొందిన చిట్టపులి. మోహిత్ కుమార్ మరియు వంతల. లలిత్ సాయి తేజలను గ్రామస్తులు అభినందనల సభ ద్వారా ఘన సన్మానించారు. ప్రమోషన్ మరియు పథకాలు పొందిన గ్రామ వాసులను ఉద్దేశించి పాల్గొనిన ఉద్యోగ ఉపాధ్యాయ మరియు గ్రామ సర్పంచ్, పెద్దలు మాట్లాడుతూ, గ్రామం నుంచి ఉన్నత శిఖరాలను ఆవరోదించిన సన్మాన గ్రహీతలకు ప్రత్యేకమైన అభినందనలుతెలిపారు.గ్రామం నుండి ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న లకే.వెంకటరమణ దొర పురషకారి.స్వామి నాయుడు, రమణమూర్తి నాయుడు, గడ్డాల.మత్యకొండబాబు, వంతల.విజయశాంతి, సంతారి శాంతకుమారి, చిట్టపులి .చంద్రకళ (విఆర్ఓ) ఆర్.ఐగా శోభ చిన్న వెంకటరమణ గ్రామ సర్పంచ్ పలాసి. శశిభూషణం నాయుడు మరియు గ్రామస్తులు గడ్డాల.చిట్టి నాయుడు పలాసి.పోతురాజు నాయుడు గడ్డాల. చిన్నబాలం నాయుడు లకే.మహేశ్వరరావు శోభ . సూర్య ప్రకాష్ నాయుడు పురషకారి. చిరంజీవి నాయుడు అంగనైని.దేవినాయుడు, వంతల. గణేష్, గండేరు.శ్రీను మరియు కుటుంబ సభ్యులు తదితరులు, గ్రామస్తులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు ఎంపీడీవో ప్రేమ్ సాగర్

దుంబ్రిగూడ: ఫిబ్రవరి: 13 ప్రభాతవార్త



ప్రస్తుత వేసవి తాపానికి తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేవిధంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని స్థానిక ఎంపీడీవో ప్రేమ్సాగర్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో తాగునీటి బోర్లు మరమ్మత్తుల గురి అయితే తక్షణమే సమాచారం అందించి తాగునీటి సమస్యను పరిష్కరించుకో వాలని ఆయన కోరారు. తాగునీటి సమస్య ఏర్పడితే లిఖితపూర్వకంగా తెలపాలని, ఒకవేళ అవకాశం లేకపోతే 630 367 6093 నెంబర్ ను సంప్రదించగలరని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో విశ్వనాథం, ఆర్డబ్ల్యూఎస్ అధికారి మహేష్ మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రింతాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా టి.వి ప్రసాద్

గూడెం కొత్తవీధి,ఫిబ్రవరి 13 (ప్రభాతవార్త)



మండలంలోని రింతాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నూతన ప్రధానోపాధ్యాయులుగా టీ.వీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మన్యం జిల్లా పార్వతీపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వచ్చారన్నారు. నూతన ప్రధానోపాధ్యాయులకు పాఠశాల సిబ్బందితో పాటు జిల్లా పి.ఆర్.టి.యు అధ్యక్షులు యు.వి గిరి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

14- 2 pg 9.qxd:14- 2 pg 9.qxd 1/1/02 6:40 AM Page 1



# ప్రేమ ఎంత మధురమో!

ప్రేమ ఉన్న చోట ద్వేషానికి స్థానం ఉండదు. ప్రేమ సమాజాన్ని కలుపుతుంది. మనుషుల మధ్య అనుబంధాన్ని పెంచుతుంది. అందుకే పాశ్చాత్య సంప్రదాయంలో ప్రేమికుల రోజొకటి పుట్టుకొచ్చింది. ప్రేమసాంగత్యంలో ఉన్న మధురిమల కారణంగా భారతీయులు కూడా ఈ రోజును స్వచ్ఛమైన ప్రేమభావనతో జరుపుకుంటుంటారు. వాలెంటైన్స్ డేను ఏటా ఫిబ్రవరి 14న జరుపుకుంటారు. ఇది ప్రేమ, ఆప్యాయత, స్నేహం, అనురాగాన్ని వ్యక్తపరిచే ప్రత్యేక రోజు. వాలెంటైన్స్ డేకు మూలం ప్రాచీన రోమన్ కాలానికి చెందింది. 'సెయింట్ వాలెంటైన్' అనే క్రైస్తవ పూజారి ప్రేమికుల పెళ్లిళ్లు రహస్యంగా నిర్వహించేవారని చెబుతారు.

అప్పటి రాజు క్లాడియస్-II యువకులు పెళ్లి చేసుకుంటే సైన్యంలో బలహీనతలకు దారి తీస్తుందని నమ్మి పెళ్లిళ్లను నిషేధించాడు. అయితే వాలెంటైన్ ఆ ఆజ్ఞను వ్యతిరేకంగా ప్రేమను గౌరవిస్తూ పెళ్లిళ్లు జరిపించాడు. దీనికి శిక్షగా ఆయనను ఫిబ్రవరి 14న మరణదండన విధించారు. ఆయన ఆ ప్రేమను, త్యాగాన్ని గౌరవిస్తూ ఫిబ్రవరి 14ను వాలెంటైన్స్ డేగా జరుపుకుంటారు. ఈ రోజును కేవలం ప్రేమికులే కాదు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కూడా జరుపుకోవచ్చు. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో విస్తృతంగా జరుపుకుంటారు.




జపాన్‌లో మహిళలు పురుషులకు చాక్లెట్లు ఇస్తారు. కొన్ని దేశాల్లో ఈ రోజును స్నేహ దినోత్సవంలా జరుపుకుంటారు. ప్రేమ అనేది ఇద్దరి మధ్య ఉండే భావన మాత్రమే కాదు. ప్రేమ అంటే గౌరవం, విశ్వాసం, సహనం, అంకితభావం. తల్లిదండ్రుల ప్రేమ, స్నేహితుల స్నేహం, గురువుల మార్గదర్శకత్వం.. ఇవన్నీ మన జీవితాన్ని అందంగా మార్చే ప్రేమ రూపాలే. ఈ రోజున గులాబీలు, కార్డులు, చాక్లెట్లు ఇచ్చి ప్రేమను వ్యక్తపరుస్తాం. కానీ అసలైన ప్రేమ అనేది మాటల్లో కాకుండా మన ప్రవర్తనలో, మన హృదయంలో కనిపించాలి. మనో విజ్ఞాన పరంగా చూస్తే ప్రేమ వ్యక్తీకరణ వ్యక్తుల భావోద్వేగ ఆరోగ్యానికి సహకరిస్తుంది.

కృతజ్ఞత, ఆప్యాయత, పరస్పర గౌరవం లాంటి భావాలు సంబంధాలను బలపరుస్తాయి. వాలంటైన్స్ డే సందర్భంలో బహుమతుల కంటే భావోద్వేగ అనుబంధానికి ప్రాధాన్యతనివ్వడం అవసరం. ఒక లేఖ, ఒక జ్ఞాపకం.. మానవ సంబంధాల్లో దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపగల భావనలు. సమాజ శాస్త్రవేత్తలు కూడా వ్యక్తిగత సంబంధాలు బలంగా ఉన్న సమాజాలు సామూహికంగా మరింత స్థిరంగా ఉంటాయని సూచిస్తున్నారు.

**వాలెంటైన్స్ వీక్‌ను ఈ విధంగా విభజించి వేడుకలు జరుపుకోవడం కద్దు.** ఫిబ్రవరి 7 నుండి 14 వరకు ప్రత్యేక రోజులు ఉంటాయి. ఫిబ్రవరి 7- రోజ్ డే, ఫిబ్రవరి 8- ప్రపోజ్ డే, ఫిబ్రవరి 9- చాక్లెట్ డే, ఫిబ్రవరి 10- టెడ్డీ డే, ఫిబ్రవరి 11- ప్రామిస్ డే, ఫిబ్రవరి 12- హగ్ డే, ఫిబ్రవరి 13- కిస్ డే,ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే.




ఈ వాలెంటైన్స్ డే రోజున మనం ఒక నిర్ణయం తీసుకుందాం. సర్వమానవాళితో ప్రేమను పంచుకుందాం, పరస్పరం గౌరవించుకుందాం, మన కుటుంబం, స్నేహితులతో సంతోషంగా జీవిద్దాం.


# బరువు తగ్గాలంటే ఈ జ్యూస్‌లు తాగండి!



బరువు తగ్గాలనుకుంటున్నారా? అయితే జ్యూస్‌లను తీసుకోండి. జ్యూస్‌లను తీసుకోవడం ద్వారా ఆకలి ఉండదని.. తద్వారా ఆహారం మితంగా తీసుకునేందుకు వీలుంటుందని.. దీంతో ఒబిసిటీని దూరం చేసుకోవచ్చునని ఆరోగ్య నిపుణులు అంటున్నారు.

**లెమన్ జ్యూస్:**
లెమన్ జ్యూస్‌లో చిటికెడు ఉప్పు, తేనె చేర్చి రోజూ ఉదయం పరగడుపున తీసుకున్నట్లైతే... చెడు కొలెస్ట్రాల్‌ను దూరం చేసుకోవచ్చు.

**టమోటో జ్యూస్:**
ఏడు రోజుల్లో బరువు తగ్గాలనుకుంటే 3 టమోటోలను బాగా ఉడికించి.. మిక్సీలో గ్రైండ్ చేసి బెల్లం చేర్చి మూడు పూటలా తీసుకుంటే బరువు తగ్గుతారు.



**అవకోడా జ్యూస్:**
అవకోడాను గ్రైండ్ చేసి.. తేనె కలుపుకుని తాగితే పొట్టను తగ్గించుకోవచ్చు. ఇందులోని గుడ్ కొలెస్ట్రాల్.. శరీరంలోకి కెలోరీల శాతాన్ని బర్న్ చేస్తుంది.

**గ్రేప్ జ్యూస్:**
గ్రేప్ జ్యూస్‌లోని ప్రోటీన్లు, గుడ్ కొలెస్ట్రాల్ ఉండటంతో ఈ జ్యూస్ ద్వారా బరువు తగ్గుతారు.

**జామ జ్యూస్:**
జామకాయలో విటమిన్ సి అధికంగా ఉండటం ద్వారా వారానికి రెండు సార్లు జామపండుతో చేసిన జ్యూస్ తాగాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**ఆరెంజ్ జ్యూస్:**
ఆరెంజ్ జ్యూస్ తీసుకుంటే తప్పకుండా బరువు తగ్గుతారు. గోరువెచ్చని నీటిలో ఆరెంజ్ జ్యూస్‌లో తేనె కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

**అనాసపండు జ్యూస్:**
అనాస జ్యూస్‌తో ఆకలి తగ్గిపోతుందని.. అందుచేత సులభంగా బరువు తగ్గవచ్చునని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



# చిన్నచూపు తగదు

జీవితంలో మనం మనుషులతో బాటుగా జంతుజాలాదులతోనూ కలిసి జీవిస్తున్నాం. ఎన్నో ప్రాణులు ఎంతో ప్రత్యేకంగా వాటి బతుకును సాగిస్తున్నాయి. వాటిల్లో మనం చీమను గమనిస్తే అది మనకు ఎన్నో వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్పుతుంది. చీమలు చాలా చిన్న జీవులు. చీమల నుండి మనం టీమ్ వర్క్‌తో బాటుగా, ఒంటరిగా ఎలా జీవించాలో నేర్పుతాయి. ఒక నాయకుడిగా ఎలా ప్రవర్తించాలో చెబుతాయి. చీమలు తమ లక్ష్యంగా ఆహారాన్ని సంపాదించడం అనుకుంటే, అవి అన్నీ కలసి తమ ప్రయాణాన్ని కొనసాగిస్తాయి. వాటి లక్ష్యం ఆహారాన్ని సేకరించడం. ఇక్కడ ఏ చీమా కూడా ఆ ఆహారం తన కోసం అనుకోదు. అందరికోసం అనుకుంటుంది.



అవి అన్నీకలసి తమ బృందం కోసం సేకరిస్తాయి. ఈ ప్రయాణంలో ఒక్క చీమ కూడా సమయాన్ని ఏమాత్రం వృథా చేయవు. ఒకదాని వెనుక ఒకటి ఆగకుండా ప్రయాణిస్తూనే వుంటాయి. చలికాలంలో అవి చీమలపుట్ట నుండి వెలుపలికి రాలేవు. ఆహారం కోసం అన్వేషణ సాగించలేవు. కాబట్టి వేసవి కాలంలోనే చలికాలానికి కావాల్సిన ఆహారాన్ని సేకరించి పెట్టుకుంటాయి. అన్నీ కలసి ఆ మొత్తం ఆహారాన్ని ఒకచోట దాచుకుంటాయి. తినేటప్పుడు కూడా బృందంగానే తింటాయి. ఐకమత్యమే మహాబలం అన్నది చీమ చెప్పకనే చెబుతుంది. నాయకుడు చెప్పిన మాటకు కట్టుబడి వుంటాయి. అతడు విధించిన నియమ నిబంధనలతోనే ముందుకు సాగుతాయి. అన్నీ ఒకేలాగా తమ నాయకుడి మాటను వింటాయి. ఐకమత్యంగా అవి ఆహారం సేకరిస్తాయి. ఇంటి నిర్మాణం కూడా అలాగే కలసి మెలసి చేస్తాయి. తమ ప్రాంతాన్ని ఎంతో పరిశుభ్రంగా వుంచుకుంటాయి.

చీమలకు సోమరితం తెలియదు. శరీరాన్ని దాచుకోకుండా శక్తివంచన లేకుండా పని చేస్తాయి. తమకన్నా ఎక్కువ బరువున్న వస్తువులను మోస్తూ, తమ బాధ్యతలను నిర్వర్తిస్తాయి. చీమల క్రమశిక్షణ ఎంతో గొప్పగా ఉంటుంది. అవి అడ్డదిడ్డంగా నడవవు. ఒక పద్ధతిలోనే ఒకదాని వెనుక ఒకటి క్యూ లైన్‌లో వెళ్తాయి. చీమలు గోడ వారగా వాటి ప్రయాణాన్ని సాగిస్తాయి. ఇతరులకు ఆటంకం కలిగించవు. వాతావరణాన్ని బట్టి వాటి అలవాట్లను మార్చుకుంటాయి. వాటి జీవనశైలిని కూడా మార్చుకుంటాయి. ఈ ప్రకృతిలో ఎంతో క్రమశిక్షణగా, బుద్ధిగా జీవించేవి చీమలని తెలుస్తుంది.


# కంటికి క్యారెట్..

మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు తినడంపై శ్రద్ధ వహించాలి. ఏం తింటున్నాం అనే దానిపై ధ్యాస పెట్టాలి. మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి తగినంత పోషకాలు ఉన్న మంచి ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవాలి. క్యారెట్‌లో పోషకాలు అధికంగా ఉంటాయి. మన భారతీయ వంటకాల్లో, చైనీస్ వంటలలో, సలాడ్ లేదా హల్వా తయారీలో ఎక్కువగా ఉపయోగించే కూరగాయ క్యారెట్ మనకు ఏడాది పాటు అందుబాటులో ఉంటుంది.



ప్రాణాంతక వ్యాధి క్యాన్సర్‌ను నివారించడంలోనూ, కళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో క్యారెట్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. క్యారెట్ పొటాషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలతో సమృద్ధిగా ఉంటుంది. క్యారెట్‌లో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ బి6 పుష్కలంగా ఉన్నాయి. అలాగే క్యారెట్‌లో యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఉన్నాయి. ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. క్యారెట్‌లోని విటమిన్ సి చిగుళ్ళు, దంతాలు, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.

# షార్ట్ స్లీపర్స్.. సూపర్ స్లీపర్స్..



రోజులో ఎనిమిది నుంచి తొమ్మిది గంటల నిద్ర లేకపోతే అల్జీమర్స్ వంటి వ్యాధులు రావచ్చని వైద్యులు చెబుతున్నారు. మరోవైపు కొందరు నాలుగు గంటలు మాత్రమే నిద్ర పోయినా ఏ అనారోగ్యాలు లేకుండా వాళ్లు ఎలా హుషారుగా ఉంటున్నారో తెలుసుకునేందుకు చైనీస్ అకాడమీ ఆఫ్ సెన్సస్‌కి చెందిన శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. ఎస్ఐకె3, ఎన్783వై అనే అరుదైన జన్యువులే ఇందుకు కారణమని పరిశోధకులు తేల్చారు. ఈ రకమైన జన్యువులున్న వారిని షార్ట్ స్లీపర్స్, సూపర్ స్లీపర్స్ అని అంటున్నారు. అంత తక్కువ నిద్రలో కూడా కణాలు మరమ్మతు పనులూ, శరీరంలో వ్యర్థాలని తొలగించడం వంటి పనులూ జరిగి పోతుంటాయట. ఈ జన్యువులని నిద్రలేమితో బాధపడే వారికి, అల్జీమర్స్ వంటి సమస్యలతో ఇబ్బందిపడేవారికి అందిస్తే వాటి నుంచి ఉపశమనంఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# ఆరోగ్య భాగ్యం
## సెలెరీ ఆకుకూర

సెలెరీ మధ్యధరా ప్రాంతానికి చెందింది. ఇది యూరోప్, ఉత్తర ఆఫ్రికాలోని చిత్తడి నేలలు, దక్షిణ ఆసియాలోని పర్వత ప్రాంతాల్లో అటవీ ప్రాంతాల్లో కన్పిస్తుంది. ఇది పురాతన కాలం నుండి సాగులో ఉందనడానికి అనేక నిదర్శనాలున్నాయి. 400 బిసిలో గ్రీక్ పురావస్తు శాఖ వాళ్లు దీన్ని గుర్తించిన సుగంధ ద్రవ్యాల్లో ఇది ఒకటి. తర్వాత 1623లో మొదట ఫ్రాన్స్‌లో నమోదు చేయబడింది. దీనికి 1664లో జాన్ ఎవెలిన్ సెల్లరీ అని పేరు పెట్టడమైంది. ఇది మొదట ఆంగ్లపదం సెలెరీ ఫ్రెంచ్ సెలెరీ నుండి వచ్చింది. ఇది చివరి లాటిన్ సెలినాన్ నుండి వచ్చింది.

1753లో కార్ల్ తిన్నెయస్ సెలెరీని ఆపియం గ్రేవోలెన్స్ డల్స్ గ్రూప్‌లో చేర్చడమైంది. 1806లో నాలుగు సాగు రకాల్ని గుర్తిస్తే 18వ శతాబ్దం నుండి యూరోప్, ఉత్తర అమెరికాలో విలువైన ఆకుకూరగానే కాకుండా కూరగాయగా మారింది. ఇది కరకరలాడే నీటితో నిండిన ఆకుకూర. ఇది తెలుపు, ఆకుపచ్చ, గులాబీ, పసుపు రంగులో లభ్యమవుతుంది. దీన్ని చైనీస్ సెలెరీ నాన్ లింగ్ సెలెరీ, లీఫీ సెలెరీ, కట్టింగ్ సెలెరీ, స్మాల్లేజ్, కింట్ సాయి, టాంగ్ అని అంటారు.



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

సంస్కృతంలో దీన్ని శాలరీ అజ్మూద్, రంధుని ఆకుకూరలు అంటే అజ్మోద, బంధురి, బానుర్, కార్నేలీ, అయమోదకం, బోడియాజోడ్, అజ్మోద్ కర్నేలి అని వివిధ ప్రాంతాల్లో పిలుస్తారు. దీన్నే సెలెరియాక్ , నాబ్ సెలెరీ అని అంటారు. అంతేకాకుండా జర్మనీలో సెల్లెరీ, స్పానిష్‌లో అపియో, అరబిక్‌లో కరాఫ్స్, ఇటలీలో సెడానో, పోర్చుగీస్‌లో ఐపో, చైనాలో చిన్ అని వ్యవహరిస్తారు.

దీని శాస్త్రీయనామం ఆపియం గ్రేవోలెన్స్ సెకాలినం. ఇది అపియేసి కుటుంబానికి చెందింది. ఇది సమశీతోష్ణ దేశాలైన ఐరోపా, పశ్చిమా ఆసియా, చిత్తడి ప్రదేశాల్లో ఎక్కువగా కన్పిస్తుంది.

# వెండి తెరకు తెలుగు భామల జోరు



టాలీవుడ్‌కు తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్‌తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల నుంచి పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది. వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్‌ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్‌లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య బేబీ సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు మానస వారణాసి పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు కపుల్ ఫ్రెండ్లీ సినిమాతో అలరించనుంది. మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్‌కి రీచ్ కాలేదు. కపుల్ ఫ్రెండ్లీ మాత్రం రిలీజ్‌కి ముందే మంచి బజ్ తెచ్చుకుంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు, పొయెటిక్‌గా అనిపించేలా రొమాన్స్ ఉంటుందని చెప్పడం యూత్‌ను ఎక్కువగా ఆకర్షిస్తోంది. తాజాగా తన సినిమా ప్రమోషన్లలో చీరకట్టులో చాలా సింపుల్‌గా కనిపించింది మానస వారణాసి. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వంలో, సంతోష్ శోభన్ జోడీగా మానస వారణాసి విడుదలకు ఒక రోజు ముందే, అంటే శుక్రవారం తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని ఏఏఏ సినిమాస్‌లో, విశాఖలోని మెలోడీ, విజయవాడలోని శైలజ థియేటర్లలో, ప్రీమియర్లు ప్రారంభమయ్యాయి.

## త్రీ ఇడియట్స్ సీక్వెల్ ప్లాన్




బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీ ఇటీవల బిగ్ ఫెయిల్యూర్స్‌తో ఇబ్బందుల్లో ఉన్నారు. విజయాల బాట పట్టేందుకు ఆయన ప్రస్తుతం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తన కెరీర్‌కు మైలురాయిగా నిలిచిన సూపర్ హిట్ మూవీ 3 ఇడియట్స్‌కు సీక్వెల్‌ను ప్లాన్ చేస్తున్నట్లు రాజ్‌కుమార్ హిరానీ ధృవీకరించారు. మున్నాభాయ్, పీకే, త్రీ ఇడియట్స్ వంటి కల్ట్ క్లాసిక్ చిత్రాలను రూపొందించిన హిరానీకి దేశవ్యాప్తంగా విశేషమైన అభిమాన గణం ఉంది.

## కొత్త ప్రయోగానికి రెడీ



దర్శకుడు క్రిష్ జాగర్లమూడి కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఘాటి ఆశించిన ఫలితం ఇవ్వకపోవడంతో ఈసారి అడ్వెంచర్ జానర్‌లో ట్రెక్కింగ్ నేపథ్యంలో కథ సిద్ధం చేస్తున్నారని తెలుస్తోంది. ఈ చిత్రంలో ఏకంగా ఏడుగురు హీరోయిన్‌లు ప్రధాన పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. ప్రకృతి మధ్య సాగే సర్వైవల్ డ్రామాగా, ఎమోషన్స్ మేళవించి తెరకెక్కించాలనే ప్లాన్‌లో ఉన్నారని తెలుస్తోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయట. టాలీవుడ్‌లో కంటెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చే దర్శకుల్లో క్రిష్ జాగర్లమూడి పేరు ముందు వరుసలో ఉంటుంది. సామాజిక సందేశాలతో కూడిన కథలను విభిన్న కోణంలో చూపిస్తూ తనకంటూ ప్రత్యేకమైన బ్రాండ్‌ను సృష్టించుకున్నారాయన. గమ్యం, వేదం, కంచె వంటి చిత్రాలతో భావోద్వేగాలను లోతుగా ఆవిష్కరించిన క్రిష్ చారిత్రక నేపథ్యంలోని`గౌతమిపుత్ర శాతకర్ణి'తో విజువల్ గ్రాండియర్‌ను కూడా చూపించారు. కథలో బలం, పాత్రల్లో నిజాయితీ, భావాల్లో సహజత్వం ఇవన్నీ క్రిష్ సినిమాల్లోని ప్రత్యేకతలుగా చెప్పుకోవచ్చు. అందుకే ఆయన నుంచి కొత్త సినిమా వస్తుందంటే ప్రేక్షకుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంటుంది. అయితే గతేడాది విడుదలైన`ఘాటి' చిత్రం ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరచడంతో క్రిష్ తదుపరి ప్రాజెక్ట్‌పై మరింత జాగ్రత్తగా దృష్టి పెట్టినట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా పరాజయాలు పలకరిస్తుండటంతో ఈసారి పూర్తిగా భిన్నమైన కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావాలని ఆయన భావిస్తున్నారట. తాజా సమాచారం ప్రకారం క్రిష్ రూపొందించబోయే కొత్త చిత్రం అడ్వెంచర్ జానర్‌లో ఉండబోతోంది. ముఖ్యంగా ట్రెక్కింగ్ నేపథ్యంలో సాగే కథగా దీన్ని ప్లాన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది.

## వారణాసి కథ పౌరాణికమే



మహేశ్ బాబు హీరోగా తెరకెక్కిస్తున్న వారణాసి సినిమా ఏ స్థాయిలో ఉంటుందన్నది ప్రేక్షకుల ఊహకే వదిలేశారు దర్శకుడు రాజమౌళి. తన సినిమాల కథలను ముందుగానే చెప్పే ఈ డైరెక్టర్.. ఈసారి భిన్నంగా టైటిల్ గ్లింప్స్ ఆసక్తి రేకెత్తించిన సంగతి తెలిసిందే. ఈ సినిమా జానరు ఒక్కొక్కరు ఒక్కోలా ఊహించుకున్నారు. ఆటోమేటిక్ వీల్‌చైర్‌లో విలన్ పాత్రధారి పృథ్వీరాజ్ సుకుమారన్ ఫస్ట్‌లుక్‌ను బట్టి ఇది సైన్స్ ఫిక్షన్ మూవీ అంటూ ప్రచారం జరిగింది. మరి, ఇది సై ఫై (సైన్స్ ఫిక్షన్) మూవీనా? కాదా? అన్న ప్రశ్నకు స్వయంగా రాజమౌళినే సమాధానమిచ్చారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. వారణాసి సైన్స్ ఫిక్షన్ ఫీల్ ఉన్నా.. ఇది ఆ జానర్ మూవీ కాదని, ఫాంటసీ మైథలాజికల్ ఫిల్మ్ అని స్పష్టం చేశారు.

## పిచ్చి పిల్ల కోసం దిల్‌లో విల్లా కట్టేస్తాం..



శుభం సినిమాతో విజయాన్ని అందుకు హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న తాజా సినిమా దీవాన. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. శుభం సినిమాతో విజయాన్ని అందుకు హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న తాజా సినిమా దీవాన. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఈ సినిమా స్టోరీ పోస్టర్, వీడియో రిలీజ్ చేశారు. డీప్ లవ్ లో ఉన్న హీరో తన ప్రేమ గురించి, ప్రేయసి గురించి చెబుతూ ఈ వీడియో సాగుతుంది. లవ్ అనేది కావాలని ఎవడు చేయడు, అది ఐపోతది అంతే, ఒక పిచ్చి పిల్ల కోసం దిల్ లో విల్లా కట్టేస్తాం, ఆ ఒక్క పిల్ల వల్ల జీవితం ఉల్టా పల్టా ఐపోతున్నా గాల్లో తేలుతుంటం, ప్రాణం పెట్టేస్తాం, జాన్ ఇచ్చేస్తం, ఆ వైబే వేరుంటది లే, లవ్ లైట్‌గా ఉన్నంత వరకే బ్రో ఎవడైనా లవర్ బాయ్, అదే లవ్ దిల్ మొత్తం నిండిపోతే అప్పుడు తయారైతడు ఒక దివానా, ప్యార్ ఒక కిర్రాక్ నషారా బై, సస్తున్నా మస్తు ఉంటది.. అంటూ హీరో తన లవ్ ఫీల్‌ను చెప్పడం ఆకట్టుకుంది. హర్షిత్ రెడ్డి ఈ వీడియోలో కొత్తగా కనిపిస్తున్నారు. ఆయన నటన ఇంప్రెస్సివ్‌గా ఉంది.

# తెర



## మా నమ్మకం నిజమైంది
### సక్సెస్ మీట్‌లో ఫంకీ నిర్మాత నాగవంశీ

విశ్వక్ సేన్, కయాదు లోహార్ జంటగా నటించిన ఫంకీ సినిమాకు ప్రేక్షకుల నుండి చక్కని ఆదరణ లభిస్తోందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. శుక్రవారం విడుదలైన ఈ సినిమాను అనుదీప్ కె.వి. డైరెక్ట్ చేశారు. విశ్వక్ సేన్, కయాదు లోహార్ జంటగా నటించిన ఫంకీ సినిమా శుక్రవారం విడుదలైంది. అనుదీప్ కె.వి. దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా తీశారు. శుక్రవారం మధ్యాహ్నం సంస్థ కార్యాలయంలో సక్సెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ, ఈ సినిమా రెండు గంటల పాటు హాయిగా నవ్వుకునేలా ఉంటుందని ముందు నుంచీ చెబుతూ వచ్చాం. మా నమ్మకం నిజమై ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇది కేవలం ప్రేక్షకులను నవ్వించాలనే ఉద్దేశంతో చేసిన సినిమా. ఆ విషయంలో మేము విజయం సాధించాం. డిస్ట్రిబ్యూటర్లు కూడా ఫోన్ చేసి సినిమా బాగుంది అన్నారు. కామెడీ బాగుంది, అలాగే సెకండ్ హాఫ్‌లో మదర్ ఎమోషన్ పండిందని చెబుతున్నారు. ప్రేక్షకులంతా థియేటర్లకు వెళ్ళి, సినిమా చూడండి. మీ టికెట్ డబ్బులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుంది. నవ్వుకోడానికి థియేటర్‌కి రండి.. అసలు నిరాశ చెందరు అని హామీ ఇచ్చారు. దర్శకుడు అను దీప్ కె.వి. మాట్లాడుతూ, కుటుంబంతో కలిసి చూసి ఎంజాయ్ చేసేలా ఒక ఫ్యామిలీ ఎంటర్టైనర్ తీయాలనే ఉద్దే శంతో ఫంకీ సినిమా చేశాం. సినిమాలో కామెడీతో పాటు ప్రేమకథ, భావోద్వేగాలు కూడా బాగా పండాయి. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల సంతోషంగా ఉంది అని అన్నారు. అనంతరం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు నాగవంశీ తనదైన రీతిలో సమాధానం చెప్పారు. ఈ సినిమా రివ్యూవర్స్‌కు నచ్చదని తనకు తెలుసని అన్నారు. తాము సాగర సంగమం తీసామని చెప్పడం లేదని, ఓ చిన్న సిల్లీ కామెడీ ఫిల్మ్ తీశామని తెలిపారు. సినిమాకు కావాల్సిన గ్రామర్ ఇందులో లేదని తమకు తెలుసని, అనుదీప్‌తో సినిమా అంటే అలానే ఉంటుందని, సినిమా మీద సినిమా తీస్తే కొంత రిస్క్ అని తెలిసీ తీశామని అన్నారు. సినిమాలో ఫ్లో లేదని, అంతా బిట్స్ బిట్స్‌గా ఉం దని కొందరు చేస్తున్న విమర్శల గురించి ఆయన మాట్లా డుతూ, ఇలాంటి సినిమాలు ఇలానే ఉంటాయని సమర్థిం చుకున్నారు. ఈ సినిమాలోని వినోదాన్ని ఆడియెన్స్ ఎంజా య్ చేస్తున్నారని తెలిపారు.

## తండ్రి పేరు కలిసొచ్చేలా
### వారసుడికి నామకరణం

రామ్ చరణ్, ఉపాసన దంపతులకు కవలలు జన్మించడంతో మెగాకుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది.. తాజాగా ఆ కవల పిల్లలకు నామకరణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కుమారుడికి శివరామ్, కుమార్తెకు అన్వీరా దేవి అని పేరు పెట్టినట్టు చరణ్ చెప్పారు. వారికి ఈ పేర్లు పెట్టడానికి గల కారణాలను కూడా ఆయన వివరించారు. పిల్లలపేర్లు వినగానే ఆధ్యాత్మిక భావం కలిగేలా ఉండాలని అనుకున్నాం. మా అబ్బాయి పేరు శివరామ్. శివుడు, రాముడు పేర్లు కలిసి వచ్చేలా పెట్టాం. అలాగే, మానాన్నపేరు శివశంకరవరప్రసాద్ పేరు కలిసివచ్చేలా పేరుపెట్టారు. ఇకకుమార్తె పేరు అన్వీరా దేవి. అన్... అంటే అపరిమితమైన, వీర అంటేధైర్యం. దేవి అంటేదైవికశక్తి. అపరితమైనధైర్యాన్ని,దైవికశక్తిని సూచించేలా ఈపేరు పెట్టాం అని చెర్రీ వివరించారు. కాగా, ఈ పేర్లపై చిరంజీవి దంపతులు సైతం ఆనందాన్ని వ్యక్తం చేశారు.



## సిద్దుతో వాసిత్ గోలీ హిలేరియస్ ఎంటర్టైనర్

రాజ రాజ చోరతో బాక్సాఫీస్ విజయాన్ని అందుకుని, స్వాగ్‌తో విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకున్న దర్శకుడు హాసిత్ గోలీ. ప్రస్తుతం ఆయన మరో కొత్త చిత్రానికి తెరకెక్కించే సన్నాహాల్లో ఉన్నారు. ఈ చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటిస్తారనితెలిసింది. యువతను ఆకట్టుకునే టైమింగ్, కామెడీ టచ్ ఉన్న సిద్ధు స్టైల్‌కు హాసిత్ రాసిన కథ బాగా సరిపోతుందనే అభిప్రాయంవ్యక్తమవుతోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని, త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే నిర్మిస్తారని





జింబాబ్వే ఉంచిన లక్ష్యం 170 రన్స్
ఆస్ట్రేలియా ఈ స్కోరును ఊదేస్తుందని అందరి అంచనా
పెవిలియన్‌కు క్యూకట్టిన హేమాహేమీలు
తీరా చూస్తే కంగారూలు 146 ఆలౌట్

# ఆస్ట్రేలియాకు షాక్‌లగా!

## టీ20 ప్రపంచకప్‌లో జింబాబ్వే సంచలనం * ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ ముజర్బానీ

**కొలంబో:** టీట్వంటీ ప్రపంచకప్ లో ఎట్టకేలకు సంచలనం నమోదైంది. హాట్ ఫేవరేట్ ఆస్ట్రేలియాకు అనామక జింబాబ్వే షాకిచ్చింది. 23 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మొదట బ్యాటింగ్ లో మెరు పులు మెరిపించిన జింబాబ్వే... బంతితోనూ చెలరేగింది.

**అదిరిన శుభారంభం**

కొలంబో వేదికగా జరిగిన మ్యాచ్‌లో మొదట జింబాబ్వేకు దిగిన ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్, తదివనాషే చక్కని శుభారంభాన్ని అందించారు. ఆస్ట్రేలియా బౌలర్లపై విరుచుకుపడుతూ ఓవర్‌కు పది పరుగుల చొప్పున సాధిస్తూ తొలి వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 21 బంతుల్లో 35 రన్స్ చేసిన తదివనాషే ను స్టోయినీస్ అవుట్ చేశాడు. క్రీజ్ లోకి వచ్చిన ర్యాన్ బర్ల్‌తో కలిసి బెన్నెట్ స్కోరును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో 43 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. జింబాబ్వే స్కోరును వంద పరుగులు దాటించాడు. ర్యాన్ బర్లేతో కలిసి రెండో వికెట్ కు 70 పరుగులు, మూడో వికెట్ కు కెప్టెన్ సికిందర్ రజా కలిసి అజేయంగా మూడో వికెట్‌కు 38 పరుగులు అందించాడు. దీంతో జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. బెన్నెట్ 56 బంతుల్లో 64 పరుగులతో, సికిందర్ రజా 25 పరుగులతో అజేయంగా నిలిచారు.

**ఆరంభం నుంచే తడబాటు**

170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఆరంభంనుంచే తడబడింది. 24పరుగులకే ఓపెనరిద్దరినీ కోల్పోయింది. మొదట కామెరూన్ గ్రీన్ ను డకౌట్ చేసి ఇవాన్స్... కాసేపటికే ట్రావిస్ హెడ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి జింబాబ్వేకు బ్రేక్ అందించాడు. మరో అయిదు పరుగులకు మరో రెండు వికెట్లు కోల్పోయింది. టిమ్ డేవిడ్ డకౌట్ కాగా, 31 పరుగులు చేసి మాక్స్‌వెల్ అవుటయ్యాడు. ఈ రెండు వికెట్లు కూడా ముజర్బానీ ఖాతాలో చేరాయి.

**పోరాడిన మాట్ రెన్‌షా**

ఒకవైపు సహచరులు పెవిలియన్‌కు చేరుతున్నా మరో ఎండ్‌లో మాట్ రెన్‌షా ఒంటరిపోరాటం చేశాడు. జింబాబ్వే బౌలర్లను ధాటిగా ఎదుర్కొంటూ 44 బంతుల్లో 5 బౌండరీలు, ఓ సిక్స్‌తో 65 పరుగులు సాధించాడు. బ్రాడ్ ఇవాన్స్, ముజర్బానీ బౌలింగ్ ధాటికి మార్కస్ స్టోయినీస్, బెన్, నాథన్ ఇలియాస్, ఆడమ్ జంపా సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరారు. దీంతో ఆస్ట్రేలియా మరో మూడు బంతులు మిగిలిఉండగానే 146 పరుగులకు ఆలౌటైంది. జింబాబ్వే బౌలర్లలో ముజరబ్బానీ 4 వికెట్లు,బ్రాడ్ ఇవాన్స్ మూడు వికెట్లు పడగొట్టి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. ముజర్బానీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**సంక్షిప్త స్కోర్లు: జింబాబ్వే–169/2**(20 ఓవర్లలో) (బెన్నెట్ 64 నాటౌట్, తదివనాషే 35, ర్యాన్ 35, సికందర్‌రజా 25 నాటౌట్); **ఆస్ట్రేలియా–146 ఆలౌట్**(19.3 ఓవర్లలో) (మాట్ రెన్‌షా 65, మాక్స్‌వెల్ 31, ముజర్బానీ 4/17, బ్రాడ్ ఇవాన్స్ 3/23)

# ఆట

## కోలుకున్న అభిషేక్ శర్మ, పాక్‌తో మ్యాచ్‌కు రెడీ



**న్యూఢిల్లీ:** చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ తో ఆదివారం తలపడనున్న టీమిండియాకు గుడ్ న్యూస్ అందింది. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న డాషింగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ కోలుకున్నాడు. పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలున్నట్లు టీమిండియా ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. ప్రస్తుతం అభిషేక్ ఆరోగ్యం బాగానే ఉందని, ప్రాక్టీసులో కూడా చేశాడని వెల్లడించాడు. టోర్నీ ఆఫ్ ది మ్యాచ్‌కు సిద్ధమవుతున్నట్లు తెలిపాడు.

### మహిళల ఆసియా కప్

## భారత్‌పై 7 వికెట్లతో యుఎఇ విజయం



**న్యూఢిల్లీ:** మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. పసికూన యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ (యూఏఈ) చేతిలో రాధయాదవ్ సారథ్యంలోని భారత జట్టు ఖంగుతింది. దాంతో ఈ టోర్నీని ఘోర పరాజయంతో ప్రారంభించింది. యూఏఈతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన టీమిండియా 7 వికెట్ల తేడాతో చిత్తయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఇషా ఒజా(72 నాటౌట్, 2/30) ఆల్‌రౌండ్ షోతో భారత్ పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 130 పరుగులు చేసింది. అనుష్క శర్మ(45 బంతుల్లో 7 ఫోర్లతో 47), తనూజ కన్వార్(25 బంతుల్లో 5 ఫోర్లతో 34) మినహా, మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. కెప్టెన్ రాధా యాదవ్(7) తీవ్రంగా నిరాశపర్చింది. యూఏఈ బౌలర్లలో సమైరా ధరింధర్కా(3/40) మూడు వికెట్లు తీయగా, వైష్ణవే మహేష్(2/13), ఇషా ఒజా(2/30) రెండేసి వికెట్లు పడగొట్టారు. కొట్టే సురక్ష, అతిగే సిల్వా చెరో వికెట్ తీసారు. అనంతరం యూఏఈ 19.2 ఓవర్లలో 3 వికెట్లకు 131 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ ఇషా ఒజా(61 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 72 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించింది. సమైరా(31 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో రాధా యాదవ్, ప్రేమ రావత్, తనూజ కన్వార్ తలో వికెట్ తీసారు. కాగా భారత్ సెమీఫైనల్ చేరాలంటే తదుపరి రెండు మ్యాచ్‌లను మెరుగైన రన్‌రేట్‌తో గెలవాలి. లేదంటే లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమిస్తోంది

## క్వార్టర్ ఫైనల్లో దియా, మనుష్ జోడీ



**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కాంటెండర్ చెన్నై 2026టోర్నమెంట్‌లో భారత్ టాప్ మిక్స్‌డ్ డబుల్స్ జోడీ దియా చిటాలే–మనుష్ షా క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. మరో భారత్ టాప్ సీడ్ పురుషుల డబుల్స్ కలయిక మానవ్ ఠక్కర్– మనుష్ షా ద్వయం తొలిరౌండ్లోనే ఓడిపోయారు. ఈ టోర్నీలో షా–దియా కొరియా, రిపబ్లిక్‌కు చెందిన ఓహ్ సెయుంగ్వాన్–కిమ్ సియోంగ్జిన్‌లను ఓడించారు. తర్వాత హోమ్ ఫేవరెట్ జట్టు 42 నిమిషాల్లో 3–2 (10–12, 11–6, 12–10, 5–11, 12–10) తేడాతో విజయం సాధించింది. మొదటి రౌండ్ పోరులో కజకిస్తాన్‌కు చెందిన ఇస్కేందర్ ఖార్కి–సర్వినోజ్ మిర్కాదిరోవాను 11–8, 11–6, 11–7 తేడాతో ఓడించిన భారత వైల్డ్ కార్డ్స్ పయాస్ జైన్–సిండ్రెలా దాస్‌లను ఎదుర్కోనున్నారు. మహిళల సింగిల్స్ మొదటి రౌండ్‌లో 15 ఏళ్ల దివ్యాంశి భౌమిక్ కొరియా ప్లేయర్ ర్యూ హన్నాపై చేతిలో పోరాడి ఓడింది.

# అర్జెంటీనా చేతిలో భారత్ చిత్తు

## పురుషుల ప్రో లీగ్ హాకీ

**న్యూఢిల్లీ:** పురుషుల ప్రో లీగ్ 2025–26, రూర్కెలా లెగ్‌లో అర్జెంటీనా చేతిలో భారత్ 0–8 తేడాతో ఓడిపోయింది. టోమస్ డొమెనె (15వ నిముషం, 20, 26, 60), టోమస్ రూయిజ్ (14), లూసియో మెండెజ్ (22), ఇగ్నాసియో ఇబారా (25), నికోలస్ డెల్లా టోర్రే (30) గోల్స్ చేశారు. భారత్ మొదటి క్వార్టర్ చివరిలో పెనాల్టీ స్ట్రోక్ లభించడంతో ఆతిథ్య జట్టుకు తొలి గోల్ చేసే అవకాశం లభించి గోల్ చేసింది. రూయిజ్ తొలి క్వార్టర్‌లో డొమెనే సూరజ్ కర్కేరాను అధిగమించి జట్టుకు 2–0 తో ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. భారత్ రెండవ క్వార్టర్‌ను అర్జెంటీనాపై ఒత్తిడి పెంచుతూ ప్రారంభించింది. శిలానంద్ లక్రా మరియు హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు పెనాల్టీ కార్నర్‌లను సాధించడంలో రాణించినా కానీ ఆతిథ్య జట్టు తమ మొదటి గోల్‌ను పూర్తిగా సాధించలేకపోయింది. అర్జెంటీనాపై ఒత్తిడిని తెచ్చినా దాన్ని అధిగమించి లూసియో మెండెజ్ ద్వారా నాల్గవ గోల్‌ను జోడిం ఆధి క్యాన్ని పెంచుకుంది. ఇబార్రా ఐదవ గోల్, ఆ తర్వాత డొమెనే హ్యాట్రిక్‌తో మరో గోల్, డెల్లా టోర్రే కూడా స్కోర్‌షీట్‌లో నిలవడంతో అర్జెంటీనా 7–0 ఆధిక్యంతో మొదటి అర్ధభాగాన్ని ముగించింది. రెండవ అర్ధభాగంలో భారత్ శిలానంద్ లక్రా, ఆదిత్య లాలేజ్ గోల్స్‌కు దగ్గరగా వచ్చినా థామస్ శాంటియాగో గోల్ చేయడంతో అర్జెంటీనా అగ్రస్థానంలో నిలిచింది. చివరి క్వార్టర్‌లో భారత్‌కు మూడో పెనాల్టీ కార్నర్ లభించినా విఫలమయ్యారు.



### ఆర్యాన్ష్, సోహైబ్ హాఫ్ సెంచరీలు

# కెనడాపై యుఎఇ విజయం





**న్యూఢిల్లీ:** టీ ట్వంటీ ప్రపంచకప్‌లో యూఏఈ తొలి విజయం నమోదుచేసింది. అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో కెనడాపై అయిదు వికెట్ల తేడాతో గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 150పరుగులు చేసింది.హర్ష్ థాకర్ 50పరుగులతో టాప్ స్కోరర్ గా నిలిచాడు. నవ్‌నీత్ 34 పరుగులతో రాణించాడు. జునైద్ సిద్ధిఖీ 5వికెట్లు తీసి కెనడాను కట్టడిచేశాడు.

అనంతరం 151 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 19.4 ఓవర్లలోనే అయిదు వికెట్లు కోల్పయి అందుకుంది. 66 పరుగులకే నాలుగు టాప్ ఆర్డర్ వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడ్డ యూఏఈని ఆర్యాన్ష్ శర్మ, సోహైబ్ ఖాన్ ఆదుకున్నారు. అర్ధసెంచరీలతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. ఆర్యాన్ష్ 53 బంతుల్లో 6 బౌండరీలు, మూడు సిక్స్‌లతో అజేయంగా 74 పరుగులు సాధించాడు. 5 వికెట్లు తీసిన జునైద్ సిద్ధిఖీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో రూ.7లక్షల కోట్లు ఆవిరి

## ఎఐ ప్రభావంతో ఐటి షేర్లు భారీ పతనం




**ముంబయి, ఫిబ్రవరి 13:** ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ స్టాక్స్‌లో నెలకొన్న భారీ ప్రతికూలత వారాంతంలో కూడా కొనసాగింది. ఎఐ అమలుతో మార్కెట్లలోని ఐటి కంపెనీలకు భారీ విఘాతం కలిగింది. మేజర్ ఐటి కంపెనీల షేర్లుఐదుశాతం వరకూ ఇంట్రాడేలో నష్టం జరిగింది. దిగువ స్థాయిలో జరిగిన కొన్ని కొనుగోళ్లు మార్కెట్లకు కొంత కలిసొచ్చింది. నిఫ్టీ ఐటి సూచీ ఇప్పటికీ 1.50శాతం దిగజారింది. ఐటిస్టాక్స్‌లో నిరంతర అమ్మకాలు కొనసాగాయి. గ్లోబల్‌ధోరణులు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. బిఎస్ఇ సెన్సెక్స్ ఎన్ఎస్ఇ నిఫ్టీలు రెండూ కూడా 1.3శాతం చొప్పున క్షీణించాయి. సెన్సెక్స 1038 పాయింట్లు క్షీణించి 82,627 పాయింట్లవద్ద స్థిరపడితే నిఫ్టీ 50 సూచీ కూడా 336 పాయింట్లు క్షీణించి 25,471వద్ద స్థిరపడింది. అమ్మకాల ఒత్తిడి ఎక్కువ కనిపించింది నిఫ్టీ 50లో కనీసం 44 విభాగాలు నష్టాల్లోనే కొనసాగాయి. ఇన్వెస్టర్లు సుమారు ఏడులక్షలకోట్ల సంపదను నష్టపోయినట్లు తేలింది. బిఎస్ఇలో నమోదయిన కంపెనీల విలువలు సుమారు 465.37 లక్షలకోట్లుగా ఉంది. అదే ముందురోజు ట్రేడింగ్‌ముగిసేనాటికి 472.50 లక్షలకోట్లుగా ఉందని తేలింది. ప్రైవేటు బ్యాంకులు, మెటల్స్, ఇంధన షేర్లుకూడా అమ్మకాల జోరులో వెనక్కితగ్గాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌సూచీ 1.58 శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.50శాతం క్షీణించింది. పదేళ్ల బెంచ్‌మార్కు బాండ్లు 0.10శాతం 6.679వద్దముగిసాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారెం విలువలు 90.65వద్ద కదలాడింది. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్2 సెటిల్‌మెంట్‌నాటివి 0.74శాతం క్షీణించి రూ.153.970గా నడిచింది. నిఫ్టీలో మెటల్ సూచీ 3.31శాతం క్షీణించింది. హిందాల్కో 6.08శాతం, నేషనల్ అల్యూమినియం కంపెనీ 5.42శాతం, హిందూస్థాన్ కాపర్ 5.16శాతం జింక్ 4.91శాతం, వేదాంత 4.11శాతం, జిందాల్ స్టెయిన్‌లెస్ 4.10శాతం, ఆదాని ఎంటర్‌ప్రైజెస్ 383శాతం వెల్‌స్పన్ కార్ప్ 3.63 శాతం, ఎన్ఎండిసి 342శాతం క్షీణించాయి. ఇంజినీర్స్ ఇండియా 11.64శాతంపెరిగింది. ఇక ఒఎన్‌జిసి 3.17శాతం, మోనాసా కన్స్యూమర్ 0.82శాతం లాభపడ్డాయి.




# టొరెంట్ ఫార్మా నికరలాభం రూ.635కోట్లు


**ముంబయి, ఫిబ్రవరి 13:** టొరెంట్ ఫార్మాక్యూటికల్స్ సంస్థ నికరలాభం 26.2శాతంపెరిగింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.635 కోట్లు ఆర్జించినట్లుప్రకటించింది. ఇదే కంపెనీ గత ఏడాది ఇదే కాలానికిగాను రూ.503 కోట్లు ఆర్జించింది. కంపెనీ రాబడులు రూ.1798 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది కంటే 14శాతం పెరిగాయి. బ్రెజిల్ దేశపు రెవెన్యూ రూ.371 కోట్లుగా ఉంది. 27శాతంపెరిగింది. అమెరికా రాండులు 321కోట్లుగా ఉంటే 19శాతం పెరిగింది. జర్మనీదేశంలో అమ్మకాల రాబడులు రూ.304 కోట్లుగా ఉన్నట్లు కంపెనీ తెలిపింది. అన్ని విదేశీ మార్కెట్లలోను తాము గణనీయంగా వృద్ధిని నమోదుచేసినట్లు కంపెనీ ప్రకటించింది. టొరెంట్ ఫార్మా తాత్కాలిక డివిడెండ్ ప్రతి వాటాను రూ.29గా ప్రకటించింది. ఈ డివిడెండ్‌ను 2026 మార్చి 5 నాటికి పంపిణీ చేయాలిని నిర్ణయించినట్లు తెలిపింది. టొరెంట్ కంపెనీషేర్లు బిఎస్ఇలో శుక్రవారం 4074.05గా ట్రేడింగ్ కొనసాగింది.

# డాలరుతో రూపాయి మారకం 90.64



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు మూడు పైసలు క్షీణించి 90.64 రూపాయలవద్ద నమోదయింది. వారాంతంలో అమెరికన్ కరెన్సీ విదేశీ మార్కెట్లలో పటిష్టం అయితే దేశీయ ఈక్విటీల్లో కొంతమేర ప్రతికూలంగా నడిచింది. ఫోరెక్స్ ట్రేడర్లు వివరాలప్రకారం రూపాయి స్వల్పంగా క్షీణించిందని వర్ధమాన దేశాల మార్కెట్ కరెన్సీలపరంగా చూస్తే రూపాయి కొంతమేర సానుకూలంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజి మార్కెట్‌లో డాలరుతోరూపాయి మారకం విలువలు 90.69వద్ద ప్రారంభించి ఇంట్రాడేలో 90.60వరకూ వెళ్లింది. ఒకదశలో అత్యంత కనిష్టంగా 90.79కి కూడా క్షీణించినట్లు తేలింది. చివరికి రూపాయి ట్రేడింగ్ ముగింపులో 90.64వద్ద ట్రేడ్ అయింది. ముందురోజు రూపాయి17 పైసలు బలసడి 90.61గా నిలిచింది. రిస్క్‌సెంటిమెంట్ మరింతగా రూపాయి క్షీణతకు దోహదంచేసింది. ఎఐ కారణంగా పరిశ్రమల్లో సురక్షిత పెట్టుబడుల స్థావరాల్లోకి పెట్టుబడులు మళ్లిపోయాయి. డాలర్‌సూచీని చూస్తే ఆరు కరెన్సీల్లో 0.10శాతం ఎగువన 97.01గా నిలిచింది. బ్రెంట్ ముడిచమురు పరంగా చూస్తే 0.04శాతం దిగువన అంటే బ్యారెల్‌కు 67.49 డాలర్లుగా నడిచింది. సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా ఈక్విటీల్లో 108.42కోట్లపెట్టుబడులు పెట్టినట్లు కనిపించింది. రిటైల్‌ద్రవ్యోల్బణం కూడా జనవరి నెలలో 2.75శాతంమేర నమోదయి కొంత మార్కెట్లకు సానుకూల వాతావరణం కల్పించింది.

# ముంబయి బోరివాలిలో యాపిల్ రెండో స్టోర్



**ముంబయి, ఫిబ్రవరి 13:** ఐఫోన్ తయారీ కంపెనీ యాపిల్ తన కొత్తస్టోర్‌ను ముంబయిలోని బోరివాలిలో ప్రారంభిస్తోంది. మొత్తంగా చూస్తే భారత్‌లో ఆరోస్టోర్ ప్రారంభిస్తోంది. ముంబయిలోనే రెండోస్టోర్‌గా చెపుతున్నారు. మొదటి స్టోర్‌ను ముంబయి, రెండో ఢిల్లీలోను గత ఏడాది ఏప్రిల్‌లోప్రారంభించింది. గత ఏడాది యాపిల్ హెబ్బల్‌ను బెంగళూరులోను, యాపిల్ కోరెగాంవ్ పార్క్ స్టోర్ పూణెలోను ఇటీవలే నోయిడాలోను యాపిల్‌స్టోర్లుప్రారంభించింది. ఈనెల 26వ తేదీ ముంబయిలోని బోరివాలి స్టోర్‌ప్రారంభం అవుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. నెమలిని పోలిన ఆకృతితో ఈస్టోర్‌ను ప్రారంభిస్తారు. గతంలో బెంగళూరు, పూణెలోను నోయిడాలోకూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించింది డిజైన్‌కారణంగా విశ్వాసం, సమగ్ర వివరణ, కస్టమర్లను రాబట్టుకునేందుకు ఎక్కువ వీలుంటుందని అన్నారు. యాపిల్ బోరివాలి స్టార్టప్ కమ్యూనిటీలు, బిజినెస్ సంస్థలకు ఎక్కువ లాభదాయకంగా ఉంటుందని కంపెనీ వివరించింది.

# టాప్‌గేర్‌లో ఆటోమొబైల్ సేల్స్




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 13:** దేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 12.6శాతం పెరిగాయి. 4,49,616 యూనిట్లు విక్రయించారు. గత ఏడాది 3,99,386 యూనిట్లవరకూ విక్రయించిన కంపెనీ ఈసారి భారీ వృద్ధిని నమోదు చేసినట్లు ఆటోమొబైల్ ఉత్పత్తిదారుల సంఘాల సమాఖ్య సియామ్‌ప్రకటించింది. ప్యాసింజర్ వాహనాలు, త్రీవీలర్లు, టూవీలర్లు, క్వాడ్రిసైకిళ్లు వంటివి జనవరిలో మొత్తం 29,27,394వరకూ విక్రయించామని తెలిపింది. త్రీవీలర్లు పటిష్టంగా వృద్ధినమోదుచేసాయి. 30.2శాతం పెరిగి 75,725 యూనిట్లు అమ్ము దయినట్లు తెలిపింది. ప్యాసింజర్ వాహనాలు, టూవీలర్లు, త్రీవీలర్లు జనవరిలో గతంలో ఎన్నడూలేనంతగా విక్రయాలు జరిగాయని సియామ్ డైరెక్టర్‌జనరల్ రాజేష్ మీనన్ తెలిపారు. బడ్జెట్ వరాలు కొంత కలి సొచ్చాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరగలవని అంచనావేస్తున్నారు. టూవీలర్ విభాగంలో స్కూటర్ల విక్రయాలు 36.9శాతంపెరిగి 7,50, 580 యూనిట్లుపెరిగాయి. మోటారు సైకిళ్ల 20.3శాతంపెరిగి 11,26,416 యూనిట్లకు చేరాయి. మోపెడ్లు 16.1శాతంపెరిగి 48,607 యూనిట్లకు చేరాయి. త్రీవీలర్ల విభాగంలో ప్యాసింజర్ వాహణాలు 30.4శాతం పెరిగి 60,881 యూనిట్లుగా ఉన్నాయి. రవాణా వాహనాలు 33.4శాతంపెరిగి 13,374 యూనిట్లుగా ఉంటే ఈరిక్షా అమ్మకాలు మాత్రం 7.9శాతం క్షీణించి 925 యూనిట్లకు చేరాయి.

# ఓలా ఎలక్ట్రిక్ రూ.487 కోట్ల నష్టం

**బెంగళూరు, ఫిబ్రవరి 13:** విద్యుత్ స్కూటర్ల తయారీ సంస్థఓలా ఎలక్ట్రిక్ మూడో త్రైమాసికంలో రూ.487 కోట్ల నికరనష్టం చవిచూసింది. గత ఏడాది ఇదే కాలంలో చూ.564 కోట్లు నష్టం చవిచూసిన కంపెనీ ఈఏడాది నష్టాలను తగ్గించుకోగలిగింది. 2026 రెండో త్రైమాసికంలో రూ.418 కోట్లు మేర నష్టం చవిచూసింది. సాఫ్ట్‌బ్యాంకు మద్దతున్న స్టార్టప్ కంపెనీ ఓలా కొత్తలేబర్‌కోడ్‌ల అమలు ద్వారా రూ.5.06 కోట్ల ఒకేసారి వ్యయభారం పడింది. సంస్థ రాబడులపరంగా కూడా 55శాతం క్షీణించి రూ.470కోట్లుగా ఉంది. అదే గత ఏడాది మూడోత్రైమాసికంలో 1045 కోట్లు ఆర్జించింది. రెండోత్రైమాసికంలో కూడా 32శాతం క్షీణించి రూ.690 కోట్లుగా నమోదయింది. కంపెనీ స్కూటర్ అమ్మకాల్లో భారీ క్షీణవల్లననేనని నిపుణుల అంచనా. కంపెనీ స్కూటర్ సేల్స్ రూ.32,680యూనిట్లు విక్రయించగలిగింది. స్థూల మార్జిన్ మాత్రం 34.3శాతంమేర ఉన్నట్లుతెలిపింది. అంటే 15.7 పర్సంటేజ్ పాయింట్లు మెరుగుపడిందని చెపుతోంది.కంపెనీ ఆటోమేషన్‌ను పెంచింది. ఇటీవలపెంచిన జాబ్‌కట్స్‌కూడా త్రైమాసిక నిర్వహణ ఖర్చులు రూ.250 నుంచి రూ.300 కోట్లవరకూ ఆదా అవుతాయని చెపుతోంది. కంపెనీ మొత్తం వ్యయాలు మూడో త్రైమాసికంలో రూ.714 కోట్లుగా ఉన్నాయి. ఓలా ఎలక్ట్రిక్ కంపెనీ షేర్లు బిఎస్ఇలో రూ.30.9గా కొనసాగాయి.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.